
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 72

సోమవారం 27-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మళ్లీ దంచేశారు..

రెండో టీ20లో ఆసీస్‌పై భారత్ విజయం.. రేపు మూడో టీ20 - 12లో



కార్డులెక్కువైతే చిక్కులేనా..?

అవసరాలకు తగిన కార్డులే తీసుకోవాలి.. షరతులు తెలిసి ఉండాలి - 13లో



దేశం వేగంగా కోలుకుంది

15 ఏళ్ల క్రితం ముంబైలో జరిగిన ముష్కర మూకల దొంగదెబ్బ నుంచి దేశం వేగంగా కోలుకుందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



కోర్టులకు రావడానికి భయపడొద్దు

న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించడానికి భయపడవద్దని, నిస్సంకోచంగా కోర్టులకు రావొచ్చని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.

వివరాలు 6లో ▸



వేగంగా విస్తరిస్తున్న పార్టీ మాదే

దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న పార్టీ తమదేనని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



మాస్కోపైకి ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

మాస్కో లక్ష్యంగా డజన్ల కొద్దీ డ్రోన్లతో ఉక్రెయిన్ ఆదివారం దాడికి యత్నించినట్లు రష్యా ఆరోపించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



వైఎస్సార్ జిల్లా కడప అమీన్‌పీర్ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి హజ రత్ సయ్యద్‌షా మహమ్మద్ మహమ్మదుల్ ఆరీఫుల్లా హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సంస్థల నివేదికను సిబ్బంది సమర్పించారు.

వివరాలు 14లో ▸

దేదీప్యమానం... జ్వాలాతోరణం



కార్తీక పౌర్ణమి పురస్క రించుకుని ఆదివారం శ్రీశైల మహాక్షేత్రంలో జ్వాలాతోరణోత్సవం నిర్వహించారు. ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీను లను చేయించి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నేతితో తడిపిన నూలు వత్తులను ఏర్పాటు చేశారు.

వివరాలు 5లో ▸

ప్రధాని మోదీకి ఘనస్వాగతం



రేణిగుంట విమానాశ్రయంలో ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్

2లో

రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకున్న ప్రధాని.. నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్న మోదీ

ప్రధాని హోదాలో తిరుమలకు రావడం ఇది నాలుగోసారి

జనం మెచ్చిన జగన్



మాకు మంచి చేస్తున్న సీఎంతోనే మేమంతా అని నినదిస్తున్న ప్రజానీకం

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఇప్పటిదాకా 18.12 లక్షల కుటుంబాల భాగస్వామ్యం.. వివక్ష లేకుండా పారదర్శకంగా పథకాలతో లబ్ధిపై సర్వత్రా వెల్లివిరుస్తున్న సంతృప్తి
- 7,170 సచివాలయాల్లో సంక్షేమ-అభివృద్ధి బోర్డుల ఆవిష్కరణ పూర్తి.. మండలాలు, పట్టణాల వారీగా రోజుకు ఒక సచివాలయ పరిధిలో కొనసాగుతున్న ఆవిష్కరణ
- మరుసటి రోజు నుంచి గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ఇంటింటి సందర్శన.. రోజుకు 15 ఇళ్లను సందర్శిస్తూ చేసిన మంచిని గుర్తు చేస్తున్న వైనం
- ఒక్కో కుటుంబానికి, ఆ గ్రామానికి, రాష్ట్రానికి ఒనగూరిన మేలును వివరిస్తున్న నేతలు

3లో

అనంతపురం రైతుకు 'కర్మ వీర చక్ర' పురస్కారం

- సన్నకారు రైతు నారాయణప్ప ప్రయోగానికి అంతర్జాతీయ గుర్తింపు
- ఎనీటైం మనీ విధానంలో ఏడాది పొడవునా పంటల సాగు
- 30 సెంట్లలోనే 20 రకాల పంటలు
- రూ.5 వేల పెట్టుబడి.. రూ.2 లక్షల రాబడి
- గతంలో ఎంఎస్ స్వామినాథన్, ద్రావిడ్, పుల్లెల గోపీచంద్, కాజోల్‌కు ప్రదానం
- నేడు న్యూఢిల్లీలో పురస్కార ప్రదానం

14లో



చైనాలో 'నిమోనియా'

- అప్రమత్తమైన భారత ప్రభుత్వం
- ఆరోగ్య సంసిద్ధతపై సమీక్ష నిర్వహించండి
- అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
- ఐఎల్ఐ, ఎస్ఏఆర్ఐ కేసుల విషయంలో కోవిడ్ విధానాలనే పాటించాలని సూచన

6లో



ఆయన కిరాయి కళ్యాణ్

పవన్ కళ్యాణ్‌పై మంత్రి అంబటి మండిపాటు

- ఏపీలో సొంతిల్లు, ఓటు లేని పవన్‌కు రాష్ట్రంతో ఏం సంబంధం?
- చంద్రబాబు దగ్గర కిరాయి తీసుకుని సీఎం జగన్‌ను దూషించడమే ఆయన పని
- రంగా హత్యకు కారకుడైన వ్యక్తికి సొంత సామాజిక వర్గాన్ని అమ్మేస్తావా!
- తెలంగాణలో నువ్వు బీజేపీతో.. మీదత్త తండ్రి కాంగ్రెస్‌తోనా?

3లో



రత్నగిరిపై భక్తజనవాహిని

అన్నవరం: పవిత్ర కార్తిక మాసం.. అందునా ఉదయం శుద్ధ చతుర్దశి, మధ్యాహ్నం పౌర్ణమి తిథులు ఒకే రోజు కలసి రావడం.. ఆపై సెలవు రోజు కావడంతో రత్నగిరిపై ఆదివారం భక్తజనవాహిని పరవళ్లు తొక్కింది. భక్తవరదుడైన సత్యదేవుడిని దర్శించేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయాన్ని శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు తెరచి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సత్యనారాయణస్వామి వ్రతాలను కూడా తెల్లవారుజామున రెండు గంటలకే ప్రారంభించారు. అప్పటి నుంచి ఆదివారం సాయంత్రం వరకూ దేవస్థానంలో భక్తులు ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. బస్సులు, రైళ్లతో పాటు కార్లు తదితర వాహనాల్లో సైతం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మల్టీ పార్కింగ్ స్థలంలో వారి వాహనాలు భారీ సంఖ్యలో బారులు తీరాయి. భక్తుల రద్దీ కారణంగా ఉదయం నుంచి అంతరాలయ దర్శనం నిలిపివేశారు. వ్రత మండపాలతో పాటు నిత్య కల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహించారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ఆవులకు ప్రదక్షిణలు చేసి, రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు.



ఇంకా మూడు రోజులే ఉంటే మాకేంటి.. ఇలా అర్ధరాత్రి వస్తే ఎలా?

నిమ్మలో రాణిస్తూ..!

నిమ్మ సాగులో పల్లెపడుచులు స్వారీ చేస్తున్నారు. దుక్కిదున్నకాల నుంచి పురుగుమందులు పిచికారీ వరకు రాటుదేలుతున్నారు. అ, ఆలు రాకపోయినా అధునాతన పద్ధతులను అవలంభిస్తున్నారు. అధిక దిగుబడులు గడిస్తూ అబ్బురపరుస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఇంటి యజమానులకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. 'కాయ'కష్టానికి తోడు ఈ నాలుగున్నరేళ్లలో నిమ్మకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో అధిక ఆదాయం గడిస్తున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ పదుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. వెంకటగిరి నియోజకవర్గంలోని మహిళలు.. నిమ్మసాగులో 'రాణి'స్తూ.. కుటుంబాలను ఒంటిచేత్తో వెళ్లీదుతున్న తీరుపై సాక్షి ప్రత్యేక కథనం..

నిమ్మ సేద్యంలో ప్రతిభచూపుతున్న మహిళలు

- పురుషులతో సమానంగా వ్యవసాయ పనులు
- నీళ్లు పెట్టడం నుంచి మందుల పిచికారీ వరకు అన్నీ తామై..
- కుటుంబాలను చక్కబెడుతూ.. భర్తలకు చేయూతనిస్తున్న పల్లెపడుచులు
- వెంకటగిరి నియోజకవర్గంలో 'నిమ్మ'ళంగా సాగుతున్న కుటుంబాలు

సమాచారం

నియోజకవర్గం	: వెంకటగిరి
మండలాలు	: ఆరు
నిమ్మతోటలు	: 10 వేల హెక్టార్లలో
పనిచేస్తున్న కూలీలు	: 25 వేల మంది
ఇందులో మహిళలు	: 12,500 మందిపైనే



▸▸ ఈమె పేరు దాసరిరాజు స్వాతి. సైదాపురం మండలం, లింగసముద్రం గ్రామం. ఈమె నిమ్మతోటలో రోజువారి కూలీ. గ్రామ సమీపంలో ఉన్న నిమ్మ తోటలో వ్యవసాయ పనులు చేస్తుంటుంది. ఉదయం సద్ది కూడు మూటగట్టుకుని వెళ్లి అక్కడే ఉంటూ నిమ్మతోటకు నీరు పెట్టడం.. పురుగు మందులు పిచికారీ చేయడం లాంటివి చేస్తుంటుంది. ఆమె మగావాళ్లకన్నా దీటుగానే వ్యవసాయ పనులు చేస్తోంది.



▸▸ ఈ ఫొటోలోని మహిళ పేరు చెంచు కృష్ణమ్మ. భర్తతో కలిసి స్థానికంగా ఉన్న ఓ ఆసామి వద్ద పనిచేస్తోంది. భార్యాభర్తలిద్దరూ నిమ్మ తోటల్లోనే ఉంటున్నారు. పురుగు మందులు పిచికారీ చేయాలంటే చెంచుకృష్ణమ్మ ముందుంటుంది. ఆసామికి ఉన్న 1000 నిమ్మ చెట్లకు ఆమె ఒక్కటే పురుగుమందు పిచికారీ చేస్తుంటుంది. మగవాళ్లతో సమానంగా నిమ్మతోటల్లో సేద్యం చేస్తుంటుంది. ఆమెకు రోజువారీ కూలీ కూడా వస్తుంటుంది.



క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న మహిళ

సాక్షి, తిరుపతి డెస్క్: వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం, రాపూరు, కలువాయి, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిర రూరల్ మండలాల్లో అత్యధికంగా నిమ్మ సాగుచేస్తుంటారు. నియోజకవర్గంలోని ఈ ఆరు మండలాల్లో సుమారు 10వేల హెక్టార్లలో నిమ్మతోటలు సాగుచేస్తున్నారు. కొద్ది మంది మినహా అందరూ నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. నిమ్మ తోటల్లో పనులు చేసేందుకు ప్రత్యక్షంగా 15,000 మంది, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి దొరుకుతోంది. ఇక్కడ పనిచేసే సగం మంది కూలీలు మహిళలే కావడం విశేషం.

నిమ్మసేద్యం.. వనితా సాయం

వెంకటగిరి నియోజకవర్గంలో ఎకరాకు 100 నిమ్మ చెట్లు నాటుతున్నారు. ఇలా 25వేల ఎకరాల్లో సుమారు 2.5 లక్షల నిమ్మచెట్లను సాగుచేస్తున్నారు. మూడేళ్ల దీర్ఘకాలిక పంట అయినా కూడా ఈ ప్రాంత మహిళలు నిమ్మ సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా నిమ్మచెట్లు నాటే దగ్గర నుంచి దిగుబడి వచ్చేంత వరకు మహిళలే అన్ని పనులు చేస్తుంటారు. సామూహికంగా నిమ్మకాయలు కోస్తారు. చెట్లకు పాదులు తీసి ఎరువులు వేస్తుంటారు. పురుగు మందులు పిచ్చికారీ చేయాలన్నా ఈ ప్రాంత మహిళలే ముందుంటారు. కాయలు కోసి మార్కెట్‌కు తరలించేంత వరకు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఇదేగాక గ్రామాల్లోని మహిళలు కలసికట్టుగా ఉంటూ.. వంతుల వారీగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. కేవలం పురుషులు వారికి సూచనలు మాత్రమే అందిస్తున్నారు.

వినూత్న పద్ధతుల్లో సాగుతాం

పొలంలో నిమ్మ మొక్కలు నాటేందుకు 14 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో పాదులు తీస్తారు. ఒక అడుగు లోతు గుంత తీసి అందులో పశువుల ఎరువువేసి మొక్కను నాటుతారు. మొక్క సుమారు ఆరున్నర అడుగులు ఉండేలా చూసుకుంటారు. ముందుగా తోటలో సాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు డ్రిప్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. మామూలుగా అయితే ఎకరాకు 100 నుంచి 120 మొక్కలు నాటుతారు. కానీ ఇక్కడ కొందరు మహిళా రైతులు ఎకరాకు 70 నుంచి 80 మొక్కలు నాటుతున్నారు. నెలకు రెండు సార్లు దుక్కి దున్నకం చేపడుతారు. ఎలాంటి గడ్డీ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిమ్మసాగు సమయంలో రసాయనిక ఎరువులను తగ్గించి పూర్తిగా సేంద్రియ ఎరువులనే వేస్తున్నారు.

పెరిగిన నిమ్మ సాగు విస్తీర్ణం

గడిచిన నాలుగున్నరేళ్లలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు పెరిగాయి. సాగునీటి సమస్య లేకుండా పోయింది. దీనికి తోడు మార్కెట్‌లో నిమ్మకు మంచి డిమాండ్ ఉండడంతో స్థానిక రైతులు నిమ్మసాగుపై దృష్టిసారించారు. గతంలో ఐదారు వేల హెక్టార్లలోనే నిమ్మ సాగుచేసేవారు. ఇప్పుడు 10వేల హెక్టార్లపైనే సాగుచేస్తున్నారు. గతంతో పోల్చితే అప్పులన్నీ తీరిపోయాయని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది



సంపాదిస్తాం: పాదులు తీస్తున్న మహిళలు



కత్తిరింపు: కొమ్మలను కత్తిరిస్తున్న మహిళ



కాయకష్టం: నిమ్మకాయలు కోస్తున్న మహిళ



కన్నీటిబొట్టు: నిమ్మతోటకు నీళ్లు పెడుతున్న మహిళ

భర్తకు చేదోడువాదోడుగా..



మా గ్రామంలో చాలా మంది నిమ్మ తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మాకు 300 నిమ్మ చెట్లు ఉన్నాయి. ప్రతి రోజూ ఇంటి పనులు ముగించుకుని భర్తతో పాటు నిమ్మతోటకు వెళ్తా. నిమ్మ చెట్లకు నీళ్లు పెట్టి.. గడ్డిలేకుండా తవ్వుతుంటా. తెగుళ్లు లాంటివి వస్తే నేనే మందులు పిచికారీ చేస్తా.

– కొండూరి నాగ రత్నమ్మ, లింగసముద్రం, సైదాపురం మండలం

ప్రభుత్వ సాయం మెండు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సాగు నీటికి ఇబ్బందుల్లేకుండా పోయాయి. బోరు బావుల్లో పుష్కలంగా నీళ్లు లభిస్తున్నాయి. మరింతమంది నిమ్మసాగుచేయడానికి ముందుకొస్తున్నారు. ఉద్యానవన శాఖ కూడా రాయితీపై నిమ్మ సాగుకు నిధులు విడుదల చేస్తోంది. నిమ్మ తోటలు కలిగిన రైతులకు రాయితీపై ప్యాక్ హౌస్‌ను కూడా మంజూరు చేశారు. పంటను ప్యాక్‌హౌస్‌లో ఉంచుకుని మరుసటి రోజు ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తాం.

– వై. వెంకటరత్న, లింగసముద్రం

అన్నీ ఆమే!



మా ఇంట్లో వ్యవసాయ పనులన్నీ నా భార్య వెంకటరమణమ్మే చేస్తుంటుంది. మాకు 10 ఎకరాల నిమ్మతోట ఉంది. అందులో 900 నిమ్మ చెట్లు సాగుచేస్తున్నాం. ఏడాదికి ఖర్చులన్నీ పోను రూ.7 లక్షల వరకు ఆదాయం వస్తోంది. 2021లో నేను గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. దాంతోపాటు ఓ ప్రైవేట్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నా. వ్యవసాయ పనులన్నీ నా భార్యే చూస్తుంటుంది. మా ఇద్దరు పిల్లలను కూడా ఆమే దగ్గరుండి చదివిస్తోంది.

– వెల్లంపల్లి ప్రసాద్‌రాజు, లింగసముద్రం

ఎక్కువ మంది మహిళా రైతులే



వెంకటగిరి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో నిమ్మ సాగుచేస్తున్నారు. ఇక్కడందరూ మహిళా రైతులే ఉన్నారు. నిమ్మ తోటల్లో దుక్కి దున్నకం నుంచి రాబడి వచ్చేంత వరకు సాగులో ప్రధాన పాత్ర మహిళలదే. ముందస్తుగా నిమ్మ చెట్లకు ఏయే పురుగు మందు పిచికారీ చేయాలనే విషయాలను వారే ఫోన్ చేసి అడుగుతుంటారు.

– ఆనంద్, ఉద్యానవనశాఖ అధికారి

ఇవిగో నవరత్నాల వెలుగులు

ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను.. ఎన్నికల్లో గెలిచి, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచే మనసా వాచా ఆచరణలోకి తీసుకురావటం మొదలుపెట్టారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆడిన మాట తప్పలేదు. ఆరంభించిన ఏ పథకాన్నీ ఆపలేదు. ఫలితంగా రాష్ట్రంలో కోట్లాది మందికి నవరత్న పథకాలు అండగా నిలిచాయి. చిన్నారులు మొదలు పండు ముదుసలి వరకు అందరూ ఆనందంగా జీవించేలా వనరులు సమకూరుతున్నాయి. కనీస అవసరాలైన కూడు, గూడు, ఆరోగ్యానికి ఢోకా లేదనే విషయం ఊరూరా కళ్లకు కడుతోంది. పేదల జీవిత కాల కల అయిన 'సొంతిల్లు' సాకారం కావడంతో కొత్తగా ఊళ్లకు ఊళ్లే వెలుస్తుండటం కనిపిస్తోంది. అక్కచెల్లెమ్మలు సొంత కాళ్లపై నిలబడేలా చేయూత, ఆసరా అండగా నిలుస్తోంది. పేదింటి పిల్లలకు పెద్ద చదువులు.. విదేశీ విశ్వవిద్యాలయాల్లో సైతం చదివేందుకు రాచబాట సిద్ధమైపోయింది. అన్నదాతకు వ్యవసాయం పండుగగా మారింది. వెరసి నవరత్నాల వెలుగులు ప్రతి ఊళ్లోనూ ప్రసరిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్ తపన, తాపత్రయం, ఆకాంక్ష ఫలించిన తీరు లబ్ధిదారుల మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆ సంజీవని నా ప్రాణం నిలిపింది



మాది కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ముక్కొల్లు గ్రామం. నాకు తరచుగా ఛాతీ నొప్పి వచ్చేది. మెడికల్ దుకాణంలో బాధను చెబితే ఏదో మాత్ర ఇచ్చేవారు. దాన్ని వేసుకొని కూలీ పనులకు వెళ్లిపోయేవాడిని. ఆ మాత్ర వేసుకుంటే నొప్పి తగ్గేది. మళ్లీ రెండు, మూడు రోజులు తర్వాత అదే బాధ. ఓ రోజు ఛాతీ నొప్పి తీవ్రంగా రావడంతో ఆసుపత్రికి వెళ్లాను. గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు. వెంటనే బైపాస్ సర్జరీ చేయాలన్నారు. రోజువారీ కూలీకి వెళితే గానీ పూట గడవని పరిస్థితుల్లో ఉన్న మా కుటుంబాన్ని ఆ పిడుగులాంటి వార్త కంగారు పెట్టింది. ఆరోగ్య శ్రీతో ఆపరేషన్ ఉచితంగా అయిపోతుందని చెప్పారు. అన్నట్లుగానే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అనే సంజీవని నా ప్రాణాన్ని నిలబెట్టింది. కాకినాడలోని సూర్య గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్ అండ్ కేన్సర్ రీసెర్చ్ సెంటర్ కార్పొరేట్ ఆసుపత్రిలో ఈ నెల 4వ తేదీన గుండె శస్త్ర చికిత్స చేశారు. ఇందుకు అయిన ఖర్చు రూ.లక్షకు పైగా అంతా ప్రభుత్వమే చెల్లించింది. అనంతరం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా రూ.9,500 నా అకౌంట్‌లో జమ అయింది. డిశ్చార్జ్ అనంతరం పనులు చేయలేక ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భారం కాకుండా కూడా సాయం చేయడం అన్నది గొప్ప విషయం. ఇలా సాయం చేయాలనే ఆలోచన ఎంత మంది నాయకులకు వస్తుంది? ఇప్పటి వరకు ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే వచ్చింది. ఇంటికి వచ్చాక స్థానిక వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు నా ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేస్తుండటం ఆనందం కలిగిస్తోంది.

– రావు వెంకటరమణ,
ముక్కొల్లు, కాకినాడ జిల్లా
(శరకనం కృష్ణ, విలేకరి, కిర్లంపూడి)

వ్యవసాయం పండుగైంది



నాకు మా గ్రామంలో మూడెకరాల సొంత పొలం ఉంది. మొక్కజొన్న, కూరగాయల పంటలను సాగు చేస్తున్నాను. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 చొప్పున అందిస్తున్నారు. ఇప్పటి వరకు 4 విడతలుగా రూ.54 వేలు ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరింది. ఏటా ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా సొమ్మును అందించడం మూలంగా పెట్టుబడి ఖర్చులకు ఆ సొమ్ము ఉపయోగిస్తున్నాం. ప్రాథమికంగా వ్యవసాయ పనులు ఆరంభంలో విత్తనాలు కొనుగోలు, భూమి దున్నుకోవడానికి ఆ డబ్బులు ఉపయోగపడుతున్నాయి. సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లన్నీ మా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రంలో అందుబాటులోకి వచ్చాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ ద్వారా ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాలకు పరుగు పెట్టాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి మారిపోయింది. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి రైతులు పంట నష్టపోతే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్న నమ్మకం ఏర్పడింది. పంటల బీమాకి రైతు చెల్లించాల్సిన ప్రీమియం కూడా ప్రభుత్వం చెల్లించడం హర్షించదగిన విషయం. ఉచితంగా వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏవిధమైన ఇబ్బందుల్లేవు. రైతులకు అవసరమైన అన్ని సేవలు గ్రామ స్థాయిలో ఆర్బీకేల్లో లభిస్తున్నాయి. వ్యవసాయం నిజంగా పండుగైంది.

– పెండ్యాల శ్రీనివాసరావు,
పంగిడిగూడెం, ఏలూరు జిల్లా
(యండమూరి నాగ వెంకట శ్రీనివాస్, విలేకరి, ద్వారకా తిరుమల)

ఉపాధికి ఊతం



మాది నిరుపేద కుటుంబం. మా ఆయన తాపీ పని చేస్తుంటాడు. ఒకరోజు పని ఉంటే ఒకరోజు ఉండదు. నేను టైలరింగ్ చేస్తూ అరకొరగా వచ్చే ఆదాయంతో కుటుంబానికి సాయంగా నిలుస్తున్నా. ఇద్దరి సంపాదనతో అతికష్టం మీద కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ ప్రభుత్వం వచ్చాక మాలాంటి చిన్న చేతివృత్తుల వారికి ఏటా పది వేల రూపాయలు జగనన్న చేదోడు పేరుతో అందిస్తున్నారు. ఆ మొత్తం నా టైలరింగ్ వృత్తికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ పథకం ద్వారా ఏటా అందుతున్న నగదుతో టైలరింగ్ మెటీరియల్ కొనుగోలు చేసి మరింతగా పనిచేసి స్వయం ఉపాధి పొందుతున్నాను. తద్వారా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నానన్న సంతోషం కలుగుతోంది. ప్రభుత్వం కల్పిస్తున్న అమ్మ ఒడి పథకం సాయంతో రెండో బాబును చదివిస్తున్నాం. పెద్దవాడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఇంజినీరింగ్ చేస్తున్నాడు. ఇప్పుడు మా కుటుంబానికి ఎలాంటి సమస్యలూ లేవు. ప్రభుత్వ పథకాలు మా లాంటి వారికి ఎంతగానో అండగా నిలుస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

– నేమాని కుమారి,
గుంకలాం గ్రామం, విజయనగరం జిల్లా
(కందివలస అప్పారావు, విలేకరి, విజయనగరం రూరల్)

గృహ యజ్ఞం మెగా డ్రైవ్

ఫిబ్రవరిలో మరో ఐదు లక్షల సామూహిక గృహ ప్రవేశాలు

- సీఎం ఆదేశాలతో కార్యాచరణ అమలుకు క్షేత్రస్థాయి చర్యలు
- జనవరి నెలాఖరుకు 4.18 లక్షల పేదల ఇళ్లను పూర్తి చేసేలా మెగా కంప్లీషన్ డ్రైవ్
- డిసెంబర్ 1 నుంచి జనవరి 31 వరకు డ్రైవ్ నిర్వహణపై కలెక్టర్లకు సీఎస్ దిశా నిర్దేశం
- సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాల పూర్తికి లక్ష్యాలు
- ప్రతి 15 రోజులకు ఒకసారి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వలంటీర్లు
- జియో ట్యాగింగ్ ఫొటోలు ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్
- పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అడ్వాన్స్ నిధులివ్వడం ఇదే తొలిసారి
- ఆర్థిక వెసులుబాటు కోసం 2.06 లక్షల మంది లబ్ధిదారులకు రూ.378.82 కోట్లు



తొలిసారిగా ఇళ్లకు అడ్వాన్స్ నిధులు

గతంలో ఏ ప్రభుత్వమూ పేదల ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అడ్వాన్స్ నిధులు ఇచ్చిన దాఖలాల్లేవు. పెద్ద కాంట్రాక్టు సంస్థలకు మాత్రమే మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు చెల్లించేవి. తొలిసారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల లబ్ధిదారులకు అడ్వాన్స్ నిధులను మంజూరు చేసింది. ఇన్నాళ్లూ పేదల ఇళ్ల నిర్మాణాలు పూర్తైనా నెలలు తరబడి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేసిన ప్రభుత్వాలనే చూశామని, గృహ నిర్మాణాలకు అడ్వాన్స్ నిధులు ఇచ్చిన ప్రభుత్వం ఇదేనని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమాచారం, అభ్యర్థనల మేరకు నిరుపేద ఇళ్ల లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకునేందుకు అడ్వాన్స్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2,06,020 మంది లబ్ధిదారులకు రూ.376.82 కోట్లను అడ్వాన్స్‌గా విడుదల చేసింది. అడ్వాన్స్ నిధులు పొందిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు డిసెంబర్ నెలాఖరు నాటికి తదుపరి దశకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు.

మెగా కంప్లీషన్ డ్రైవ్ ఇలా..

జిల్లా పేరు	సచివాలయాలు	ఇళ్ల లక్ష్యం
శ్రీకాకుళం	548	15,659
విజయనగరం	501	16,228
పార్వతీపురం మన్యం	272	10,264
అల్లూరి సీతారామరాజు	222	6,877
విశాఖపట్నం	173	16,676
అనకాపల్లి	437	15,554
కాకినాడ	386	15,637
అంబేడ్కర్ కోనసీమ	251	9,129
తూర్పుగోదావరి	371	13,669
పశ్చిమగోదావరి	417	14,159
ఏలూరు	463	20,964
కృష్ణా	430	19,343
ఎన్టీఆర్	261	19,489
గుంటూరు	353	22,198
బాపట్ల	286	10,736
పల్నాడు	267	14,921
ప్రకాశం	431	13,108
నెల్లూరు	505	17,277
తిరుపతి	446	16,983
చిత్తూరు	508	17,602
అన్నమయ్య	466	20,140
వైఎస్సార్	511	24,047
అనంతపురం	417	17,949
శ్రీసత్యసాయి	354	20,965
నంద్యాల	373	13,433
కర్నూలు	395	15,491
మొత్తం	10,044	4,18,498

సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహా యజ్ఞంలా కృషి చేస్తోంది. ఇప్పటికే అక్టోబర్‌లో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టగా అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వచ్చే ఫిబ్రవరి నాటికి మరో ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేలా అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి మెగా కంప్లీషన్ డ్రైవ్ ద్వారా డిసెంబర్ 1వతేదీ నుంచి జనవరి 31 వరకు క్షేత్రస్థాయిలో సచివాలయాలు కేంద్రంగా కార్యాచరణ సిద్ధమైంది. ఈమేరకు మెగా కంప్లీషన్ డ్రైవ్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. బేస్‌మెంట్, లెంటల్, రూఫ్ స్థాయిలోని 4.18 లక్షల ఇళ్ల నిర్మాణాలను డ్రైవ్ ద్వారా జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 10,044 సచివాలయాల వారీగా కలెక్టర్లకు లక్ష్యాలను నిర్దేశించారు. డ్రైవ్‌పై కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించి గృహ నిర్మాణ సిబ్బందితో సమీక్షలు నిర్వహించాలని సూచించారు. మెగా కంప్లీషన్ డ్రైవ్ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్‌ను సోమవారానికల్లా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు ప్రతి 15 రోజులకు ఒకసారి వెళ్లి నాలుగు దఫాలు సందర్శించడం ద్వారా ఇళ్ల పురోగతిని జియో ట్యాగింగ్ చేసి ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మెటీరియల్, నిర్మాణ సిబ్బందిని సమీకరించుకునేందుకు జిల్లా, మండల స్థాయిలో సమావేశాలను నిర్వహించాలని తేదీలతో సహా కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఆప్షన్-3 లబ్ధిదారుల ఇళ్ల పురోగతిని కూడా కలెక్టర్లు సమీక్షిస్తూ గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వలంటీర్ల కీలక పాత్ర

గ్రామ, వార్డు వలంటీర్లు మెగా కంప్లీషన్ డ్రైవ్‌లో కీలక పాత్ర పోషిస్తారని గృహనిర్మాణ శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్‌జైన్ తెలిపారు. వచ్చే నెల 1వతేదీ నుంచి జనవరి నెలాఖరు వరకు ప్రతి 15 రోజులకు ఒకసారి మొత్తం నాలుగు సార్లు క్షేత్ర స్థాయిలో ఇళ్లను సందర్శిస్తారని వెల్లడించారు. తొలిసారి సందర్శనలో మెటీరియల్, లేబర్ అవసరాన్ని అంచనా వేస్తారన్నారు. రెండోసారి పురోగతిని యాప్‌లో అప్‌డేట్ చేస్తారని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 28, 29వ తేదీల్లో జిల్లా స్థాయిలో మొబిలైజేషన్ సమావేశాలను నిర్వహించాలని ఆదేశించామన్నారు. డిసెంబర్ 1వ తేదీన మండల, పట్టణ స్థానిక సంస్థల స్థాయిలో సమావేశాలు ఉంటాయన్నారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీలోగా సచివాలయాల స్థాయిలో సమావేశాలను నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. వలంటీర్ల తొలి విడత సందర్శన డిసెంబర్ 7 నుంచి 14 వరకు ఉంటుంది. రెండో విడత 15వ తేదీ నుంచి 31 వరకు జరుగుతుంది. మూడో విడత జనవరి 1వ తేదీ నుంచి 15 వరకు ఉంటుంది. నాలుగో విడత సందర్శన జనవరి 16 నుంచి 31 వరకు ఉంటుందని జైన్ వివరించారు. ఫిబ్రవరిలో మరో ఐదు లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఈ నేపథ్యంలో సచివాలయాలు కేంద్రంగా మెగా కంప్లీషన్ డ్రైవ్ ద్వారా జనవరి నెలాఖరు నాటికి 4.18 లక్షల గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే లక్ష ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని వెల్లడించారు.

శ్రీకాకుళం 'బెజ్జిపురం యూత్ క్లబ్'కు ప్రధాని ప్రశంసలు

- మన్ కీ బాత్‌లో ప్రస్తావన

సాక్షి, న్యూఢిల్లీ: గోగునారతో అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీకాకుళం జిల్లా 'బెజ్జిపురం యూత్ క్లబ్'ను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా 7 వేలమంది మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. ఆదివారం 107వ మన్ కీ బాత్‌లో భాగంగా ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభమైన 'బెజ్జిపురం యూత్ క్లబ్' నైపుణ్యాభివృద్ధి రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడుతూ ఈ క్లబ్ ద్వారా మహిళలకు సాధికారత కల్పిస్తూ వారిని పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. బాల కార్మికులను గుర్తించి నైపుణ్య రంగాల్లో శిక్షణ ఇస్తుండటం వల్ల వారు బడిబాట పడుతుండటం గర్వకారణమన్నారు. రైతులకు వృత్తి నైపుణ్యంలో మెళకువలు నేర్పిస్తూ వారిని ఉత్పత్తి రంగం వైపు మళ్లించడం, మరుగుదొడ్ల గురించి అవగాహన కల్పిస్తూ వాటి నిర్మాణంలో పాలుపంచుకోవడాన్ని మోదీ అభినందించారు.

సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర బిందువు రాజ్యాంగం

- గవర్నర్ అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: దేశ సర్వతోముఖాభివృద్ధికి రాజ్యాంగం కేంద్ర బిందువని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కేవలం ఓ న్యాయపత్రం మాత్రమే కాదని, దేశ లక్ష్యాలు, ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రతిఫలించే ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతి పత్రమన్నారు. విజయవాడ రాజ్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ దేశ ప్రజల మధ్య రాజ్యాంగ స్ఫూర్తి, విలువలను మరింతంగా పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను గవర్నర్ చదవి సభకు హాజరైనవారితో చెప్పించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీఎస్ జవహర్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి ఘనస్వాగతం

రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్

సాక్షి, తిరుపతి/రేణిగుంట (తిరుపతి జిల్లా)/తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘనస్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్ పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించి సాదర స్వాగతం పలికారు. ప్రధానికి స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, డాక్టర్ గురుమూర్తి, రెడ్డెప్ప, జీవీఎల్ నరసింహారావు, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్‌రావు, వెంకటేగౌడ, ఎమ్మెల్సీ కల్యాణచక్రవర్తి, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, జేసీ డీకే బాలాజీ, తిరుపతి కమిషనర్ హరిత, పలువురు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని విమానాశ్రయం నుంచి బయటకు వచ్చాక కాన్వాయ్ ఆపి బీజేపీ శ్రేణులకు అభివాదం చేశారు. ఆ తర్వాత ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న గవర్నర్ నజీర్

తిరుమలకు చేరుకున్న ప్రధాని

ఇక తిరుమలకు చేరుకున్న ప్రధాని మోదీకి శ్రీ రచనా అతిథిగృహం వద్ద ఈఓ ధర్మారెడ్డి, రచనా టెలివిజన్ డైరెక్టర్ తుమ్మల రచనా స్వాగతం పలికారు. శ్రీవారిని ఆయన సోమవారం ఉదయం దర్శించుకుంటారు. ప్రధాని హోదాలో మోదీ తిరుమలకు రావడం ఇది నాలుగోసారి.

ఐఐఎం వైజాగ్‌కు అరుదైన అవార్డు

మహిళల స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నందుకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న ఐఐఎంవీ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) మరో అరుదైన అవార్డు దక్కించుకుంది. న్యూఢిల్లీలోని డా.బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఫెస్టివల్–2023లో ఐఐఎంవీకు అవార్డు ప్రకటించారు. మహిళా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహిస్తూ స్టార్టప్‌లకు చేయూతనందిస్తున్నందుకు గాను పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అందించిన ప్రతిష్ఠాత్మక అవార్డును ఐఐఎంవీ ప్రతినిధి ఎంఎస్ సుబ్రహ్మణ్యం అందుకున్నారు. ఐఐఎంవీలో మహిళా స్టార్టప్స్‌ని ప్రోత్సహించేందుకు ఐఐఎంవీ ఫీల్డ్(ఇంక్యుబేషన్ అండ్ స్టార్టప్స్)ను ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి బ్యాచ్‌లో 20 మంది మహిళా పారిశ్రామికవేత్తలు సాగించిన విజయాలకు సంబంధించిన వివరాలతో 'బ్రేకింగ్ బౌండరీస్' అనే పుస్తకాన్ని ముద్రించారు. ఈ పుస్తకం ప్రీమియర్ బిజినెస్ స్కూల్ అవార్డును సొంతం చేసుకుంది. అవార్డు సాధించడంపై ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొ.ఎం చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. ఐఐఎంవీ ఫీల్డ్‌లో 90 మందికిపైగా మహిళా పారిశ్రామికవేత్తలు తమ స్టార్టప్స్‌ను అభివృద్ధి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఏఐ, డిజిటల్ మార్కెటింగ్‌తో వ్యవసాయ విప్లవం

పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు



డాక్టర్ శ్రీనుబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ మార్కెటింగ్‌తో ఉత్తరాంధ్రలో వ్యవసాయ, వ్యాపార విప్లవం సాధించవచ్చని ఉత్తరాంధ్ర వాణిజ్య దిగ్గజం, పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక మెసానిక్ టెంపుల్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన నార్త్ ఆంధ్ర బిజినెస్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్తరాంధ్రలో సహజ వనరులకు దీటుగా మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, యువత ప్రతిభను పెంపొందించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని చెప్పారు. సేంద్రియ, ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులకు స్వర్గధామం ఉత్తరాంధ్ర అని, ఒక్క వ్యవసాయ రంగంలోనే 30కి పైగా అంశాలతో విస్తృత వ్యాపార అవకాశాలున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్రలో వ్యవసాయ సంపదను వినియోగించుకునేందుకు ఔత్సాహిక యువ వ్యాపార వేత్తలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనుబాబును నిర్వాహకులు సత్కరించారు.

ఏపీ పెవిలియన్‌కు విశేష ఆదరణ

- ఢిల్లీలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో రాష్ట్ర విశిష్టతను తెలియజేసేలా ఏపీ పెవిలియన్
- జీఐ ఉత్పత్తులతో పాటు హస్తకళా ఉత్పత్తులకు డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నాడు–నేడుపై సందర్శకుల ఆసక్తి
- అడ్వాంటేజ్ ఏపీ పేరుతో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను వివరిస్తూ కియోస్క్
- సంప్రదాయ కళలను పరిచయం చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు
- రోజుకు లక్ష మందికిపైగా ఏపీ పెవిలియన్ సందర్శన
- అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీ



సందర్శకులతో కిటకిటలాడుతున్న ఏపీ పెవిలియన్

సాక్షి, అమరావతి: ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్–2023లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌కు సందర్శకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 'వసుధైక కుటుంబం -యునైటెడ్ బై ఇండియా' పేరుతో ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ నిర్వహిస్తున్నారు. నవంబర్ 14న ప్రారంభమైన ఎగ్జిబిషన్ నవంబర్ 27వ తేదీతో ముగియనుంది. రాష్ట్రం నుంచి 195 దేశాలకు 3,137 ఉత్పత్తులను ఎగుమతి చేయడం ద్వారా ఆయా దేశాలతో కుటుంబ సభ్యులుగా మారి వసుధైక కుటుంబంగా ఎలా ఎదిగిందన్న విషయాన్ని తెలియచేసే విధంగా ఏపీ పెవిలియన్‌ను తీర్చిదిద్దారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ఎగ్జిబిషన్‌లో 550 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సందర్శకులను కట్టిపడేసే విధంగా ఏపీ పెవిలియన్ తీర్చిదిద్దింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ ఈ పెవిలియన్‌ను ప్రారంభించారు.

భారీగా సందర్శకుల తాకిడి

రాష్ట్రంలోని హస్తకళలు, భౌగోళిక గుర్తింపు పొందిన వస్తువులతో పాటు హస్తకళా ఉత్పత్తులతో ఏపీ పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ఎన్నడూ లేనివిధంగా సందర్శకుల తాకిడి అధికంగా ఉందని, ప్రతిరోజు లక్ష మందికిపైగా సందర్శకులు పెవిలియన్‌ను సందర్శిస్తున్నారని పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎగుమతులు) జీఎస్ రావు 'సాక్షి'కి చెప్పారు. కలంకారీ, మంగళగిరి జరీ, ధర్మవరం పట్టు, నెల్లూరు ఉడెన్ కట్లరీ, లేపాక్షి, తోలు బొమ్మలు వంటి వాటికి సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చిందని, పలువురు భారీగా కొనుగోళ్ల ఆర్డర్లు ఇచ్చారని వివరించారు. నాలుగున్నర ఏళ్లుగా ఏపీలో నాడు–నేడు కింద అమలు చేస్తున్న పథకాలను ప్రతీ ఒక్కరికి అర్థమయ్యే విధంగా ఇంగ్లిష్‌లో వివరిస్తూ ఆర్ట్ రూపంలో ఏర్పాటు చేసిన చిత్రానికి మంచి స్పందన వచ్చిందని, పలువురు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కొనియాడారని చెప్పారు.

అధికారులకు అభినందన

పెవిలియన్‌లో రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ వైఎస్సార్ ఏపీ వన్ కింద ఏవిధంగా త్వరతగతిన అనుమతులు జారీ చేస్తున్నారో తెలియజేసే కియోస్క్‌ని పలువురు సందర్శించారు. 974 కి.మీ. తీర ప్రాంతాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తున్నదీ, మత్స్య ఎగుమతుల్లో ఏపీ నంబర్–1 స్థానంలో ఉందన్న విషయాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద పలువురు ఫొటోలు దిగుతున్నారు. సాయంత్రం వేళ రాష్ట్రంలోని సంప్రదాయ కళలను పరిచయం చేసేవిధంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కళా ప్రదర్శనలకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర ప్రగతిని ప్రపంచ దేశాలకు తెలియచేసే విధంగా పెవిలియన్‌ను తీర్చిదిద్దారంటూ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ అధికారులను ప్రశంసించారు. కాగా.. సందర్శకులను విశేషంగా ఆకర్షించిన ఏపీ పెవిలియన్‌కి ఐఐటీఎఫ్ జ్యూరీ అవార్డు ప్రకటించింది.

క్లుప్తంగా...

నేడు ఎచ్చెర్ల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర సోమవారం రెండు ప్రాంతాల్లో జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును, అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ సాగుతున్న సామాజిక సాధికార యాత్ర విశేష ప్రజాదరణ పొందుతోంది. ఇందులో భాగంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల, అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగనుంది.

రాజ్యాంగ స్ఫూర్తితో అణగారిన వర్గాల అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: రాజ్యాంగ స్ఫూర్తితో అణగారిన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్‌ను నిలబెట్టిన ఘనత బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికే దక్కుతుందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ పాలన చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసన మండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి కాకుమాను రాజశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్ పాల్గొన్నారు.

కాపులను బాబుకు తాకట్టు పెట్టే కుట్రలను తిప్పికొడతాం

పవన్ తీరుపై అడపా శేషు ఆగ్రహం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే సరికి పవన్‌కళ్యాణ్‌కు పూనకం వస్తుందని, తెలంగాణలో మాత్రం ఎందుకు నోరు పెగలడంలేదని ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి ప్రశ్నించారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తున్న పవన్.. అక్కడి సీఎం కేసీఆర్‌పై నోరెత్తే సాహసం ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. తెలుగు ప్రజలు సిగ్గు పడేలా చంద్రబాబు, పవన్‌లు అనైతిక పొత్తులతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో చంద్రబాబు కాంగ్రెస్‌కు, పవన్ బీజేపీకి మద్దతిస్తున్నారని, ఏపీలో వీరిద్దరూ పొత్తు పెట్టుకుని విలువల్లేని రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాపులను చంద్రబాబుకు తాకట్టు పెట్టే పవన్ కుట్రలను అడపాశేషు స్పష్టం చేశారు.

ఏపీలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం

బహుజన పరిరక్షణ సమితి నేతలు



దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: యావత్ ప్రపంచం భారత్ వైపు చూసేలా సమాన హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని బహుజన పరిరక్షణ సమితి నేతలు కొనియాడారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 1,155వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ ఏపీలో సామాజిక న్యాయం అన్ని వర్గాలకు సమానంగా అందుతుందన్నారు. నాయకులు పల్లె బాబు, మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

'125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం' అభినందనీయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విజయవాడ స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడమే అంబేడ్కర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన జగన్

'వై ఏపీ నీడ్స్ జగన్'లో ఇప్పటిదాకా 18.12 లక్షల కుటుంబాల భాగస్వామ్యం



సాక్షి, అమరావతి: ప్రతి గ్రామంలోనూ ఘన స్వాగతాలు.. అపూర్వ ఆదరణ నడుమ జనమంతా మెచ్చిన కార్యక్రమం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..' (వై ఏపీ నీడ్స్ జగన్) ఘన నీరాజనాలు అందుకుంటోంది. ఏ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాన్ని చూసినా వివక్షకు తావులేకుండా, లంచాలకు ఆస్కారం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో పారదర్శకంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్రమంతటా ప్రజలు బాసటగా నిలుస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ తెలియచేస్తూ చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా 18,12,831 కుటుంబాలు భాగస్వాములయ్యాయి. ఈ నెల 9వ తేదీన ఈ కార్యక్రమం ఘనంగా ఆరంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల క్లస్టర్లు ఉండగా ఇప్పటిదాకా 54,779 క్లస్టర్ల పరిధిలో ప్రారంభమై దిగ్విజయంగా కొనసాగుతోంది.

సచివాలయాల వద్ద 'సంక్షేమ – అభివృద్ధి బోర్డులు'

గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఒక్కో సచివాలయం పరిధిలో గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ఎంత మంది లబ్ధిదారులకు ఏ పథకాల ద్వారా ఎంత మొత్తం ప్రయోజనం చేకూర్చిందనే వివరాలతో ఆయా సచివాలయాల వద్ద 'సంక్షేమ – అభివృద్ధి బోర్డులు' ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో రోజూ మండలానికి ఒక సచివాలయ పరిధిలో సందడిగా బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతోంది. సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన మరుసటి రోజు నుంచి ఆయా సచివాలయాల పరిధిలో రోజుకు 15 ఇళ్ల చొప్పున సందర్శిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు.

7,170 సచివాలయాల్లో బోర్డుల ఆవిష్కరణ

ఈ నెల 9వ తేదీన కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఆదివారం వరకు 7,170 సచివాలయాల పరిధిలో సంక్షేమం – అభివృద్ధి వివరాలతో కూడిన బోర్డుల ఆవిష్కరణ పూర్తి అయినట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ జరిగిన సచివాలయాల పరిధిలో 34.91 లక్షల కుటుంబాలు ఉండగా దాదాపు 18,12,831 కుటుంబాల ఇంటి సందర్శన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూర్చిందనే వివరాలను వివరిస్తున్నారు. గతంలో పోలిస్తే నాలుగున్నరేళ్లలో గ్రామ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పులను తెలియచేస్తున్నారు.

సోలార్ రూఫ్.. రేటు టాప్!

- దేశంలో ఇళ్లపై రూఫ్ టాప్ సామర్థ్యం 2.7 గిగావాట్స్ మాత్రమే..
- రూఫ్ టాప్ కంటే సంప్రదాయ విద్యుత్ ధరలే తక్కువ
- 'థింక్‌ట్యాంక్ కౌన్సిల్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' వెల్లడి

సాక్షి, అమరావతి: థర్మల్, హైడల్, విండ్, గ్యాస్, బయోమాస్ ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌తో పోల్చితే.. ఇళ్ల పైకప్పులపై పెట్టుకునే సోలార్ రూఫ్ టాప్ ఖరీదే ఎక్కువని తాజాగా ఓ అధ్యయనం తేల్చింది. పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం కోసం ఇళ్ల పైకప్పులపై దాదాపు 40 గిగావాట్ల సౌర పలకలను అమర్చాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో కలిపి రూఫ్‌టాప్ సామర్థ్యం 11 గిగావాట్లు కాగా, నివాస గృహాలపై ఉన్నది 2.7 గిగావాట్లు మాత్రమే. దీనికి కారణం ఖర్చు ఎక్కువ కావడమేనని అధ్యయనంలో వెల్లడైంది. ఏపీ సహా 21 రాష్ట్రాల్లోని 14వేల గృహాలపై అధ్యయనం చేసిన థింక్ ట్యాంక్ కౌన్సిల్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (ఢిల్లీ) పరిశోధకులు దేశంలో సబ్సిడీలు ఇస్తున్నా సోలార్ రూఫ్‌టాప్ సిస్టం ఏర్పాటు ఇప్పటికీ ఖరీదైనదిగానే ఉందని తెలిపారు.



రూఫ్‌టాప్ ఖర్చు, సబ్సిడీ ఇలా..

విద్యుత్ వినియోగదారుల్లో దాదాపు 85 శాతం మంది ఏడాదికి 1,200 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఎవరైనా తమ ఇంటిపై రూఫ్‌టాప్ సిస్టం ఏర్పాటు చేయాలంటే ప్రతి కిలోవాట్‌కు 100 చ.అ. స్థలం ఉండాలి. ఒక కిలోవాట్‌కు రూ.50 వేలు, ఒక కిలోవాట్‌పైన 2 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కి రూ.47 వేలు, 2 కిలోవాట్ల పైబడి 3 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.45 వేలు, 3 కిలోవాట్ల పైన 10 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కి రూ.44 వేలు, 10 కిలోవాట్ల పైబడి 100 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కి రూ.38,000, వంద కిలోవాట్లపైన 500 కిలోవాట్ల వరకు కిలోవాట్‌కు రూ.36 వేలు ఖర్చవుతుంది. వీటికి అదనంగా దరఖాస్తు రుసుం 5 కిలోవాట్ల వరకు రూ.1,000, ఆ పైన రూ.5వేలు చొప్పున చెల్లించాలి. మీటరింగ్ చార్జీలు అదనం. ఈ ధరలు చెల్లించిన వారికి సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ల రూపకల్పన, సరఫరా, ఏర్పాటు చేసి ఇవ్వడంతో పాటు బీమాతో సహా ఐదేళ్ల వారంటీ లభిస్తుంది. 3 కిలోవాట్ల వరకు 40%, 3 కిలోవాట్ల పైబడి 10 కిలో వాట్ల కంటే ఎక్కువ సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలపై 20% సబ్సిడీ వస్తుంది. రూఫ్‌టాప్ సోలార్ యోజన స్కీంను 2026 మార్చి 31 వరకు కేంద్రం పొడిగించింది.

మన దగ్గర మెరుగు

ప్రజలు తమ గృహ, వాణిజ్య అవసరాలకు సౌర విద్యుత్‌ను వినియోగించుకునేందుకు వీలుగా సోలార్ రూఫ్ టాప్ పాలసీ(ఎస్ఆర్‌టీ)ని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది. దీనికి అనుగుణంగా ఎవరైనా తమ నివాస, వాణిజ్య భవనంపై సోలార్ పలకలు పెట్టుకోవచ్చు. సోలార్ పలకలు బిగించాక ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వారి అవసరానికి వాడుకోగా, మిగిలినది గ్రిడ్‌కు ఎగుమతి చేయొచ్చు. దానిని డిస్కంలు తమ మీటరు ద్వారా రికార్డ్ చేస్తాయి. వినియోగదారుడు ఎగుమతి చేసిన యూనిట్లకు ఏపీఈఆర్‌సీ నిర్ణయించిన పూల్ కాస్ట్ ధర(రూ.4.60 పైసలు)ను డిస్కంలు చెల్లిస్తున్నాయి. దీనివల్ల రూఫ్‌టాప్ నిర్వాహకులకు ప్రయోజనం చేకూరుతోంది. అటు డిస్కంలు కూడా నెట్ మీటరింగ్ ద్వారా రూఫ్ టాప్ సోలార్ సిస్టంల నుంచి ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను 'రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీఓ) లక్ష్యంలో చూపించుకునే వెలుసుబాటు మన రాష్ట్రంలో ఉంది.

కాంగ్రెస్‌తో టీడీపీ జత సిగ్గుచేటు

- టీడీపీ దిగజారుడు రాజకీయానికి ఇదే నిదర్శనం
- చంద్రబాబు, పురందేశ్వరిది విలువల్లేని రాజకీయం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో టీడీపీ జతకట్టడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా వాద్రా ర్యాలీలో టీడీపీ నాయకులు జెండాలు పట్టుకుతిరగడం సిగ్గుచేటని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్న ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి దీనిపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. విలువల్లేని రాజకీయాలకు చంద్రబాబు, పురందేశ్వరి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారన్నారు. తొమ్మిది షిప్పింగ్ హార్బర్లు, నాలుగు పోర్టులు, 17 కొత్త మెడికల్ కాలేజీలు, కడప కొప్పర్తి ఎలక్ట్రానిక్స్ పార్క్, కర్నూల్ గ్రీన్‌కో పవర్ ప్లాంట్, వైజాగ్ ఐటీ అభివృద్ధి, మూడు ఐటీ సెజ్‌లు, నెల్లూరు క్రిస్ సిటీ, 2.5 లక్షల ఎంఎస్ఎంఈలు ఏర్పాటుతో అభివృద్ధి వికేంద్రీకరణ, విస్తరణ మునుపెన్నడూ లేనిరీతిలో కనిపిస్తోందన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం..

ఇక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గతంలో మాదిరిగా ప్రచార ఆర్భాటాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో రూ.2,400 కోట్ల విలువైన పారిశ్రామిక యూనిట్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశామని.. రూ.550 కోట్లతో నంద్యాలలో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, రూ.402 కోట్లతో ఐదు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, రూ.800 కోట్లతో ఇంధన రంగంలో రెండు యూనిట్లకు శంకుస్థాపన చేయగా, రూ.230 కోట్లతో నెల్లూరులో గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ ఉత్పత్తికి సిద్ధమైందన్నారు. ప్రతి 15 రోజులకోసారి రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుపై సమీక్షిస్తూ అనుమతులను వేగంగా మంజూరు చేస్తోందని విజయసాయిరెడ్డి వివరించారు.

కులగణనకు చట్టబద్ధత లేదనడం అబద్ధం

- టీడీపీ కూసాలు కదిలిపోతున్నాయ్
- ఆ పార్టీయే బీసీలను మోసం చేసింది
- వైఎస్ జగన్ సీఎం అయ్యాకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు చైతన్యవంతులయ్యారు
- ప్రజలను ఏమార్చేందుకు ఈనాడు రోత రాతలు
- మంత్రి వేణు మండిపాటు

రామచంద్రపురం: కులగణనకు చట్టబద్ధత లేదనడం పచ్చి అబద్ధమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చెప్పారు. కులగణన చేపట్టేందుకు రాష్ట్రాలకు కేంద్రం అధికారమిచ్చిందని తెలిపారు. మంత్రి ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మీడియాతో మాట్లాడుతూ.. కులగణనకు దేశవ్యాప్తంగా డిమాండ్లున్నాయన్నారు. 2021 నవంబర్‌లో జరిగిన శాసన సభ సమావేశాల్లో తీర్మానం చేసి కులగణన చేయించాలని కోరామని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన చేపట్టడంతో టీడీపీ కూసాలు కదిలిపోతున్నాయని, అందుకే ప్రతిపక్షాల ఓట్లు చీల్చడానికంటూ ఈనాడు తప్పుడు రాతలు రాస్తోందని మండిపడ్డారు. రామోజీరావు రోత రాతలు కట్టిపెట్టాలని అన్నారు. బీసీలను మోసం చేసింది టీడీపీయేనని చెప్పారు. బీసీల దెబ్బకు టీడీపీ కుప్పకూలిపోవడం ఖాయమని స్పష్టం చేశారు.

పేదలను అణగదొక్కిన చంద్రబాబు

చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉండి పేదలను అణగదొక్కారని, వారి జీవన ప్రమాణాలు పెరగకుండా చేశారని అన్నారు. పేదలు వారి ఆత్మగౌరవాన్ని పెత్తందార్ల వద్ద తాకట్టు పెట్టి జీవించే స్థితి ఉండేదని, సీఎంగా జగన్ వచ్చిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చిందని తెలిపారు. పేదలెవ్వరూ పెత్తందార్ల వద్దకు వెళ్లనవసరం లేకుండా సీఎం జగన్ రూ.2.40 లక్షల కోట్ల మేర సంక్షేమాన్ని పేదలకు నేరుగా అందించి చరిత్ర సృష్టించారన్నారు. దీనిలో అవినీతి జరిగిందని చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఎన్ని ఘోరాలు చేశాయో అందరూ చూశారని అన్నారు. పింఛన్లు ఇవ్వాలంటే వృద్ధుల వద్ద లంచాలు తీసుకున్నారని, ఇల్లు ఇవ్వడానికి యజమానికి వచ్చే రూ.40 వేలలో రూ.4 వేలు మేసేసిన ఘనత టీడీపీ నేతలదని మంత్రి విమర్శించారు.

26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగిస్తే ఎందుకు మాట్లాడలేదు బాబూ..

రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ అవసరాలను కనీసం ప్రస్తావించని చంద్రబాబు, రామోజీ.. విభజన అనంతరం తెలంగాణలో 26 కులాలను బీసీల జాబితా నుంచి తొలగిస్తే ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న రిజర్వేషన్లు అమలు చేయాలనే నిబంధన గురించి వారు ఏనాడూ మాట్లాడలేదని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు చైతన్యవంతులయ్యారని చెప్పారు. సీఎం జగన్‌ను గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. ఈనాడు నిత్యం రోత రాతలతో ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నిస్తోందని మంత్రి వేణు మండిపడ్డారు. రామోజీరావు ఆనాడు ఎన్టీ రామారావును పదవి నుంచి తప్పించడం కోసం ఎన్ని రోత రాతలు రాశారో తెలుగు ప్రజలకు తెలుసని చెప్పారు. రామోజీ తయారు చేసిన ఒక అబద్ధమే చంద్రబాబు నాయుడు అని తెలిపారు. లోకేశ్ ఒక పప్పు.. పవన్‌కల్యాణ్ ఒక ఉప్పు.. సమాజానికి వీరు ముప్పు అని మంత్రి ధ్వజమెత్తారు.

ఆయన కిరాయి కళ్యాణ్

పవన్ కళ్యాణ్‌పై మంత్రి అంబటి మండిపాటు

- విశాఖ బోట్లు దగ్ధం ప్రమాదంపై సీఎం జగన్ తక్షణం స్పందించారు
- మూడు రోజుల్లో 80 శాతం నష్ట పరిహారాన్ని అందరికీ ఇచ్చారు
- ప్యాకేజీ విమానంలో వచ్చిన పవన్ మాపై విమర్శలా?

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కిరాయి తీసుకుంటూ రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ప్యాకేజీ ఇస్తే రాజకీయంగా దారుణాలు, హత్యలు చేయడానికి కూడా వెనుకాడటం లేదని విమర్శించారు. అంబటి ఆదివారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏపీలో సొంత ఊరు, ఇల్లు, భార్యా పిల్లలు, కనీసం ఓటు కూడా లేని పవన్‌కు రాష్ట్ర రాజకీయాలతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు ఇచ్చిన ప్యాకేజీని తీసుకుని సీఎం జగన్‌ను దూషించడం మినహా ఆయనకు వేరే పని లేదన్నారు. చంద్రబాబు చేతుల్లో నలిగిపోయిన సామాజిక వర్గాన్ని తిరిగి బానిసలుగా చేయాలనుకోవడం సిగ్గు చేటన్నారు. వంగవీటి రంగా హత్యకు కారకుడైన చంద్రబాబు చెప్పులను మోయడంతోపాటు లోకేశ్ పల్లకీని మోయించేందుకు పవన్ చేస్తున్న యత్నాలు ఫలించవన్నారు. పౌరుషం కలిగిన తమ సామాజికవర్గం వీరులనే మినహా పవన్ లాంటి బానిసలను నాయకులుగా గుర్తించరని చెప్పారు.

నీ కష్టార్జితం కాదుగా..

విశాఖలో మత్స్యకారుల బోట్లు దగ్ధమైన ఘటనలో ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించింది. మూడు రోజుల్లోనే నష్ట పరిహారంగా రూ.7.11 కోట్లు ఇచ్చి బాధితులు ధైర్యంగా మళ్లీ వృత్తి చేపట్టేలా సీఎం జగన్ పెద్ద మనసు చాటారు. ఇంత పారదర్శకంగా, వేగంగా 80 శాతం నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వాలు మరొకటి లేవని చాలా మంది ప్రశంసించారు. దత్తపుత్రుడు మాత్రం చంద్రబాబు సైగతో ప్రత్యేక ప్యాకేజీ అందుకుని ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చి మమ్మల్ని దూషించారు. పవన్ కళ్యాణ్ మానసిక పరిస్థితి ఎలా ఉందంటే రాష్ట్రంలో ఏం జరిగినా సీఎం జగనే కారణమని ఆరోపించడం ఆయనకు అలవాటైంది. పవన్ ప్రత్యేక విమానంలో వచ్చినా, బాధితులకు రూ.50 వేలు ఇచ్చినా, లింగమనేని స్థలంలో పార్టీ భవనాన్ని కట్టినా.. అవన్నీ ప్యాకేజీ మినహా ఆయన కష్టార్జితం కాదు. నాడు గోదావరి పుష్కరాల్లో 29 మంది చనిపోతే కనీసం స్పందించలేదు. ఇప్పుడు ప్రభుత్వం ఉదారంగా సాయం చేస్తే చంద్రబాబు ఇచ్చిన కిరాయి సొమ్ముతో, రాసిచ్చిన స్లిప్పులతో విమర్శలు చేయడం దారుణం.

పవన్ ఎవరికి సెకండ్ సెటప్?

పవన్ సినిమాల్లో వేషాలు మార్చినట్లుగా రాజకీయాల్లో ఇక్కడో డ్యాన్సు అక్కడో డ్యాన్సు వేస్తే కుదరదు. స్థిరత్వం, అవగాహన లేని నువ్వు రాజకీయ నాయకుడివా? రాజకీయ వ్యభిచారివా? తెలంగాణలో నువ్వు బీజేపీ పక్కన జెండా కడితే నీ దత్త తండ్రి కాంగ్రెస్ పక్కన కట్టాడు. నీచ రాజకీయాలకు చంద్రబాబు కేరాఫ్ అనుకుంటే నువ్వు అంతకంటే నీచంగా తయారయ్యావు. నువ్వు బీజేపీకి సెకండ్ సెటప్‌వా? లేక టీడీపీకి సెకండ్ సెటప్‌వా? ఇప్పటికైనా నువ్వు చేస్తున్న రాజకీయాలపై నోరు తెరిచి మాట్లాడు. నిన్ను నమ్ముకున్న కొద్దోగొప్పో ప్రజలను నట్టేట్లో ముంచే ప్రయత్నం చేస్తున్నావు. సొంత సామాజిక వర్గాన్ని అమ్ముకుని బతకాలనే రాజకీయాల్లోకి వచ్చావు. అందుకే క్యాష్ తీసుకుని రాజకీయం చేస్తున్నావు. అందుకే నిన్ను పీకే కాదు.. కేకే (కిరాయి కళ్యాణ్) అనాలి. కిరాయి తీసుకుని హత్యలు చేసే వాళ్ల మాదిరిగానే నువ్వు రాజకీయంగా హత్యలు చేయడానికి ప్రయత్నిస్తున్నావు. ఈ పదేళ్లలో నీ రాజకీయాలు చూస్తున్న వాళ్లందరికీ నిన్ను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టేనని అర్థమైంది.

అదో హాస్యభరిత కామెడీగళం

లోకేశ్ పాదయాత్ర ఎందుకు ఆపేశారో, ఇప్పుడెందుకు మొదలెడుతున్నారో తెలియదు. అదో హాస్యభరిత కామెడి గళం. పవన్ సినిమా షూటింగ్‌కు రోజుకు రూ.2 కోట్లు తీసుకుంటానని గతంలో చెప్పారు. దమ్ముంటే ఆదాయ పన్ను వివరాలు బయటపెట్టాలి. పవన్‌కు రాజకీయాలు తెలియదు. జలయజ్ఞాన్ని వైఎస్సార్ ప్రారంభించారు. అందులో దోపిడీ జరిగితే సీఎంగా ఉంటూ మళ్లీ రెండోసారి ఎలా గెలుస్తారు? రాజశేఖరరెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత పిల్ల పవన్ కళ్యాణ్‌కు లేదు. లోకేశ్ అప్పుడప్పుడైనా చంద్రబాబుపై తిరగబడతాడేమో కానీ పవన్‌కు మాత్రం తిరగబడనంత గట్టి ప్యాకేజీ బంధం ఉంది. తెలంగాణ ఎన్నికల్లో జనసేన అభ్యర్థులకు పవన్ ఎందుకు ప్రచారం చేయట్లేదు? సీఎం జగన్‌ను దూషిస్తే ప్యాకేజీ వస్తుందని, అదే ముఖ్యమని అనుకుంటున్నాడు. తెలంగాణ రాజకీయాలు వేరు ఏపీ రాజకీయాలు వేరు. అక్కడి పార్టీల గెలుపోటములతో ఏపీని పోల్చలేం. అక్కడ ఏ ప్రభుత్వం వచ్చినా మేం సత్సంబంధాలు కోరుకుంటాం.

రాష్ట్రంలో రజకులకు సమున్నత స్థానం

- వారి సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ ప్రత్యేక చర్యలు
- రజక కార్పొరేషన్ ద్వారా ఆ వర్గానికి ఉన్నత స్థానం
- అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్రంలో కులగణన సాహసోపేతం
- రజక ఆత్మగౌరవ మహాసభలో మంత్రులు మేరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణు

ఏఎన్‌యూ: రజకుల సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన రజక ఆత్మగౌరవ మహాసభలో మంత్రి ప్రసంగిస్తూ.. రజకుల సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా రజకులకు సమున్నత స్థానం కల్పించారని తెలిపారు. అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదవాడి చెంతకు చేరుతున్నాయని తెలిపారు. అణగారిన వర్గాల సాధికారతకు అంకితభావంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఉండటం మన అదృష్టమన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడం మాకు గర్వంగా ఉందని తెలిపారు. రజకుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని నాగార్జున హామీ ఇచ్చారు.



ప్రసంగిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

సామాజిక సాధికారతకు ఏపీ వేదిక..

బీసీ సంక్షేమ శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. కులగణన విషయంలో దేశంలో ఏ రాష్ట్రం చేయని సాహసం ఏపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఈ ప్రక్రియ తరువాత రజకులకు మరిన్ని ప్రయోజనాలు అందుతాయన్నారు. సామాజిక సాధికారతకు ఏపీ వేదికగా నిలుస్తోందని తెలిపారు. గత పాలకుల వివక్షకు గురైన వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమున్నత స్థానం కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం ఏపీలో బీసీల రాజ్యం నడుస్తోందని తెలిపారు. రజకుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. రజకులకు ఏపీ ప్రభుత్వం అగ్రస్థానం కల్పించిందని.. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు కల్పించనుందన్నారు. చట్టసభల్లో రజకులకు తప్పకుండా స్థానం దక్కుతుందన్నారు.

రజకులను వంచించిన చంద్రబాబు

ఏపీ రజక కార్పొరేషన్ చైర్మన్ రంగన్న, రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు ప్రసంగిస్తూ.. రజకుల సమస్యల పరిష్కారంపై సీఎం జగన్‌కు ప్రత్యేక ప్రణాళిక ఉందన్నారు. మాటతప్పే వ్యక్తిత్వం ఆయనది కాదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రజకులను తీవ్రంగా వంచించిందన్నారు. రజకుల్లో 50 ఏళ్ల వారికి పింఛన్ ఇవ్వమంటే మీకు ఇస్తే మిగతా కులాలు కూడా అడుగుతాయని చంద్రబాబు అవమానించారన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రజకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, ఏపీ ఎన్జీఓ రాష్ట్ర నాయకుడు బండి శ్రీనివాసరావు, పలువురు బీసీ సంఘాలు, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏపీలో గొప్ప సంక్షేమ పథకాలు అమలు..

ఏపీలో గొప్ప సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలంగాణ ఎమ్మెల్సీ, కవి గోరటి వెంకన్న అన్నారు. రజకులపై తాను రాసిన పాట అంటే మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఎంతో ఇష్టమన్నారు. రాష్ట్రంలో గతానికి, ఇప్పటికి ఉన్న మంచిని గమనించాలని రజకులకు సూచించారు. పాటలతో ఆయన సభికులను ఉత్తేజపరిచారు.

త్వరలో అగ్నిమాపక శాఖలోకి మహిళలు

చట్ట సవరణకు ప్రభుత్వం నిర్ణయం

సాక్షి, అమరావతి: మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ దిశగా మరో అడుగు ముందుకు వేసేందుకు సిద్ధపడుతోంది. రాష్ట్ర అగ్నిమాపక శాఖలో తొలిసారిగా మహిళలకు అవకాశం కల్పించనున్నది. ఇందుకోసం రాష్ట్ర అగ్నిమాపక చట్టాన్ని సవరించాలని నిర్ణయించింది. అగ్నిప్రమాదాలు, ప్రకృతి విపత్తులను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా రాష్ట్ర అగ్నిమాపక శాఖలో తీసుకురావాల్సిన సంస్కరణలపై విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 6వ ఫైర్ సర్వీస్ గెజిట్ నోటిఫికేషన్ కమిటీ నివేదికను ఇటీవల ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలోనే మహిళలకు ఉద్యోగాలు కల్పించాలని సూచించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఇప్పటివరకూ రాష్ట్ర అగ్నిమాపక శాఖలో మహిళా ఉద్యోగులు లేరు. సైనిక దళాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తున్న తరుణంలో, రాష్ట్ర అగ్నిమాపకశాఖలోనూ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం త్వరలోనే చట్టాన్ని సవరించేందుకు హోమ్‌శాఖ సిద్ధమవుతోంది. దేశంలో ఇప్పటికే తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లోని అగ్నిమాపకశాఖలో మహిళలు పనిచేస్తున్నారు. ఆ దిశగా ఏపీ ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకోనున్నది.



నువ్వు అబద్ధమాడినందుకు నేను దిగులు పడటం లేదు.
ఇక నుంచీ నేను నిన్ను నమ్మలేను కదా అని దిగులు పడుతున్నాను.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 27 నవంబర్ 2023

మాటకు కట్టుబడి...

మన తెలుగు రాజు హాలుడు సంస్కృతం నేర్చుకోవాలనుకున్నప్పుడు ఇద్దరు పండితులు వస్తారు నేర్పేందుకు. ఒకడు గుణాఢ్యుడు. రెండు శర్వవర్మ. 'నేను మీకు సంస్కృతం నేర్పాలంటే 12 సంవత్సరాలు పడుతుంది' అంటాడు గుణాఢ్యుడు. రాజుగారి అర్జెన్సీ గమనించిన శర్వవర్మ 'నేను ఆరు నెలల్లో నేర్పుతాను' అంటాడు. అది అసాధ్యం. కనుకనే గుణాఢ్యుడు ఆగ్రహంతో 'అదే జరిగితే నాకు తెలిసిన సంస్కృత, ప్రాకృత, దేశ భాషలన్నింటినీ విడిచి పెట్టేస్తాను' అంటాడు. శర్వవర్మ ఏవో తిప్పలు పడి కొత్త వ్యాకరణం రాసి ఆరు నెలల్లో రాజుగారికి సంస్కృతం వచ్చు అనిపిస్తాడు. ఇందుకు గుణాఢ్యుడు ఆశ్చర్యపోయి, మొత్తానికి సాధించావ్ అనేసి తన దోవన తాను పోతే ఎవరూ ఏమీ అనరు. తల తీసి మొలేయరు. కాని మాటకు విలువ ఇచ్చే కాలం అది. గుణాఢ్యుడు మహా పండితుడు. భాషే జీవంగా జీవించేవాడు. అలాంటివాడు తానిచ్చిన మాటకు విలువనిచ్చి తనకు తెలిసిన అన్ని భాషలను వదిలిపెట్టి, మౌనిగా మారి, అడవులకు వెళ్లిపోతాడు. అక్కడ అతను పైశాచి భాష నేర్చుకుని 'బృహత్కథ' రాయడం వేరే విషయం. కాని మాటకు కట్టుబడటం వల్లే కదా ఇన్ని వందల ఏళ్ల తర్వాత గుర్తు చేసుకుంటున్నాము.

మనిషి గుంపు జీవనం మొదలెట్టే నాటికి లిపి లేదు. రాతకోతలు లేవు. నోటి మాటే శిలాశాసనం. మాట ఇవ్వడం అంటే ఒప్పందం చేసుకోవడమే. రాజ్యాలు ఏర్పడ్డాక 'మాటకు కట్టుబడటం' ఒక విలువగా, యుగ స్వభావంగా స్థాపన చేసేందుకు సత్య హరిశ్చంద్రుడి కథ విశేషంగా వ్యాప్తిలోకి వచ్చింది. హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి ఇచ్చింది కేవలం మాటే. హరిశ్చంద్రుడు పాలకుడు, రాజు. ఇచ్చిన మాట నెరవేర్చకపోతే ఎవరూ ఏమీ చేయరు. కాని మాట తప్పిన అపప్రథను శిరస్సున మోయడం కంటే రాజ్యాన్ని, భార్యను, కుమారుణ్ణి కూడా కోల్పోయేందుకు సిద్ధమవుతాడు. శ్రీరాముడు మరింత ఉదాత్తుడు. తన మాటకు కాదు, తండ్రి ఇచ్చిన మాటకు కట్టుబడి అడవులకు వెళ్లాడు. 'నువ్వు మాటిస్తే నేనెందుకు వెళ్లాలి నాన్నా' అనంటే దశరథుడు చేయగలిందేముంది? అందుకే రాముడు దేవుడు.

గాంధీ గారు దక్షిణాఫ్రికా వెళుతూ తన తల్లికి 'మద్యం, మగువ, మాంసం జోలికి వెళ్లను' అని మాట ఇచ్చారు. అక్కడకు వెళ్లాక మద్యం ఎలాగూ అలవాటు లేదు. మగువకు లోబడలేని నిష్ఠ ఉంది. కాని మాంసం జోలికి వెళ్లకుండా, అక్కడ అదే దొరుకుతుంది కనుక, ఎలా ప్రాణాలు నిలబెట్టుకోవాలో ఆయనకు అర్థం కాలేదు. అయినా సరే, మాట తప్పలేదు– ఆకలికి తాళలేక పచ్చి బియ్యం బొక్కాడు తప్ప. నిజం. అలా ఉండేవారు జనులు, తల్లికి మాట ఇస్తే, గురువు మాట ఇస్తే, తమకు తాము మాట ఇచ్చుకుంటే జీవితాంతం కట్టుబడేవారు. ఉత్తరాదిలో 'ప్రాణ్ జాయ్ పర్ వచన్ నా జాయ్' అంటారు. మాట పోతే ప్రాణం పోయినట్టే!


మరి కల్తీ సరుకు రాకుండా ఉంటుందా? 'కన్యాశుల్కం'లో కరటక శాస్త్రి తన శిష్యుణ్ణి ఆడవేషం కట్టమని చెప్పి, ఆ వేషంలో లుబ్ధావధాన్లను పెళ్లి చేసుకోమని 'నువ్వు నెగ్గుకొస్తే మా పిల్లన్నీకిచ్చి ఇల్లరికం వుంచుకుంటాను' అంటాడు. 'మాట తప్పితే భూమి తోద్రా' అనంటాడు. దానికి శిష్యుడు 'మీరు యగేస్తే భూవేం చేస్తుందిలెండి?' అనంటాడు. మాట ఇవ్వడాన్ని పాతకాలపు చాదస్తంగా, మాట తప్పడాన్ని కొత్త జీవన మంత్రంగా పసిగట్టి గురజాడ 'కన్యాశుల్కం'లో ఆనవాలు వదిలాడు. నిజమే. మనుషులు కాగితాన్ని తప్ప మాటను నమ్మని పరిస్థితి వచ్చింది. ఎక్కడి మాట అక్కడే మర్చిపోవాలి అనే గిరీశాలు మూలకొకడు, మలుపుకొకడు తయారయ్యారు. 'ఆడిన మాటలు తప్పిన గాడిద కొడకంచు తిట్టగా విని అయ్యో వీడా నాకొక కొడుకని గాడిద ఏడ్చెన్ గదన్నా ఘన సంపన్నా' అనే పద్యం వీరి ఎదుట చదివితే 'తిట్టుకో తిట్టుకో... అలాగే అలాగే' అని కాఫీ తాగి లేచ్చక్కా పోతుంటారు.

కాని ఎంత అధ్వాన్న రోజుల్లోనైనా వడగడితే జారిపోని విలువలు ఎన్నోకొన్ని మనుషులు మిగుల్చుకునే ఉంటారు. మాట తప్పని స్వభావాన్ని వారు నేటికీ గౌరవిస్తూనే ఉన్నారు. ఈ భూమి, ఈ వనరులు, ఈ సంపద, ఈ గాలి, నీరు... వీటన్నింటికీ తాము సమాన హక్కుదార్లమని తెలిసినా, పోరాడి పొందగలిగే శక్తి ఉన్నా, పాలకులుగా... ఏలికలుగా సింహాసనాల్లో కూర్చున్నవారు తమకు నాలుగు మెతుకులుగా విదిల్చితే పొందాలేమోనన్న స్థితికి వారు నెట్టబడినా, ఇలాంటి స్థితిలో కూడా వారు ఎవరి మాట సత్తుదో, ఎవరి మాటలో సత్తువున్నదో సూక్ష్మంగా గమనిస్తూనే ఉంటారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ తమ ఇంగితజ్ఞానం అనే గీటురాయిని బయటకు తీస్తూనే ఉంటారు. నమ్మిన మాటను గెలిపిస్తారు. ఒకవేళ అది నమ్మించిన మాట మాత్రమే అని గ్రహిస్తే సందర్భం కోసం కాచుకుని ఉంటారు. 'తప్పుడు వెధవ' అనే తిట్టు ఉంది. అంటే తప్పు చేసినవాడు మాత్రమే కాదు మాట తప్పినవాడు కూడా!

ప్రజల నుంచి తీసుకుని తిరిగి ప్రజలకు అందించడం అనే ఒక సరళ సూత్రంలో పాలకుడు వాహిక మాత్రమే. ప్రజలకు మంచి చేస్తాను అనే మాట మాత్రమే అతనికి శిరోధార్యం కావాలి. జనం చెవిలో పువ్వు పెట్టే నాలుగు మాటలు చెప్పి తమ మెడలో విజయహారాలు ధరిద్దామను కుంటే అది గేమ్‌లో భాగమే కావచ్చు. కాని అలాంటి గేమ్‌లో తక్కువ ఔటవడమే గాక మాటగా కూడా గుర్తురాని స్థితికి దిగజారి పోతారు. మాటలు వెదజల్లకండి. ఇవ్వగలిగిన మాట మాత్రమే ఇవ్వండి. మాట జాగ్రత్త!

ఓటమిని ఒప్పుకోవడమే క్రీడాస్ఫూర్తి

కామెంట్



కరణ్ థాపర్

పది వరుస విజయాల తర్వాత ప్రపంచ కప్ ఫైనల్‌లో ఓడిపోవడం హఠాత్తాతమే. తట్టుకోలేని దెబ్బే. అయితే అది ఒక వ్యక్తి ప్రవర్తనను, ప్రవర్తన విధానాన్ని ప్రభావితం చేసినందువల్ల... అతడిలో మనం ఆశించిన సౌమ్యతను, మర్యాదను అతడు విస్మరిస్తే దానిని మనం చూసీ చూడనట్లు వదిలేయాలా? 2021 యు.ఎస్. టెన్నిస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ ఫైనల్... నొవాక్ జొకోవిచ్‌కి చాలా పెద్ద మ్యాచ్. అతడు ఆ మ్యాచ్‌ని గెలిస్తే ఒకే ఏడాదిలో మొత్తం నాలుగు గ్రాండ్ స్లామ్‌లలోనూ విజయం సాధించినట్లు అవుతుంది. అద్భుతంగా ఆడాడు. కానీ ఓడిపోయాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయినప్పటికీ మెద్వెదేవ్‌ను మనస్ఫూర్తిగా అభినందించాడు. మన క్రికెటర్లు తమ ఓటమిని హుందాగా ఎలా స్వీకరించాలో నేర్చుకోవలసే ఉంది.

పెద్దమనిషి అని ఒకర్ని అంచనా వేయడానికి ఉన్న అనేకమైన మార్గాలలో బహుశా అత్యంత సునిశితమైనది... వారు ఓటమిలో సైతం సహజ నిశ్చల శాంత గాంభీర్యాన్ని కలిగి ఉండటమేనని నేను చెప్పగలను. ఇక ఆ పెద్దమనిషి క్రీడాకారుడు అయితే కనుక ఓటమిలోని అతడి నిశ్చలతకు మరింతగా ప్రాముఖ్యం ఉంటుంది. ఏదైనా మీరు తీవ్రంగా కోరుకున్నదీ, 'మన చేతుల్లో పనే' అనేంతగా మీరు తిరుగులేని నమ్మకంతో ఉన్నదీ... ఊహించని విధంగా మీ పట్టు నుంచి జారి, మిమ్మల్నొక కలలు కల్లలైన పరాజితునిగా మిగిల్చినప్పుడు మీ కదలికలు, మీ కవళికలు ఎలా ఉంటాయన్నది మీ వ్యక్తిత్వంలోని నాణ్యత పాలును పైకి తేలుస్తుంది.



ఆస్ట్రేలియాతో వరల్డ్ కప్ ఫైనల్స్‌లో విరాట్ కోహ్లీ



గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో తనను ఓడించిన మెద్వెదేవ్‌తో జొకోవిచ్ (తెల్ల చొక్కా)

గత ఆదివారం ఓటమి అనంతరం మన క్రికెట్ జట్టు నిలదొక్కుకోలేక పోయిన పరీక్ష ఇటువంటిదే. అందుకే నేను గుండెల్ని ముక్కలు చేసిన ఆ ప్రపంచ కప్పు పరాజయానికి భారత జట్టు ఎలా స్పందించిందో ఒక ఎంపికగా ఈ వారం రాయదలచాను. గొప్ప వీరులను మీరు మీ హృదయ పీఠాలపై ప్రతిష్ఠించుకున్నప్పుడే, వారి రూపాలను పంకిలపరిచే లోపాలను సైతం సమస్థాయిలో అంగీకరించడం అన్నది కూడా మీ ఆరాధనలోని ఒక తప్పనిసరి బాధ్యత అవుతుంది.. ముఖ్యంగా టీవీల ప్రత్యక్ష ప్రసారంలో వీరులైన మీ జగజ్జెట్టీలను ప్రపంచం అంతా కళ్లింత చేసుకుని చూస్తున్నప్పుడు!

''భారతజట్టులోని చాలామంది ఆటగాళ్లు... విజేతలైన ఆసీస్ జట్టులోని క్రీడాకారులతో కరచాలనం చేసిన తర్వాత మైదానం విడిచిపెట్టారు. కనీసం ప్యాట్ కమిన్స్ ట్రోఫీని పైకెత్తి చూపడాన్ని వీక్షించేంత వరకైనా అక్కడ ఉండలేకపోయారు'' అని మేథ్యూ సాల్విన్ 'న్యూస్.కామ్.ఎయు'లో రాశారు. అదే నిజమైతే అటువంటి ప్రవర్తన అమర్యాదకరమైనది మాత్రమే కాదు, క్షమించరానిది కూడా! ఈ ధోరణి భారత జట్టును, భారత ప్రజలను కూడా చెడుగా ప్రపంచానికి చూపెడుతుంది.

విరాట్ కోహ్లీ 'మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డు అందుకున్నప్పుడు అతడి ప్రవర్తనను నాకు నేనుగా గమనించాను. అతడు నిరుత్సాహానికి గురవడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ స్థాయికి తగని అతడి వైఖరి మాత్రం నేను అంగీకరించలేనిది. సచిన్ టెండూల్కర్‌తో మాత్రమే కరచాలనం చేసి, తక్కిన వాళ్లలో ఒక్కర్ని కూడా కోహ్లీ పట్టించుకోలేదు. అది అమర్యాద మాత్రమే కాదు, క్షమార్హం కాని స్వీయాధిక్య భావన కూడా!

కోహ్లీని మాత్రమే నేనెందుకు వేరు చేసి చూస్తున్నాను? రెండు కారణాల వల్ల. కోట్లాది మందికి అతడు హీరో. తన ఆదర్శపాత్రను గొప్ప సంపదగా సృష్టించుకున్నవాడు. అతడేం చేస్తే వాళ్లు దానిని అనుసరిస్తారు. అంతేనా, అనుకరిస్తారు కూడా! అందుకే అతడి తప్పిదాలు కనిపించకుండా పోవు. ఒక స్టార్‌గా అతడు ప్రశంసలకు ఎలాగైతే అర్హుడో, విమర్శలకూ అంతే యోగ్యుడు.

నేను కఠినంగా మాట్లాడుతున్నానని మీరు అనవచ్చు. పది వరుస విజయాల తర్వాత ఫైనల్‌లో ఓడిపోవడం హఠాత్తాతమే. తట్టుకోలేని దెబ్బే. అయితే అది ఒక వ్యక్తి ప్రవర్తనను, ప్రవర్తన విధానాన్ని ప్రభావితం చేసినందువల్ల అతడిలో మనం ఆశించిన సౌమ్యతను, మర్యాదను అతడు విస్మరిస్తే దానిని మనం చూసీ చూడనట్లు వదిలేయాలా? అది నాకు సమ్మతి కాని వాదన.

ఎందుకో నన్ను చెప్పనివ్వండి. 2021 యు.ఎస్. టెన్నిస్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ ఫైనల్... నొవాక్ జొకోవిచ్‌కి చాలా పెద్ద మ్యాచ్. అందరి మదిలోనూ ఒకటే, అతడు ఆ మ్యాచ్‌ని గెలిస్తే ఒకే ఏడాదిలో అది అతడి నాలుగో గ్రాండ్ స్లామ్ విజయం అవుతుంది. 1969 నాటి రాడ్ లేవర్ ఘనతకు అతడిని సమం చేస్తుంది. పురుషుల టెన్నిస్‌లో ఒక ఏడాదిలోని గ్రాండ్ స్లామ్‌లు అన్నింటిలో విజయం సాధించిన మూడవ వ్యక్తిగా చరిత్రలో నిలుస్తాడు. కానీ ఏమైంది? ఓడిపోయాడు!

ఏ లెక్కన చూసినా గత ఆదివారం విరాట్ కోహ్లీ చవి చూసిన ఓటమి కన్నా కూడా జొకోవిచ్‌ది చాలా పెద్ద ఓటమి. అంతేకాదు – అది చిన్న సంగతేం కాదు – పైగా వ్యక్తిగతమైనది. కనుక అది అసలు సిసలు పరీక్ష.

జొకోవిచ్ అద్భుతంగా ఆడాడు. సందేహమే లేదు. అందుకే ఓటమి అతడిని కుంగదీసింది. అతడి కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. డేనియల్ మెద్వెదేవ్ అతడిని ఓడించిన క్షణాలలో జొకోవిచ్ అతడితో ఏమన్నాడో చూడండి: ''ఈ గ్రాండ్ స్లామ్ టైటిల్‌కు అర్హులు ఎవరైనా ఉన్నారంటే అది మీరు మాత్రమే. చక్కగా ఆడారు. నిజంగానే చాలా చక్కగా! మంచి సమన్వయంతో ఉన్నారు. గ్లాండ్ స్లామ్ ప్రస్తుత పర్యటనల్లోని గొప్ప ఆటగాళ్లలో మీరు ఒకరు. మన మధ్య మంచి స్నేహపూర్వకమైన పోటీ నడిచింది. మీరింకా మరిన్ని గ్లాండ్ స్లామ్‌లు గెలవాలని, మరిన్ని మేజర్ లీగ్స్‌లో ఆడాలని నేను కోరుకుంటున్నాను. మళ్లీ కూడా మీరు ఇలాంటి విజయాన్ని నిశ్చయంగా సాధించ గలరని నేను కచ్చితంగా చెప్పగలను'' అని మెద్వెదేవ్‌ను మనస్ఫూర్తిగా అభినందించాడు జొకోవిచ్.

అదీ క్రీడాస్ఫూర్తి అంటే. అదీ పెద్దరికం అంటే. దురదృష్టవశాత్తూ గతవారం మన క్రికెట్ జట్టు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించింది.

ఇక జొకోవిచ్ ప్రేక్షకులను ఉద్దేశించి ఏమన్నాడో తెలుసా! ''నేను మ్యాచ్ గెలవనప్పటికీ ఈ రాత్రి నా హృదయం పట్టనలవి కాని ఆనందంతో నిండి ఉందని మీకు చెప్పాలనుకుంటున్నాను. మీ అభిమానంతో మీరు నాకు కలిగించిన ప్రత్యేకమైన అనుభూతి కారణంగా నేనిప్పుడు భూమి మీద జీవించి ఉన్నవారిలో అత్యంత సంతోషకరమైన వ్యక్తిని. మీరు నా హృదయాన్ని స్పృశించారు. న్యూయార్క్‌లో నేనెప్పుడూ ఇలా లేను. నిజాయతీగా చెబుతున్నాను. నేను మీ అందరినీ ప్రేమిస్తున్నాను మిత్రులారా! నాకు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు నాకోసం చేసిన ప్రతిదానికీ కూడా'' అని ఉద్వేగంగా మాట్లాడాడు.

మన క్రికెటర్లు– ప్రధానంగా కోహ్లీ – గొప్ప క్రీడాకారులే అయినప్పటికీ వారు తమ ఓటమిని హుందాగా ఎలా స్వీకరించాలో నేటికింకా నేర్చుకోవలసే ఉంది. ఇందుకు రెండు కావాలి. మొదటిది క్రీడా పరాక్రమం. రెండోది శ్రేష్ఠమైన అంతఃచేతనాశక్తి. రెండోది లేకుండా మాత్రం నిజంగా మీరు గొప్పవారు కాలేరు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శాస్త్రాలు కావు!



రామాయణం, మహాభారతం, వేదాలు, ఆయుర్వేదాలను 'సామాజిక శాస్త్రాలు'గా ఎన్సీఈఆర్టీ బోధించలేదు. పురాణం పురాణమే, సైన్సు సైన్సే. సామాజిక శాస్త్రాలు సమాజాన్ని శాస్త్రీయంగా స్వీకరిస్తాయి. అవి పురాణాన్ని శాస్త్రంగా బోధించకూడదు.

– సూర్యకాంత్ వాగ్‌మోరే, సోషియాలజీ ప్రొఫెసర్

వినలేని విషయాలు



ఇది చిత్రం. ప్రతి భారతీయుడూ బెర్ట్రాండ్ రసెల్ పుస్తకాలను చదవాలని 1926లో నెహ్రూ ఒక స్నేహితుడికి ఉత్తరం రాశారు. 1963లో నెహ్రూను విమర్శిస్తూ రసెల్ ఒక పుస్తకం రాశారు. నెహ్రూ దాన్ని నిషేధించారు. (ఇండో–చైనా యుద్ధం పై రాసిన అన్‌ఆర్మ్‌డ్ విక్టరీ.)

– అభిషేక్ బెనర్జీ, రచయిత

నవ్విస్తే అవార్డా?



బెంగళూరు విమానాశ్రయంలో భద్రతాధికారి నా బ్యాగులో ఉన్నది పురస్కారం అని తెలిశాక– "అభినందనలు, ఏం చేస్తుంటావు?" "కమెడియన్ సర్, జోకులు వినిపిస్తాను." "జోకులకు కూడా పురస్కారాలు ఇస్తున్నారా?" "నాకు కూడా చిత్రంగానే అనిపించింది సర్." ఇద్దరమూ నవ్వుకున్నాం.

– వీర్ దాస్, కమెడియన్

బాగా తినాల్సిందే!



నేను ఇండియాను వదిలిపెట్టినట్టే అనిపించదు. తైవాన్‌లో ఏ భారతీయ వేడుక జరిగినా, కనీసం ఐదు మంది నేను సరిగ్గా తినట్లేదనీ, సన్నబడ్డాననీ అంటారు. మన భారతీయులకు, ఇప్పటికే సన్నగా ఉన్నవాళ్లు వ్యాయామం చేయనే కూడదు. ప్రేమ మనుషులు!

– సనా హాష్మీ, ఫెలో

ప్రపంచ సమస్య




హమాస్ అనేది ఇజ్రాయెల్ సమస్య అని మీరు అనుకుంటే, అది పూర్తిగా తప్పు. రాజకీయ ఇస్లాం అనేది మొత్తం ప్రపంచ సమస్య.

– లూయీ అహ్మద్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

నూతన ఒరవడి సృష్టికర్త

వెయ్యేళ్ళుగా వస్తున్న సాహిత్య ఒరవడిని మార్చి మరో వెయ్యేళ్ళ ముందు చూపుతో రచనలు చేసి సంఘ సంస్కరణ కావించిన మహాకవి, మార్గదర్శి, యుగకర్త గురజాడ వేంకట అప్పారావు. అప్పటి విశాఖ జిల్లా ఎస్. రాయవరంలో 1862 సెప్టెంబర్ 21న జన్మించారు. విజయనగరం మహారాజావారి కళాశాలలో బి.ఎ. ఉత్తీర్ణులయ్యారు. సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషా పాండిత్యంతో పాటు లాటిన్, పారసీ, కన్నడ, బెంగాలీ భాషలను కూడా బాగా చదివారు. ఆనంద గజపతి మహారాజు వద్ద శాసన పరిశోధకునిగా పనిచేశారు.



గురజాడ అప్పారావు

గిడుగు రామ్మూర్తి పంతులు వీరికి సహాధ్యాయులు. వీరిరువురూ వ్యవహారిక భాషకు పట్టం కట్టారు. అప్పుడే గురజాడ వారు 'అసమ్మతి పత్రం' రాశారు. ఆయన వ్యాకరణ శృంఖలాలను ఛేదించారు. సకల జనులు ఆదరించే విధంగా ముత్యాల సరాల మాత్రా ఛందస్సులో కరుణ రస ప్రధానంగా 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' లాంటి గేయాలను రాశారు. 'కన్యాశుల్కం' నాటకాన్ని వ్యవహారిక భాషలో రాశారు. నేటికీ ఇటువంటి గొప్ప నాటకం ఇంకొకటి రాలేదు. గురజాడ రాసిన 'దేశభక్తి' గేయం ఆయనను విశ్వకవిగా నిలుపుతుంది.

కులమతాలు అభివృద్ధికి ఆటంకాలని నిరసించారు. మంచి చెడు లనేవి మానవులలో రెండే కులాలు అన్నారు. 'అన్నీ మన వేదాల్లో ఉన్నాయిష' అన్న 'కన్యాశుల్కం'లోని అగ్నిహోత్రావధాని మాటలు ఆలోచింపదగినవి. ప్రపంచ దేశాలు హేతువాద దృక్పథంతో విజ్ఞాన శాస్త్ర ఫలాలు పొందుతుంటే మన దేశం నమ్మకాలు, ఆచారాలు అంటూ అనాలోచితంగా వెనుకబడిపోతోంది అన్నారు. వితంతు వివాహాలు చేయడానికి, కన్యాశుల్కం ఆపడానికి నడుం బిగించిన వీరేశలింగం పంతులు ఉద్యమాల స్ఫూర్తి, సాజన్యారావు పంతులు లాటి సుజనమూర్తులను గురజాడ రచనల్లో ప్రతిబింబిస్తారు. 'మంచి గతమున కొంచెమేనోయి మందగించక ముందు కడుగు' వేయమన్నారు. ఇంతటి మహానుభావుడు 1915 నవంబర్ 30వ తేదీన తుదిశ్వాస విడిచారు.

– జక్కుల రామకృష్ణ
(నవంబర్ 30న మహాకవి గురజాడ వర్ధంతి)

ప్లాస్టిక్ భూతాన్ని మింగేసే బ్యాక్టీరియా


అభిప్రాయం



కె.బి. గోపాలం

ఈ ప్రపంచం మొత్తం మునిగిపోయినా చివరకు వజ్రాలు, ప్లాస్టిక్ మాత్రం మిగిలిపోతాయని చాలా సందర్భాల్లో చెబుతుంటారు. మనిషి తన సౌకర్యం కోసం తయారు చేసుకున్న కొత్త పదార్థాలలో ప్లాస్టిక్ అన్నిటికన్నా పెద్ద శత్రువుగా మారింది. ప్లాస్టిక్‌ను ఏ రకంగానూ పనికివచ్చే విధంగా తిరిగి మార్చడానికి వీలు లేదని పరిశోధకులంతా తలలు పట్టుకుని తరుణోపాయాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఎక్కడా అటువంటి మార్గం దొరికిన దాఖలా కనబడదు. కానీ ఈ మధ్యనే ఒక చిత్రమైన వార్త అందరికీ ఆశలు కలిగేలా చేసింది.

2001 సంవత్సరంలోనే జపనీస్ పరిశోధకులు ఒక వింత విషయాన్ని గమనించారు. మురికి నీరు గుంటలలో పడి ఉన్న ప్లాస్టిక్‌ను కరకరా నమిలేస్తున్న సూక్ష్మ జీవులు వారికి కనిపించాయి. ఆ ప్లాస్టిక్‌లోని కార్బన్‌ను సూక్ష్మజీవులు తిండిగా వాడుకుంటున్నాయి. మిగతా పదార్థాలు అన్నీ తిరిగి తమ సహజ పరిస్థితిలోకి మారు తున్నట్టు అక్కడ వారు గమనించారు. సూక్ష్మ జీవులు మరింతగా పెరుగుతున్నాయి. వాటి ఆకలి మరింతగా పెరుగుతున్నది. అవి మరింతగా ప్లాస్టిక్‌ను తింటున్నాయి.



ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియాను గమనించిన పరిశోధక బృందానికి నాయకుడు కోహెయి ఓడా. క్యోటో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అతను ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. అతని బృందం వారు కనుగొన్న ఈ సూక్ష్మజీవులు అంతకు ముందు ఎక్కడా కనిపించినట్లు లేదు.

రాను రాను ప్లాస్టిక్ కాలుష్యం మాత్రం భయంకరంగా పెరిగిపోతోంది. దాన్ని పట్టించుకోకుండా ఉండే పరిస్థితి లేకుండా ఉంది. సూక్ష్మ జీవులు కనిపించిన నాటి నుండి ఇవాళ్టి వరకు ప్రపంచంలో కొన్ని బిలియన్ టన్నుల ప్లాస్టిక్ తయారైంది అంటున్నారు. పసిఫిక్ సముద్రంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ మేటలు పడి ఉన్నాయని కూడా గమనించారు. చివరకు పండ్లు, పాలలో కూడా మైక్రోప్లాస్టిక్ కాలుష్యం కనబడుతున్నది. మొత్తం ప్రపంచంలో తయారవుతున్న ప్లాస్టిక్‌లో 9 శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు అందుతున్నట్లు లెక్క తేలింది. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ పదార్థాలను మండిస్తున్నారు. దాని వల్ల మరింత కాలుష్యం కలుగుతున్నది.

మొదట్లో ప్లాస్టిక్‌ను నములుతున్న సూక్ష్మజీవులు కనిపించిన తర్వాత ఆ బృందం వారు వాటిని మరిచిపోలేదు. కాజుమి హిరాగా అనే విద్యార్థి ఈ అంశం గురించి పరిశోధనలు సాగిస్తూనే ఉన్నారు. 2016లో ఓడాతో కలిసి ఒక పరిశోధన పత్రాన్ని 'సైన్స్' అనే ప్రసిద్ధ పత్రికలో ప్రకటించారు కూడా. వెంటనే ఆ పత్రం అందరి దృష్టిని ఆకర్షించింది. కేవలం సూక్ష్మ జీవి గురించి మాత్రమే కాకుండా ప్లాస్టిక్‌ను కరిగించడానికీ, అరిగించడానికీ బ్యాక్టీరియా వాడుతున్న ఎంజైమ్ గురించి కూడా పరిశోధన పత్రంలో వివరాలు అందించారు. సూక్ష్మజీవికి 'ఐడియోనెల్లా సకాయియెన్సిస్' అని పేరు కూడా పెట్టారు. సకాయి అనే ఊళ్లో ఆ సూక్ష్మజీవి కనిపించింది మరి. వారి పరిశోధన పత్రాన్ని గురించి ఆ తర్వాత వచ్చిన 1000 పత్రాల్లో రాసినట్టు కూడా తెలిసింది.

40 సంవత్సరాలుగా ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియా గురించి పరిశోధన సాగుతూనే ఉన్నది. ఈ సంగతి పెద్దగా ప్రచారానికి మాత్రం రాలేదు. ఎంజైమ్‌ను పరిశీలించి జెనిటిక్ ఇంజనీరింగ్ ద్వారా అటువంటి ప్లాస్టిక్‌ను కరిగించే రసాయనాలను తయారు చేయవచ్చన్న భావన కూడా పరిశీలనలో ఉంది. అయితే ఈ రకమైన రసాయనాల పనితీరు గురించి సులభంగా చెప్పడానికి మాత్రం ఉండదు. కనుకనే పరిశోధన రెండు అడుగులు ముందుకు పడితే, ఒక అడుగు వెనక్కు పడుతున్నట్టు సాగుతున్నది. ఈ పరిశోధన కొత్త మార్గాల్లో ముందుకు సాగవలసిన అవసరం ఉందని కొలరాడో పరిశోధకులు బెల్ ఈ మధ్యనే ప్రకటించారు. పెట్ ప్లాస్టిక్‌ను కరిగించే 'పెటేస్' అనే ఎంజైమ్ గురించి వారి బృందం పరిశోధిస్తున్నది. రసాయనాన్ని కావాల్సిన రకాలుగా మార్చి చూచి మరింత ముందుకు సాగాలని వారు ప్రయత్నిస్తున్నారు.

దక్షిణ కొరియాలోని 'చోనామ్ నేషనల్ యూనివర్సిటీ' వారు ఈ మధ్య తమ పరిశోధనలో మంచి ఫలితాలను సాధించినట్లు తెలియవచ్చింది. ఒక చోట చాలా కాలంగా మేట పడిన ప్లాస్టిక్‌లో కొన్ని సూక్ష్మజీవులు హాయిగా ప్లాస్టిక్ తింటూ బతుకుతున్నట్టు గమనించారు. వియత్నాం, థాయిలాండ్ లాంటి చోట్ల కూడా ఇటువంటి సూక్ష్మ జీవులు కనిపించాయి.


సూక్ష్మ జీవులు అనగానే అందరికీ వాటి వల్ల రోగాలు వస్తాయి అన్న భావన మాత్రమే కలుగుతుంది. కానీ మనుషులు అనే మనం బ్రతకడానికి అవి ఎంతో ఉపయోగపడుతున్నాయన్న సంగతి ఇప్పటి వరకు కూడా చాలామందికి తెలియదు. ప్లాస్టిక్ కాలుష్యానికి సమాధానంగా సూక్ష్మ జీవులు దారి చూపిస్తే అది అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. మనిషిని కలకాలంగా కలవరపెడుతున్న ప్లాస్టిక్ కాలుష్యానికి నివారణోపాయం దొరికే అవకాశం ఉందంటే అది ఎంతో గొప్ప విషయం.

వ్యాసకర్త సైన్స్ రచయిత । 98490 62055

దూతకార్యం

సీతను అన్వేషించేందుకు బయలుదేరిన వానర వీరులందరిలో హనుమ ఒకడు కనక, సీత ఎక్కడ ఉన్నదో ఏ స్థితిలో ఉన్నదో తెలుసుకొని, తిరిగి వచ్చి, ఆ సమాచారం మాత్రమే చేరవేసి ఉన్నా అదొక అద్భుతమయిన ఘనకార్యంగా మిగిలిపోయేది. మనో జవంతో, మారుత తుల్య వేగంతో, నూరు యోజనాల సముద్రాన్ని లంఘించి, ఆవల ఉన్న సీత జాడ తెలుసుకొని రావడం సామాన్య విషయమా?

అయినా, అంజనీపుత్రుడు అంతమాత్రంతో తృప్తి పడలేదు. సీతమ్మను చూడడమే కాదు, ఆమెను కలిసి ఏకాంతంలో సమగ్రంగా సంభాషించి, చెప్పవలసిందంతా చెప్పి ఆమెకు ఊరట కలిగించాడు. అయ్యవారికి చేరవేసేందుకు అమ్మ సందేశాన్నీ, ఆనవాలుగా ఆమె చూడామణినీ అందుకొన్నాడు. వాటితో తిరిగి వచ్చినా, ఆ దూతకార్యం అసమానమయినదిగా చరిత్రలో నిలిచిపోయేది.



ఆ మాత్రంతో మాత్రం కేసరినందనుడు సరిపెట్టుకొంటాడా? ఆయన దృష్టిలో, ఒక పని అప్పగిస్తే దానితోపాటు పనిలో పనిగా దానికి సంబంధించిన ఇతర కార్యాలు వీలయినన్ని చక్కబెట్టుకొచ్చేవాడే సమర్థుడైన కార్యసాధకుడు. అందుకే, వెంటనే తిరిగి వచ్చి 'చూశారా, చెప్పిన పని చేసుకొచ్చేశాను!' అని ప్రకటించుకొనేందుకు ఆయన తొందరపడలేదు. 'ఇంత దూరం వచ్చినప్పుడు ఇంకా ఏం చేయచ్చు?' అని ఆలోచించాడు.

'సీతను చూశాను. ఆమె రావణుడి చెరలో ఉంది' అని చెప్పినంత మాత్రాన అరణ్యవాసంలో ఉన్న శ్రీరాముడేం చేయగలడు? వెంటనే వచ్చి యుద్ధం చేసి శత్రువును జయించాలి. యుద్ధం చేయాలంటే శత్రువు శక్తి గురించి సరయిన సమాచారం ఉండాలి. అది పాపం ఆయనకు ఎలా దొరుకుతుంది? కనక నేనే సాహసించి, ఇప్పుడు ఇక్కడ ఒక స్థాయిలో యుద్ధం పెట్టుకొంటే, శత్రువు బలాబలాలూ, రణనీతులూ అంచనా కట్టే అవకాశం వస్తుంది' అని ఆలోచించాడు. అశోకవనాన్ని ధ్వంసం చేసి, కజ్జా పెట్టుకొని ఎనభయివేల మంది రాక్షసవీరులను హతం చేశాడు.

అదీ చాలదన్నట్టు, ఒక ఎత్తుగడ వేసి, నేరుగా నిర్భయంగా రావణుడి కొలువుకే వెళ్ళి, ఆయనతో ముఖాముఖి రాయబారం జరిపాడు. హితవు చెప్పడమే కాక, మాటలతోనూ చేతలతోనూ కూడా తీవ్రమైన హెచ్చరిక చేసి, అప్పుడు తిరిగివెళ్ళాడు. కర్తవ్య నిష్ఠా, భుజబలం, బుద్ధిశక్తీ, సహనం, సాహసం... ఒకటేమిటి సకల సద్గుణ సంపత్తిని ప్రదర్శించి, లోకమంతటి చేత 'శ్రీరామదూతం శిరసా నమామి' అనిపించాడు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** పౌర్ణమి ప.2.10 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** కృత్తిక ప.1.48 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.5.52 నుండి 7.29 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.10 నుండి 12.58 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.13 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.26 నుండి 1.01 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 5.20.

క్లుప్తంగా...

గనిలో పేలుడు.. ఒకరి మృతి

అనంతపురం జిల్లాలో ఘటన




ఘటనాస్థలంలో స్వామి మృతదేహం — తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్



కంబగిరి స్వామి (ఫైల్)

పెద్దవడుగూరు: అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కొండుపల్లి సమీపంలోని రాజపుల్లయ్య మైనింగ్ గనిలో జిలెటిన్ స్టిక్ పేలడంతో ఒక కార్మికుడు మృతిచెందాడు. మరొక కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజపుల్లయ్య మైనింగ్ గనిలో బలపం రాయి, డోలమైట్ వెలికి తీస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కార్మికులు 15 చోట్ల జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేలుళ్లు జరిపారు. వాటిలో ఒకటి పేలడంలో జాప్యం జరిగింది. దీంతో కార్మికులు కంబగిరి స్వామి, రాజ్‌కుమార్ గనిలోకి వెళ్లి పరిశీలిస్తుండగా, అది ఒక్కసారిగా పేలింది. ఈ ప్రమాదంలో పెద్దవడుగూరు మండలం కోనాపురం గ్రామానికి చెందిన కంబగిరి స్వామి(40) అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గనిలో పేలుడు గురించి కార్మికులు వెంటనే యజమానికి తెలియజేయగా, ఆయన పోలీసులకు సమాచారం అందించారు. తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, యాడికి సీఐ శంకర్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కాగా, కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల వద్ద గనుల్లో 40 ఏళ్లుగా బలపం రాయి, డోలమైట్ తవ్వకాలు నిర్వహిస్తున్నారని, యజమానులు సరైన భద్రత చర్యలు చేపట్టకపోవడంతో బతుకుదెరువు కోసం పనికి వెళ్తున్న కార్మికులు ప్రమాదాల బారినపడి మృతిచెందుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వైభవంగా దుర్గమ్మ సన్నిధిలో కోటి దీపోత్సవం



కోటి దీపాల వెలుగులో దుర్గగుడి ప్రాంగణం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కోటి దీపోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసిన లక్ష ఒత్తుల దీపాన్ని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం, రాజగోపురం, ఉపాలయాలు, మల్లేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయం, బాలాలయం, ఘాట్‌రోడ్డు, మహా మండపం దిగువన రంగవల్లులతో తీర్చిదిద్ది వాటిపై దీపాలను వెలిగించారు. కోటి దీపోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు హాజరయ్యారు.

దేదీప్యమానం... జ్వాలాతోరణం



శ్రీశైలం టెంపుల్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం శ్రీశైల మహాక్షేత్రంలో జ్వాలాతోరణోత్సవం నిర్వహించారు. ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్దకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నేతితో తడిపిన నూలు వత్తులను ఏర్పాటు చేశారు. వాటిని టూరిజం శాఖ మంత్రి ఆర్‌కే రోజా, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర ప్రముఖులు వెలిగించారు. ఇది తోరణంగా వెలిగింది. ఈ జ్వాలాతోరణం చుట్టూ స్వామి అమ్మవార్ల పల్లకీని మూడుసార్లు తిప్పారు. సంప్రదాయబద్ధంగా పాతాళగంగ వద్ద కృష్ణానదికి విశేష పూజలు జరిపి నదీమతల్లికి ఏకాదశ(పదకొండు) హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులిచ్చారు.

ఈ 'అసైన్డ్' భూములపై పట్టాదారులకే హక్కులు

భూముల యాజమాన్య హక్కులపై మరింత స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం

- అసైన్ చేసి 20 ఏళ్లు పూర్తయిన భూములన్నింటినీ 22ఏ నుంచి తొలగించాలి
- అసైన్డ్ జలవనరుల పోరంబోకు భూములకూ యాజమాన్య హక్కులు
- ఆ తరహా భూముల రికార్డులు దొరక్కపోయినా వెరిఫికేషన్ చేసి హక్కులివ్వాలి
- అసైన్డ్ రాస్తా పోరంబోకు భూములకూ హక్కులు
- అసైన్‌దారు పేరు ఏ రెవెన్యూ రికార్డులో ఉన్నా దాన్ని పరిగణనలోకి తీసుకోవాలి
- 1.12 లక్షల ఎకరాల చుక్కల భూములపై ఆంక్షలు ఎత్తివేయాలి
- జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం తాజా ఆదేశాలు



సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో ప్రభుత్వం మరింత స్పష్టతనిచ్చింది. అర్హత ఉన్న అసైన్డ్ భూములకు సైతం యాజమాన్య హక్కులు కల్పించేందుకు రెవెన్యూ అధికారులు వివిధ కారణాలతో వెనుకాడుతుండడంతో, వారికి ఉన్న అనుమానాలన్నింటినీ నివృత్తి చేస్తూ ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. చట్ట ప్రకారం అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు పూర్తయిన భూములన్నింటిపైనా ఆంక్షలు తొలగించి యాజమాన్య హక్కులు కల్పించాలని తెలిపింది. వివిధ జిల్లాల కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, తహశీల్దార్లతో ఇటీవల జరిగిన వర్క్‌షాప్‌లో అసైన్డ్ భూములు, చుక్కల భూములు, ఈనాం భూములు, జాయింట్ ఎల్‌పీఎంల విభజన, ప్రొవిజినల్ పట్టాలు, ఎస్సీ కార్పొరేషన్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో రెవెన్యూ యంత్రాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకషంగా చర్చించారు. అనంతరం వీటిపై స్పష్టత ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఈ కేసుల్లో యాజమాన్య హక్కులు ఇవ్వొచ్చు

- డీకేటీ రిజిస్టర్, డీకేటీ పట్టా ఆఫీస్ కాపీ, అసైన్‌మెంట్ కమిటీ మినిట్స్ లేకపోయినా వెబ్‌ల్యాండ్, పీఓఎల్ఆర్ వంటి ఏదో ఒక రెవెన్యూ రికార్డులో రైతు పేరు ఉన్నా, 2017 22ఏ జీవోలు లేక 20 సంవత్సరాల క్రితం జారీ అయిన పట్టాదార్ పాస్‌బుక్ ఆధారంగానైనా ఆ భూములకు యాజమాన్య హక్కులివ్వాలి. భూమి పట్టాదారు ఆధీనంలో ఉంటేనే హక్కులు ఇవ్వాలి. ఎవరైనా పట్టాదారు పాస్‌బుక్ నకిలీదని తహశీల్దార్ ధృవీకరిస్తే, దానిని నిరూపించే బాధ్యత కూడా తహశీల్దార్‌దే.
- భూ బదలాయింపు (ల్యాండ్ కన్వర్షన్), అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు పూర్తయిన జల వనరుల పోరంబోకు భూములపై యాజమాన్య హక్కులివ్వాలి. ఈ తరహా భూముల రికార్డులు లభించకపోయినా, లోతుగా పరిశీలన జరిపి, యాజమాన్య హక్కులివ్వాలి.
- భూ బదలాయింపు జరగని సందర్భాల్లో కూడా సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రిట్ పిటిషన్ 140/2022పై హైకోర్టు ఆదేశాల ప్రకారం మినహాయింపు పొందిన భూములకు హక్కులు కల్పించాలి.
- ఏడబ్ల్యూడీ భూములుగా మార్చకుండా తోపు/మేత పోరంబోకులను అసైన్ చేస్తే ఇప్పుడు జిల్లా కలెక్టర్లు ఏడబ్ల్యూడీగా మార్చి యాజమాన్య హక్కులివ్వొచ్చు.
- డి పట్టా జారీ అయినా, రికార్డుల్లో ఆ సర్వే నంబర్‌తో సరిపోలకపోతే, వారి ఆధీనంలో ఉన్న భూమి సర్వే నంబర్‌ను నమోదు చేయాలి. యాజమాన్య హక్కులివ్వడానికి వారికి భూమి అసైన్ చేసిన పాత తేదీని పరిగణనలోకి తీసుకోవాలి.
- ఖాతా నంబర్ 10 వేల లోపు ఉండి, మిగులు భూమిగా రికార్డయి అసైన్డ్ భూములుగా నమోదవని వాటిని అసైన్‌మెంట్ రీ వెరిఫికేషన్‌కు పంపాలి. ఈ భూములకు యాజమాన్య హక్కులిచ్చేందుకు ఎలక్ట్రానిక్ రెవెన్యూ రికార్డుల్లో పట్టాదార్ పేరును చేర్చడానికి సాఫ్ట్‌వేర్‌ను మారుస్తారు.
- ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాని అసైన్డ్ భూములను అసైన్డ్ జాబితాలో చేర్చేందుకు దరఖాస్తుల కోసం ఏపీ సేవా పోర్టల్‌లో ఓ ఆప్షన్ ఏర్పాటు. ఇలాంటి కేసులను సుమోటోగా స్వీకరించేందుకు జేసీల లాగిన్‌లో అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఆ భూములకు హక్కులు ఇవ్వొచ్చు.
- అసైన్‌మెంట్ చేసిన రాస్తా పోరంబోకు భూములకు భూ మార్పిడి (ల్యాండ్ కన్వర్షన్) చేసి వాటికి హక్కులివ్వాలి.
- ఆర్ఎస్ఆర్‌లో అటవీ భూమిగా నమోదైన భూమి, అసైన్‌మెంట్ జరిగి ఆర్ఓఆర్ రికార్డుల్లోనూ నమోదై ఉంటే.. ఆ భూమిని అటవీ చట్టం సెక్షన్ 4(1) కింద నోటిఫికేషన్ జారీ చేయకపోతే దానిపై హక్కులివ్వొచ్చు.
- భూమి స్వభావంలో 'ప్రభుత్వ భూమి-నాట్ ఎలాటెడ్'గా నమోదై.. వాస్తవానికి ఆ భూమి అసైన్‌మెంట్ జరిగి ఉన్న కేసులను జిల్లా స్థాయి వెరిఫికేషన్‌కు పంపాలి. పరిశీలనలో అర్హత సాధిస్తే అప్పుడు వాటిపై హక్కులు ఇవ్వొచ్చు.
- అర్హత ఉన్న అసైన్డ్ భూములు పొరపాటున పట్టా భూమిగా నమోదై 22ఏ జాబితాలో ఉంటే జిల్లా కలెక్టరు వాటిని ఆ జాబితా నుండి తొలగించాలి. రిమార్క్స్ కాలమ్‌లో యాజమాన్య హక్కులు ఇచ్చిన విధానాన్ని నమోదు చేయవచ్చు.
- రికార్డులు అందుబాటులో లేని, నీటి వనరులుగా గుర్తించిన కారణంగా యాజమాన్య హక్కులు ఇచ్చే విషయంపై నిర్ణయం తీసుకోలేని అసైన్డ్ భూములన్నింటినీ మళ్లీ ధృవీకరణ కోసం వీఆర్వో లాగిన్‌కు పంపాలి. ధృవీకరణలో అర్హత పొందితే వాటికి హక్కులివ్వాలి.
- 20 ఏళ్ల క్రితం జారీ అయిన తాత్కాలిక పట్టాలైనా, డీకేటీ పట్టాలు జారీ అయ్యాయా లేదా అనే దానితో సంబంధం లేకుండా యాజమాన్య హక్కులివ్వాలి.

చుక్కల భూములపై..

1.12 లక్షల ఎకరాల చుక్కల భూములు అసైన్డ్ భూములు కావడంతో అవి నిషేధిత జాబితాలో ఉన్నాయి. ఈ భూములన్నీ 20 ఏళ్ల క్రితం అసైన్‌మెంట్ చేసినవి. ఈ భూములన్నింటినీ 22ఏ జాబితాతో పాటు చుక్కల భూముల జాబితా నుంచి కూడా తొలగించాలి.

ఈనాం భూములపై..

- 22ఏ జాబితా నుండి తొలగించిన గ్రామ సర్వీస్ ఈనాం భూములు వెబ్‌ల్యాండ్ ఎలక్ట్రానిక్ రికార్డుల్లో కనపడాలి. ఆలయాలు, ఎండోమెంట్, వక్ఫ్, ధార్మిక సేవా ఈనాంలు మినహా మిగిలిన అన్ని ఈనాం భూములను 22ఏ జాబితా నుండి తొలగించాలి. అలాంటి ఈనాం భూములన్నీ ఈనాం/ఎస్టేట్/రైత్వారీ గ్రామంలో భాగమైనా, దాంతో సంబంధం లేకుండా తొలగించాలి.
- భవిష్యత్తులో ఏ రీ సర్వే గ్రామాల్లోనూ ఉమ్మడి ఎల్‌పీఎంలు సృష్టించకూడదు. ఎక్కడైనా ప్రజా సంఘాలు ఉమ్మడి ఎల్‌పీఎంల కోసం అభ్యర్థిస్తే తహశీల్దార్లు వారి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి వాటి ఆమోదం కోసం ఆర్డీవోలకు పంపాలి.
- తనఖాలో ఉన్న భూములు యాజమాన్య హక్కుల కల్పనకు అర్హత కలిగి ఉంటే కేవలం తనఖాలో పెట్టారనే కారణంతో వాటిని తిరస్కరించకూడదు. యాజమాన్య హక్కులు కల్పించిన వెంటనే వాటిని 22ఏ జాబితా నుంచి తొలగించాలి.

చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే 2024 ఆగస్టుకు రెడీ

- శరవేగంగా సాగుతున్న రహదారి పనులు
- కర్ణాటకలో 50, ఏపీలో 40, తమిళనాడులో 32 శాతం పూర్తి
- ఇప్పటికే మట్టిరోడ్డుపై వాహనాల రాకపోకలు
- సమీప భూముల ధరలకు రెక్కలు



బైరెడ్డిపల్లి వద్ద ఎక్స్‌ప్రెస్‌హైవే జంక్షన్ మార్గంలో జల్లి పనులు

పలమనేరు(చిత్తూరు జిల్లా): భారత్‌మాల పరియోజన పథకంలో భాగంగా ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) చేపట్టిన చెన్నై-బెంగళూరు 6 ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గంలో శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను 2024 ఆగస్టుకల్లా పూర్తిచేసి రోడ్డును ప్రారంభించేలా ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు తీసుకుంటుంది.

పదిప్యాకేజీల్లో చకచక నిర్మాణ పనులు

చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్ నుంచి బెంగళూరు సమీపంలోని హొసకోట వరకు 283.5 కిలోమీటర్ల మేర ఈ రహదారిని రూ.16,730 కోట్ల వ్యయంతో ఎన్‌హెచ్ఏఐ 2021నుంచి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 90 మీటర్ల వెడల్పు రోడ్డు నిర్మాణంలో భాగంగా మూడు ఫేజ్‌ల్లో పనులు సాగుతున్నాయి. తొలిఫేజ్‌లో కర్ణాటకలోని 71 కిలోమీటర్లలో ఇప్పటికే 50 శాతం, రెండు, మూడు ఫేజ్‌లలో భాగంగా ఏపీలోని చిత్తూరు జిల్లాలో 40 శాతం, తమిళనాడు రాష్ట్రంలో 32 శాతం పనులు పూర్తయ్యాయి. చిత్తూరు జిల్లాలో 91కి.మీల మేర ఇప్పటికే మట్టిరోడ్డు పనులు, అలైన్‌మెంట్ ల్యాండ్ లెవలింగ్ జరిగింది. దీంతో జల్లి పరిచే పనులు సాగుతున్నాయి.

భూముల ధరలకు రెక్కలు..

పలమనేరు నియోజకవర్గం మీదుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌హైవే కారణంగా ఇక్కడ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఎకరా రూ. 20 లక్షలుండగా ఇప్పుడు రూ.30 నుంచి 35 లక్షలకు చేరింది. ఎక్స్‌ప్రెస్‌హైవేకు ఆనుకొని ఉన్న భూముల్లో పలు పరిశ్రమలను నిర్మించి దీన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా చేపట్టనున్నట్లు ఇటీవలే కర్ణాటకలోని హొసకోట వద్ద రోడ్డు పనులను పరిశీలించిన కేంద్రమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. దీంతో ఈ రెండు మహానగరాలకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లో ఎక్స్‌ప్రెస్ హైవే వెళ్లనున్న మార్గాల్లో భారీగా భూములు కొనుగోలు చేశారు.

ఎక్స్‌ప్రెస్‌హైవే వివరాలు...

- చెన్నై నుంచి బెంగళూరుకు 283.5కి.మీ.రహదారి నిర్మాణం
- ఇది కర్ణాటకలో 77 కి.మీ, ఏపీలో 91కి.మీ, తమిళనాడులో 93కి.మీ.
- గతంలో బెంగళూరు-చెన్నై ప్రయాణ సమయం 6 గంటలు
- ఎక్స్‌ప్రెస్‌హైవేలో అయితే కేవలం 2 గంటల 15నిమిషాలు మాత్రమే
- ఈ రహదారిలో సాధారణ వేగం గంటకు 120 కి.మీ.
- ఎక్స్‌ప్రెస్‌హైవేలో 162 బ్రిడ్జిలు
- 4 రైల్వేక్రాసింగ్‌లు, 143 కల్వర్టులు
- 52 పెడెస్ట్రియన్ అండర్‌పాస్‌లు, 41 వాహనాల అండర్‌పాస్‌లు
- మొత్తం 17 ఫ్లెఓవర్‌లు

మూడు రాష్ట్రాల్లో రోడ్డు కనెక్ట్ కానున్న పట్టణాలు..

- హోస్కోట (బెంగళూరు రూరల్ జిల్లా)
- మాలూరు (కోలారు జిల్లా)
- బంగారుపేట (కోలారు జిల్లా)
- కేజీఎఫ్ (కోలార్‌జిల్లా) ■ వీ.కోట (చిత్తూరు జిల్లా, ఏపీ)
- హైవేజంక్షన్-బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)
- పలమనేరు (చిత్తూరు జిల్లా) ■ బంగారుపాళెం (చిత్తూరు జిల్లా)
- చిత్తూరు, గుడిపాల (చిత్తూరు జిల్లా)
- రాణిపేట,వాలాజాపేట్, అరక్కోణం (రాణిపేట జిల్లా, తమిళనాడు)
- శ్రీపెరంబుదూర్ (కాంచీపురం జిల్లా)

• తెలంగాణ

ముక్కోణపు పోటీ @ 42

- ఏడు చోట్ల బహుముఖం
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ 42 స్థానాల్లో త్రిముఖం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ 70 స్థానాల్లో ద్విముఖం
- తుదిఘట్టానికి చేరుతున్న ప్రచారపర్వం
- బీజేపీ తరఫున అన్ని ప్రాంతాలూ చుట్టేస్తున్న పీఎం, సీఎంలు, కేంద్ర మంత్రులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం తుదిఘట్టానికి చేరుతోంది. పోలింగ్ తేదీ దగ్గర పడటంతో ప్రధాన రాజకీయపార్టీల అగ్రనేతలు సుడిగాలి పర్యటనలతో రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. బీజేపీకి సంబంధించి ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సుడిగాలి పర్యటనలు చేసేస్తున్నారు. కాంగ్రెస్‌అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల సీఎంలు, అఖిల భారత కాంగ్రెస్ నేతలు ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ఇక రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కలియ తిరుగుతున్నారు. ప్రత్యర్థులపై ఆరోపణలు, ప్రత్యారోపణలు, వ్యక్తిగత దూషణలు, చేసిన, చేయబోయే అంశాలు వల్లె వేస్తూ ఉధృతంగా ఆయా పార్టీల నేతలందరూ ప్రచారంలో మునిగి తేలుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మూడేసి రోజుల పాటు రాష్ట్రంలోనే మకాం వేసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీకి చెందిన యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వశర్మ, దేవేంద్ర ఫడ్నవీస్‌లతో పాటు పార్టీ అగ్రనేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ గతనెల 15వ తేదీ నుంచి ఇప్పటి వరకు దాదాపు 92 అసెంబ్లీ స్థానాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక, ఆ పార్టీ సీఎంలు భగేల్, సిద్ధరామయ్య తదితరులు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. టీఆర్ఎస్ నుంచి సీఎంతోపాటు కల్వకుంట్ల తారక రామారావు, హరీశ్‌రావులు రాష్ట్రం మొత్తం చుట్టి వస్తుంటే.. కవిత నిజామాబాద్ జిల్లాకు మాత్రమే పరిమితమై ప్రచారం సాగిస్తున్నారు. బీఎస్పీ నుంచి మాయావతి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సీపీఎం నుంచి సీతారాం ఏచూరి, బృందాకరత్, సీపీఐ నేత డి.రాజా తదితరులు ఆయా పార్టీల తరపున ప్రచారం చేస్తున్నారు. అన్ని పార్టీలు తమ ఎజెండాను ప్రజల ముందు ఉంచాయి.

ద్విముఖ పోరు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకుగాను దాదాపు 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొంటే.. మరో 70 స్థానాల్లో ద్విముఖ పోరు నెలకొంది. మరో ఏడు స్థానాల్లో బహుముఖ పోటీ ఉంది. త్రిముఖ పోరులో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య తీవ్ర పోటీ ఉంటే, 70 స్థానాల్లో ద్విముఖ పోరు ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే నెలకొంది. ఇక ఏడు స్థానాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, సీపీఎంల మధ్య బహుముఖ పోటీ నెలకొంది. ఇందులో సిర్పూర్ కాగజ్‌నగర్, కొత్తగూడెం, పెద్దపల్లి, సూర్యాపేట, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, నల్లగొండ స్థానాలు ఉన్నాయి.

త్రిముఖ పోటీ ఉన్న కొన్ని సెగ్మెంట్‌లు ఇవీ..

- త్రిముఖ పోటీ ఉన్న స్థానాల్లో ప్రధానంగా కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ గురించి చెప్పుకోవాల్సి ఉంది. సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ నుంచి వెంకట రమణారెడ్డి పోటీ పడుతున్నారు. కరీంనగర్ నుంచి మంత్రి గంగుల కమలాకర్, బీజేపీ నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, కాంగ్రెస్ నుంచి శ్రీనివాస్ బరిలో ఉన్నారు. కోరుట్ల నుంచి బీజేపీ నుంచి ప్రస్తుత ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ నుంచి డాక్టర్ సంజయ్, బీజేపీ నుంచి నర్సింగ్‌రావు బరిలో ఉన్నారు. మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ తరఫున మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తనయుడు మిథున్‌రెడ్డి రంగంలో ఉన్నారు.

శ్రీవారి ఆలయంలో కార్తీక దీపోత్సవం

- నేతి ఒత్తులతో దీపాల వెలిగింపు



శ్రీవారి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవారికి సాయంకాల కైంకర్యాదులు, నివేదనలు పూర్తయ్యాక ఈ దీపోత్సవాన్ని కన్నుల పండువగా చేపట్టారు. సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం ప్రారంభమైంది. మొదట శ్రీయోగ నరసింహస్వామి ఆలయం పక్కన ఉన్న పరిమళం అర దగ్గర 100 కొత్త మూకుళ్లలో నేతి ఒత్తులతో దీపాలు వెలిగించారు. తదుపరి వీటిని ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ, ఆనందనిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. ఆ తర్వాత గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారిమేడ, ద్వారపాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభేరా, తాళ్లపాక వారి అర, భాష్యకారుల సన్నిధి, యోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద సుమారుగా 100 నేతి జ్యోతులను మంగళవాయిద్యాల నడుమ ఏర్పాటు చేశారు. ఈ కార్తీక దీపోత్సవంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, ఈవో ఏవీ. ధర్మారెడ్డి, శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి, కేంద్ర మంత్రి




ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు చేయగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో లేపాక్షి ఎండీ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఉన్నారు.

• తెలంగాణ

ఎయిర్‌పోర్ట్ మెట్రోకు పీఆర్ఎస్ఐ అవార్డు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్‌కు వార్తాలేఖ ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా-2023 జాతీయ అవార్డు లభించింది. జూన్ 2023 త్రైమాసికానికి సంబంధించిన వార్తాలేఖలో ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు, నిర్మాణానికి ముందు చేపట్టిన పలు పనుల వివరాలు, ఎండీ ఎన్వీఎస్ రెడ్డి నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటనలు, తదితర ఆకర్షణీయమైన ఫొటోలతో ఆ ఎడిషన్‌ను ప్రచురించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఐటీసీ లిమిటెడ్ న్యూస్ లెటర్‌తో కలిపి వార్తాలేఖ సంయుక్తంగా జాతీయ స్థాయిలో ఈ మొదటి బహుమతిని అందజేశారు. ఈ మేరకు న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ప్రజా సంబంధాల ఉత్సవంలో ఈనెల 25న హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో సీపీఆర్వో మల్లాది కృష్ణానంద్‌కు రాజ్యసభ సభ్యుడు సుధాంశు త్రివేది, పార్లమెంటు సభ్యుడు నరేశ్ బన్సల్ సమక్షంలో స్వామి చిదానంద సరస్వతి స్వామిజీ, రిషికేశ్ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి ప్రజాసంబంధాల బృందాన్ని అభినందించారు.

నేడు మోదీ, అమిత్‌షా సహా ముఖ్యనేతల ప్రచారం

మహబూబాబాద్, కరీంనగర్‌లలో మోదీ బహిరంగసభ

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సహా కొందరు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత సీఎంలు సోమవారం విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. మహబూబాబాద్, కరీంనగర్‌లలో బహిరంగసభలతో పాటు హైదరాబాద్‌లో మోదీ రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవంలో పాల్గొని, ఓ గురుద్వారాను సందర్శించిన అనంతరం ఢిల్లీకి తిరుగు పయనమవుతారు. హుజూరాబాద్‌లో బహిరంగసభ, పెద్దపల్లి, మంచిర్యాలలో అమిత్‌షా రోడ్‌షో నిర్వహించిన అనంతరం బేగంపేట నుంచి ఢిల్లీ వెళ్తారు. సోమవారం ఉదయం జగిత్యాలలో రోడ్‌షో అనంతరం బోధన్, బాన్సువాడ, జుక్కల్‌లో నిర్వహించే బహిరంగసభలో జేపీ నడ్డా పాల్గొంటారు. దేవరకద్ర, మంథని సభల్లో, పరకాలలో రోడ్‌షో అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ నిర్వహించనున్నారు. హనుమకొండలోని విష్ణుపురి గార్డెన్స్‌లో ఐటీ ఇంటలెక్చువల్ మీట్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పీయూష్ గోయల్ పాల్గొంటారు. సిద్దిపేటలో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో కేంద్ర సమాచార, క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ పాల్గొంటారు. అలంపూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధరన్ హాజరవుతారు.

కాంగ్రెస్ అమ్ముడుపోయే పార్టీ

- అది బీఆర్ఎస్‌ను బీ టీమ్‌లా కాపాడుతోంది
- మక్తల్, ములుగు, భువనగిరి సభల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సాక్షి, యాదాద్రి/నారాయణపేట/ములుగు: కాంగ్రెస్ అంటేనే అమ్ముడుపోయే పార్టీ అని, అది తెలంగాణలో బీఆర్ఎస్‌ను బీ టీమ్‌లా కాపాడుతోందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్టేనని, ఆ రెండింటికీ చెక్ పెట్టి బీజేపీని గెలిపించాలని కోరారు. మూసీ నదిలా తెలంగాణ మొత్తాన్ని కేసీఆర్ అవినీతితో కలుషితం చేశారని.. ఈ అవినీతి కాలుష్యాన్ని శుద్ధి చేయాలంటే బీజేపీకి అధికారం అప్పగించాలని పేర్కొన్నారు. ఆదివారం మక్తల్, ములుగు, భువనగిరి నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభల్లో అమిత్‌షా మాట్లాడారు. ''కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు బీఆర్ఎస్‌కు వేసినట్లే. కేంద్ర, రాష్ట్రాల్లో వారి మధ్య అధికారాన్ని పంచుకునే డీల్ కుదిరింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎలాగూ అధికారంలోకి రాదు. ఆ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఇక్కడ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తారు. బీఆర్ఎస్ రాబోయే రోజుల్లో కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనేది ఒప్పందం'' అని ఆయన అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ చేపడతామని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఇస్తున్న నాలుగు శాతం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెంచుతామన్నారు. ''భవ్యమైన, దివ్యమైన అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరుగుతోంది. జనవరి 22న ప్రాణప్రతిష్ఠ జరగనుంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇక్కడి ప్రజలకు ఉచితంగా అయోధ్య ప్రయాణం, వసతి, దర్శనం కల్పిస్తాం..'' అని అమిత్ షా ప్రకటించారు.

క్లుప్తంగా...

'26/11' మృతులకు రాష్ట్రపతి నివాళులు

న్యూఢిల్లీ: 2008 నవంబర్ 26న ముంబైలో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా దాడిలో మృతిచెందిన భద్రతా సిబ్బందికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మాతృభూమి సంరక్షణ కోసం వారు ప్రాణాలర్పించారని కొనియాడారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానికి వ్యతిరేకంగా పోరాడుతామంటూ ప్రతిజ్ఞ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రపతి 'ఎక్స్'లో పోస్టు చేశారు.

30న దుబాయ్‌కి మోదీ

న్యూఢిల్లీ: వరల్డ్ క్లైమేట్ యాక్షన్ సమిట్‌లో పాల్గొనేందుకు ఈ నెల 30న ప్రధాని మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కు వెళ్లనున్నారు. యూఏఈ అధ్యక్షుడు, దుబాయ్ పాలకుడు అయిన షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ నవంబర్ 30, డిసెంబర్ ఒకటో తేదీల్లో ఆ దేశంలో పర్యటిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది.

మాస్కోపై డ్రోన్ల దాడి

మాస్కో: మాస్కో లక్ష్యంగా డజన్ల కొద్దీ డ్రోన్లతో ఉక్రెయిన్ ఆదివారం దాడికి యత్నించినట్లు రష్యా ఆరోపించింది. శనివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పైకి రష్యా 60కి పైగా డ్రోన్లను ప్రయోగించిన విషయం తెలిసిందే. ఆదివారం మాస్కో పరిసర ప్రాంతాలపైకి దూసుకొచ్చిన 24 వరకు ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా తెలిపింది. మాస్కోలోని మూడు వేర్వేరు చోట్ల జరిగిన డ్రోన్ దాడుల్లో ఎవరూ గాయపడలేదని గవర్నర్ ఆండ్రీ ఒవొబియెవ్ తెలిపారు. మాస్కోకు దక్షిణాన ఉన్న తుల నగరంలోని 12 అంతస్తుల అపార్టుమెంట్‌ను ఒక డ్రోన్ ఢీకొట్టగా ఒకరు గాయపడినట్లు సమాచారం.

అతిపెద్ద టైగర్ రిజర్వ్!

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని రెండు అభయారణ్యాలను కలిపేసి దేశంలోనే అతిపెద్దదైన పులుల అభయారణ్యాన్ని ఏర్పాటుచేయాలని కేంద్రం నిర్ణయించుకుంది. మధ్యప్రదేశ్‌లోని నౌరాదేహి వన్యప్రాణి అభయారణ్యం, రాణి దుర్గావతి వన్యప్రాణి అభయారణ్యాలను కలిపేయనున్నట్లు ఒక నోటిఫికేషన్‌లో కేంద్రం పేర్కొంది. సాగర్, దామోహ్, నర్సింగ్‌పూర్, రేసిన్ జిల్లాల్లో విస్తరించిన ఈ రెండు అభయారణ్యాలను కలిపేస్తే దేశంలోనే పెద్దదైన 2,300 కిలోమీటర్ల విస్తీర్ణంలో నూతన అభయారణ్యం ఆవిష్కృతం కానుంది. ఇది వచ్చే రెండు, మూడు నెలల్లో ఏర్పాటుకానుంది.

కోర్టులను ఆశ్రయించడానికి సంకోచం వద్దు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

సాక్షి, న్యూఢిల్లీ: భారత సుప్రీంకోర్టు గత ఏడు దశాబ్దాలుగా ప్రజా న్యాయస్థానంగా వ్యవహరిస్తోందని భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. ఎంతో విశ్వాసంతో వచ్చిన వేలాది మంది పౌరులు సుప్రీంకోర్టు ద్వారా న్యాయం పొందారని పేర్కొన్నారు. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించడానికి భయపడాల్సిన పని లేదని ప్రజలకు సూచించారు. నిస్సంకోచంగా కోర్టులకు రావొచ్చని చెప్పారు. ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో సీజేఐ మాట్లాడారు. వ్యవస్థీకృత ప్రజాస్వామ్య సంస్థలు, ప్రక్రియల ద్వారా రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి రాజ్యాంగం మనకు వీలు కల్పిస్తుందని వివరించారు. ఎన్నో రకాల సమస్యల పరిష్కారానికి న్యాయస్థానాల వ్యవస్థ ఉపయోగపడుతుందని వెల్లడించారు. దేశంలోని ప్రతి కోర్టులో ప్రతి కేసు రాజ్యాంగబద్ధమైన పాలనకు పొడిగింపేనని అన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి ఎన్నో విప్లవాత్మక చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నామని ఉద్ఘాటించారు. కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాలు సైతం ప్రారంభించామని తెలిపారు. దేశ పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడానికి తమ వంతు కృషి చేస్తున్నామని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయం పొందడానికి కోర్టులను చివరి మజిలీగా భావించాలన్నారు. 2023 నవంబర్ 25 నాటికి సుప్రీంకోర్టు 36,068 తీర్పులను ఆంగ్ల భాషలో వెలువరించిందని చెప్పారు. ఈ తీర్పులను ప్రాంతీయ భాషల్లోకి అనువదించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని సవరించుకొనే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే సామర్థ్యం రాజ్యాంగానికి ఉందని తెలియజేశారు.


రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం సుప్రీంకోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న రాష్ట్రపతి ముర్ము, సీజేఐ జస్టిస్ చంద్రచూడ్. చిత్రంలో కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, న్యాయవాదులు పాల్గొన్నారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఏడడుగుల ఈ అంబేడ్కర్ విగ్రహాన్ని శిల్పి నరేష్ కుమావత్ రూపొందించారు.

ఆలిండియా జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు చేయాలి: రాష్ట్రపతి

నైపుణ్యం కలిగిన యువతను న్యాయ వ్యవస్థలోకి తీసుకురావడానికి, వారి ప్రతిభకు సాన పెట్టడానికి అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు ఏర్పాటు చేయాలని రాష్ట్రపతి ముర్ము సూచించారు. ఆదివారం సుప్రీంకోర్టులో రాజ్యాంగ దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. న్యాయం పొందే విషయంలో పౌరులకు ఖర్చు, భాష అనే అవరోధాలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇలాంటి పరిమితులను తొలగించాలన్నారు. న్యాయాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని, ప్రజలే కేంద్రంగా న్యాయ వ్యవస్థను తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు. యువత న్యాయ వ్యవస్థలోకి ప్రవేశించడానికి మరిన్ని అవకాశాలివ్వాలన్నారు.

పార్లమెంట్ అభేద్యమైనది: ఉపరాష్ట్రపతి

ప్రజాస్వామ్యానికి ఆత్మ పార్లమెంట్ అని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ చెప్పారు. ఆదివారం ఢిల్లీలో రాజ్యాంగ దినోత్సవంలో మాట్లాడారు. పార్లమెంట్ ఔన్నత్యాన్ని కార్యనిర్వాహక వ్యవస్థ గానీ, న్యాయ వ్యవస్థ గానీ తగ్గించలేవని పేర్కొన్నారు. పార్లమెంట్ అభేద్యమైనదని స్పష్టం చేశారు. పార్లమెంట్ అధికారాల్లో జోక్యం రాజ్యాంగ ఉల్లంఘన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని చెప్పారు.

నిట్టనిలువుగా డ్రిల్లింగ్ మొదలు

- ఉత్తరకాశీ సొరంగ రెస్క్యూలో మరో ప్లాన్ మరూ
- ఆగర్ మెషీన్ ముక్కలు తొలగించాకే మాన్యువల్ డ్రిల్లింగ్

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ సొరంగంలో 41 మంది కార్మికులను కాపాడేందుకు సహాయక బృందాలు మరో ప్రణాళికను పట్టాలెక్కించాయి. రెండు మూడు రోజులుగా శిథిలాల గుండా సమాంతరంగా చేసిన డ్రిల్లింగ్ పనులను ప్రస్తుతానికి పక్కనబెట్టేశారు. కొండ పై నుంచి నిట్టనిలువుగా 86 మీటర్ల డ్రిల్లింగ్ పనులను ఆదివారం మధ్యాహ్నం మొదలు పెట్టారు. 'మొదలెట్టి నిలువుగా 20 మీటర్లకుపైగా డ్రిల్లింగ్ చేశాం. భారీ బండలు లాంటివి అడ్డుప డకపోతే నవంబర్ 30వ తేదీకల్లా డ్రిల్లింగ్ పూర్తి అయ్యే అవకాశ ముంది. 85 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేశాక సొరంగం పైకప్పుకు చేసిన కాంక్రీట్, ఉక్కు రాడ్ల నిర్మాణాన్ని ఛిద్రం చేసి మార్గం సుగమం చేయాల్సి ఉంది'' అని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ) సభ్యుడు మాజీ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నాయిన్ చెప్పారు.

''ఇప్పటికి మొత్తంగా ఆరు రకాల రెస్క్యూ ప్లాన్‌లను అమలుచేశాం. అయినా సరే మొదటిదే అన్నింటికన్నా ఉత్తమం, సురక్షితం. సమాంతరంగా తవ్వే ప్లాన్‌ను మళ్లీ అమలుచేస్తాం. దాదాపు 62 మీటర్ల మేర సొరంగం కూలింది. ఇందులో 47 మీటర్ల వరకు శిథిలాల గుండా ఆగర్ మెషీన్‌తో డ్రిల్లింగ్ చేశాం. కూలినభాగంలోని కాంక్రీట్ నిర్మాణ రాడ్లు.. డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లను ముక్కలుచేశాయి. దాంతో 47 మీటర్లవరకు ఉన్న మెషీన్‌ను వెనక్కి లాగాం. 15 మీటర్లు లాగాక మెషీన్ విరిగిపోయి ముక్కలు లోపలే ఉండిపోయాయి. ప్లాస్మా, గ్యాస్ కట్టర్‌లతో ముక్కలను విడివిడిగా కట్‌చేసి బయటకు తీస్తున్నాం. 23 మీటర్లవరకు ముక్కలను తొలగించాం. మొత్తం పొడవునా బ్లేడ్ల ముక్కలను తీయడానికి ఒక రోజంతా పట్టొచ్చు. ముక్కలన్నీ తీసేశాక అదే మార్గంలో భారత సైన్యంలోని మద్రాస్ యూనిట్ ఇంజనీర్లు, ట్రెంచ్‌లెస్ ఇంజనీరింగ్ సంస్థల సంయుక్త బృందం మ్యాన్యువల్‌గా తవ్వడం మొదలుపెడుతుంది'' అని వివరించారు. '' 62 మీటర్ల శిథిలాల గుండా ఇప్పటికే 47 మీటర్ల డ్రిల్లింగ్ పూర్తయింది. మెషీన్ బ్లేడ్లు తొలగించాక మిగతా 15 మీటర్లను మ్యాన్యువల్‌గా తవ్వితే కార్మికులు చిక్కుకున్న చోటుకు చేరుకోవచ్చు'' అని ఆయన వెల్లడించారు. గత 14 రోజులుగా చిక్కుకుపోయిన కార్మికులను బయటకు తెచ్చేందుకు సహాయక సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ఛార్‌ధామ్ ప్రాజెక్టులో భాగంగా రోడ్డుమార్గంలో ప్రయాణ దూరాన్ని తగ్గించేందుకు సిల్‌క్యారా-బార్కోట్ మార్గంలో సొరంగం నిర్మిస్తుండగా నవంబర్ 12వ తేదీన లోపల కొంత భాగం కూలిపోవడంతో కార్మికులు రెండు కిలోమీటర్ల పొడవైన భాగంలో చిక్కుకుపోయారు.


సొరంగం వద్ద ఆదివారం కొనసాగుతున్న తవ్వకం పనులు

చైనాలో నిమోనియా కలకలంపై కేంద్రం అప్రమత్తం

ఆరోగ్య సంసిద్ధతపై సమీక్ష నిర్వహించుకోవాలని రాష్ట్రాలకు సూచన

న్యూఢిల్లీ: చైనాలో కొత్తగా నిమోనియా కేసులు వెలుగుచూస్తుండటంపై భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. వెంటనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో సమగ్రస్థాయిలో ఆరోగ్య సంసిద్ధతపై సమీక్ష నిర్వహించుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటన జారీచేసింది. 'ఉత్తర చైనాలో చిన్నారుల్లో శ్వాససంబంధ కేసుల ఉధృతి కనిపిస్తోంది. ఈ పరిస్థితిని భారత సర్కార్ నిశితంగా పరిశీలిస్తోంది. ఇప్పటికిప్పుడు భయపడాల్సిన పని లేదు. కానీ ముందు జాగ్రత్త చర్యగా మీమీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆరోగ్య సన్నద్ధతపై సమీక్ష నిర్వహించుకోండి'' అని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలనా యంత్రాంగాలకు లేఖ రాశారు. '' ఇంఫ్లూయెంజా తరహా కేసు(ఐఎల్ఐ), అత్యంత తీవ్రమైన శ్వాస(ఎస్ఏఆర్ఐ) కేసుల విషయంలో కోవిడ్‌కాలంలో అనుసరించిన విధానాలనే ఇప్పుడు పాటించండి. ఈ తరహా కేసులు, ముఖ్యంగా చిన్నారుల్లో కనిపిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో సమగ్ర వ్యాధి నిఘా వ్యవస్థల నేతృత్వంలో క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోండి. ఈ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయండి. అనుమానిత కేసుల శాంపిళ్లను వైరస్ రీసెర్చ్, డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీలకు పంపించండి. ఇలాంటి ముందస్తు, అప్రమత్త చర్యల ద్వారానే ఆరోగ్య అత్యయిక స్థితి దాపురించకుండా పౌరులను కాపాడగలం'' అని లేఖలో కార్యదర్శి పేర్కొన్నారు. ఉత్తర చైనాలో శ్వాస సంబంధ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో వెల్లడైంది. ఇన్‌ఫ్లూయెంజా, మైకోప్లాస్మా నిమోనియా, సార్స్-కోవ్-2 కేసుల ఉధృతి ఎక్కువగా ఉంది. చలికాలం కావడంతో చైనాలో సాధారణంగానే మైకోప్లాస్మా నిమోనియా కేసులు ఎక్కువగా వెలుగుచూస్తుంటాయి. ''కేసులపై అదనపు సమాచారం ఇవ్వాలని చైనా యంత్రాంగాన్ని డబ్ల్యూహెచ్‌ఓ కోరింది. అంతమాత్రాన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కాదు'' అని కార్యదర్శి స్పష్టంచేశారు.

పెద్దాయన పెద్ద పేగులో ఈగ



వాషింగ్టన్: మానవునిలో పెద్ద పేగు దాకా ఏదైనా ఆహారం వెళ్లిందంటే అప్పటికే అది జీర్ణమైందని అర్థం. అయితే అమెరికాలో ఓ పెద్దాయన పెద్దపేగులో ఒక ఈగ ఛిద్రమవకుండా చక్కగా ఉంది. జీర్ణావస్థలోకాకుండా పేగు గోడలకు అతుక్కుని ఉన్న ఈగను చూసి అక్కడి వైద్యులు అవాక్కయ్యారు. జీర్ణాశయం, చిన్నపేగును దాటి కూడా ఈ కీటకం ఎలా జీర్ణమవకుండా ఉందబ్బా? అని వైద్యులు పలు విశ్లేషణలు మొదలుపెట్టారు. అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఈ వింత ఘటన జరిగింది. 'ది అమెరికన్ జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటిరాలజీ'లో సంబంధిత వివరాలతో కథనం వెలువడింది. సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగా 63 ఏళ్ల పెద్దాయన ఆస్పత్రికి రాగా ఆయనకు వైద్యులు కొలొనోస్కోపీ చేశారు. అందులో ఈ విషయం వెల్లడైంది. '' కొలొనోస్కోపీకి ముందు ఘన పదార్థాలు ఏవీ నేను తీసుకోలేదు. రెండు రోజుల క్రితం మాత్రం పిజ్జా, తోటకూర తిన్నాను. అసలది ఎలా లోపలికెళ్లిందో నాకైతే తెలీదు'' అని ఆ పెద్దాయన తాపీగా చెప్పారు. '' తిన్న వాటిని జీర్ణరసాలు, పొట్టలోని ఆమ్లాలు జీర్ణం చేస్తాయి. అయినాసరే ఈగ అలాగే ఉందంటే ఆశ్చర్యమే. అయితే ఇది ఇంటెస్టినల్ మయాసిస్ అయి ఉండొచ్చు. ఈగ గుడ్లు లేదా లార్వా ఉన్న ఆహారం తిని ఉండొచ్చు. అవి లోపలికెళ్లి జీర్ణమయ్యాక కూడా జీర్ణవ్యవస్థలోని అసాధారణ వాతావరణాన్ని తట్టుకుని ఒకే ఒక్క లార్వా ఇలా ఈగగా రూపాంతరం చెంది ఉంటుంది'' అని మిస్సోరీ విశ్వవి ద్యాలయంలో గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగ సారథి మ్యాథ్యూ బెక్‌టోల్డ్ విశ్లేషించారు. 'ఇలాంటి సందర్భాల్లోనూ వ్యక్తికి విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి ఉంటాయి. అయినాసరే ఈయనకు అవేం లేవంటే నిజంగా ఇది వింతే'' అని ఆయన వ్యాఖ్యానించారు. చనిపోయిన ఆ ఈగను కొలొనోస్కోపీ ద్వారా ఎట్టకేలకు బయటకు తీశారు. ఇంత జరిగినా పెద్దాయన ఆరోగ్యంగా ఉండటం విశేషం.

వీసా లేకుండానే మలేసియాకు వెళ్లొచ్చు

న్యూఢిల్లీ: మలేసియా ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం కొత్త నిర్ణయం తీసుకున్నారు. భారత్, చైనా పర్యాటకులు, పెట్టుబడిదారులను వీసా లేకుండానే మలేసియాలోకి అనుమతిస్తామని అన్వర్ తాజాగా ప్రకటించారు. దీంతో దేశంలో పర్యాటకం పెరిగి ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని భావిస్తున్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఇలా వీసా లేకుండానే భారత్, చైనా పౌరులను దేశంలోకి అనుమతిస్తారు. ఇలా వచ్చిన వారు 30 రోజులపాటు వీసాలేకుండానే దేశవ్యాప్తంగా పర్యటించవచ్చు. ఆదివారం పుత్రజయ నగరంలోని తన పీపుల్స్ జస్టిస్ పార్టీ వార్షిక సమావేశంలో అన్వర్ ఈ ప్రకటన చేశారు. భారత్ నుంచి మలేసియాకు పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకే ఆ దేశ సర్కార్ తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

భారత్‌పై హేయమైన దాడి

15 ఏళ్ల నాటి ముంబై దాడులపై మోదీ
- ముష్కరుల దొంగ దెబ్బ నుంచి వేగంగా కోలుకున్నాం
- ఉగ్రవాదం అంతానికి అలుపెరుగని పోరు
- సంపన్న, సౌభాగ్య భారత్‌కు 'వోకల్ ఫర్ లోకల్'
- 'మన్ కీ బాత్'లో ప్రధాని



న్యూఢిల్లీ: సరిగ్గా 15 సంవత్సరాల క్రితం భారత్‌పై అత్యంత హేయమైన దాడి జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 2008 నవంబర్ 16న దేశ ఆర్థిక రాజధాని ముంబైలో జరిగిన ఉగ్రవాద దాడిని ఆయన గుర్తుచేశారు. భారత్ ఎదుర్కొన్నవాటిలో ఇది అత్యంత హేయమైన దాడి అని తెలిపారు. ముష్కర మూకల దొంగదెబ్బ నుంచి దేశం వేగంగా కోలుకోవడమే కాదు ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా తన శక్తియుక్తులతో అలుపెరుగని పోరాటం సాగిస్తోందని పేర్కొన్నారు. ఉగ్రవాద భూతంపై ఉక్కుపాదం మోపుతున్నామని వెల్లడించారు. ప్రధాని మోదీ ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. 26/11 దాడుల్లో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించారు. వారి ప్రాణత్యాగాలను స్మరించుకున్నారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

రాజ్యాంగానికి 106 సవరణలు

''నవంబర్ 26వ తేదీని ఎప్పటికీ మర్చిపోలేం. 15 ఏళ్ల క్రితం ఇదే రోజు ఉగ్రవాదులు ముంబై నగరాన్ని, మొత్తం దేశాన్ని వణికించారు. అత్యంత హేయంగా దాడికి పాల్పడ్డారు. అయినా మనం వెనక్కి తగ్గకుండా ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేస్తున్నాం. మరో కారణంతోనూ నవంబర్ 26వ తేదీకి చాలా ప్రాముఖ్య ఉంది. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ స్వీకరించింది. ప్రతి ఒక్కరూ వారి విధులకు ప్రాధాన్యం ఇస్తే, కలిసికట్టుగా పనిచేస్తే మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవచ్చు. 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల్లో రాజ్యాంగాన్ని రూపొందించారు. ముసాయిదాలోనే 2,000కు పైగా సవరణలు చేశారు. 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత ఇప్పటివరకు 106 సార్లు సవరణలు చేశారు. కాలానుగుణంగా పరిస్థితులు, అవసరాలను బట్టి అప్పటి ప్రభుత్వాలు ఈ సవరణలు చేశాయి. భావ ప్రకటనా స్వేచ్ఛకు అడ్డుకట్ట వేస్తూ రాజ్యాంగానికి మొదటి సవరణ జరగడం దురదృష్టకరం.

'వోకల్ ఫర్ లోకల్'కు ప్రజాదరణ

భారత రాజ్యాంగ సభకు నామినేట్ అయినవారిలో 15 మంది మహిళలు ఉన్నారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన అతికొద్ది దేశాల్లో భారత్ కూడా ఉండడం సంతోషకరం. రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టికి అనుగుణంగానే లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాం. ఈ బిల్లు ఆమోదం పొందడం నాకు చాలా సంతృప్తినిచ్చింది. 'వోకల్ ఫర్ లోకల్' నినాదానికి నానాటికీ ప్రజాదరణ పెరుగుతుండడం ఆనందంగా ఉంది. ఇటీవల పండగుల సమయంలో దేశంలో రూ.4 లక్షల కోట్ల విలువైన వ్యాపారం జరిగింది. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. అభివృద్ధి చెందిన, సౌభాగ్యవంతమైన భారత్‌కు 'వోకల్ ఫర్ లోకల్' ఒక నాంది. దీంతో మన ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. సమతుల అభివృద్ధి, ఉపాధికి హామీ లభిస్తుంది. ప్రజలకు సమాన అవకాశాలు దక్కుతాయి.

నెలపాటు పూర్తిగా డిజిటల్ చెల్లింపులే

దేశంలో నగదు లావాదేవీలు తగ్గుముఖం పడుతున్నాయి. యూపీఐ లేదా డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నాయి. ఒక నెలరోజులపాటు పూర్తిగా ఇలాంటి చెల్లింపులే చేయాలని ప్రజలను కోరుతున్నా. ఆ తర్వాత మీ అనుభవాలు, మీ ఫొటోలు నాతో పంచుకోండి. భారత్‌లో డిజిటల్ విప్లవం పూర్తిస్థాయిలో విజయవంతం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు'' అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

పెళ్లిళ్లకు విదేశాలకెందుకు?

సంపన్న కుటుంబాలు వివాహాల కోసం విదేశాలకు వెళ్తున్న పోకడను ప్రధాని మోదీ తప్పుబట్టారు. 'విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవడానికే కొన్ని కుటుంబాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ఇది అవసరమా? ఈ పోకడ నన్ను కలవరపెడుతోంది. స్వదేశంలోనే పెళ్లి చేసుకోవాలని కోరుతున్నా. తద్వారా మన డబ్బు సరిహద్దులు దాటకుండా ఉంటుంది'' అన్నారు. ''నూతన ఆవిష్కరణల దిశగా యువతను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇండియన్ పేటెంట్లు పదేళ్లలో పది రెట్లు పెరిగాయి. 2022లో పేటెంట్ దరఖాస్తులు 31 శాతం ఎగబాకాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా మారింది. టెక్నాలజీ, మొబైల్ సేవలు ప్రతి ఇంటికీ చేరాయి. వీటితో స్థానిక పండుగలు, ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే అవకాశం వచ్చింది'' అని చెప్పారు.

గ్రీస్ సమీపంలో సరకు నౌక మునక నలుగురు భారతీయులు గల్లంతు

ఏథెన్స్: గ్రీస్ పరిధిలోని లెస్బోస్ ద్వీపం సమీప మధ్యధరా సముద్ర జలాల్లో ఒక సరకు రవాణా నౌక మునిగిన ఘటనలో నలుగురు భారతీయుల ఆచూకీ గల్లంతైంది. సిబ్బందిలో ఒక్కరిని మాత్రమే కాపాడగలిగామని గ్రీస్ తీర గస్తీ దళాలు వెల్లడించాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో గాలింపు కష్టంగా మారింది. దాదాపు 6,000 టన్నుల ఉప్పుతో ఈజిప్టులోని అలెగ్జాండ్రియా నుంచి బయల్దేరిన నౌక తుర్కియేలోని ఇస్తాంబుల్‌కు వెళ్తోంది. మార్గమధ్యంలో గ్రీస్‌కు చెందిన లెస్బోస్ వద్ద మునిగిపోయింది. నౌకలోని 14 మంది సిబ్బందిలో నలుగురు భారతీయులు, ఎనిమిది మంది ఈజిప్ట్‌పౌరులు, ఇద్దరు సిరియన్లు ఉన్నారు. ఆదివారం ఉదయం ఏడింటపుడు మెకానికల్ సమస్య తలెత్తిందంటూ ఎమర్జెన్సీ సిగ్నల్ పంపిన నౌక తర్వాత కనిపించకుండా పోయింది. ఒక ఈజిప్ట్ పౌరుడిని మాత్రం రక్షించగలిగారు. ఎనిమిది వాణిజ్య నౌకలు, రెండు హెలికాప్టర్లు, ఒక గ్రీస్ నావికా యుద్ధ నౌక గాలింపు చర్యల్లో పాల్గొన్నాయి. ఘటన జరిగిన చోట్ల గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి.

మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ.. 2040 కల్లా 40 బిలియన్ డాలర్లకు

కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

తిరువనంతపురం: భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 2040 నాటికి 40 బిలియన్ డాలర్ల(రూ.3.30 లక్షల కోట్ల)కు చేరుకోనుందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఏకేడీ వంటి కొన్ని విదేశీ సంస్థలైతే భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ 2040 నాటికి ఏకంగా 100 బిలియన్ డాలర్లకు కూడా చేరుకోవచ్చని అంచనా వేసినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం మన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ కేవలం 8 మిలియన్ డాలర్లు మాత్రమే. ఇది ఇప్పుడు శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఒక్క విదేశీ ఉపగ్రహాల ప్రయోగం విభాగంలో యూరప్ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా 240 మిలియన్ యూరోలు, అమెరికా ఉపగ్రహాల ప్రయోగం ద్వారా మరో 180 మిలియన్ డాలర్ల వరకు ఆర్జించగలిగామని శనివారం ఆయన పీటీఐకి చెప్పారు. నేషనల్ రీసెర్చి ఫౌండేషన్, అనుసంధాన్‌ను నెలకొల్పాక అంతరిక్ష పరిశ్రమల ఏర్పాటు వేగంపుంజుకుందని తెలిపారు.

మళ్లీ ఆందోళన బాటలో అన్నదాతలు

చండీగఢ్: పంజాబ్, హరియాణా రైతులు మరోసారి ఆందోళన బాట పట్టారు. పెండింగ్ డిమాండ్ల పరిష్కారానికి మూడు రోజులపాటు నిరసనలు తెలపాలన్న సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) పిలుపు మేరకు ఆదివారం పంజాబ్, హరియాణా రైతులు ట్రాక్టర్ ట్రాలీల్లో వందలాదిగా చండీగఢ్‌కు చేరుకోవడం ప్రారంభమైంది. దీంతో, రైతులను అడ్డుకునేందుకు చండీగఢ్, పంజాబ్, హరియాణా పోలీసులు అంతర్రాష్ట్ర సరిహద్దులను మూసివేశారు. రైతులు ముందుగా మొహాలిలోని అంబ్ సాహిబ్ గురుద్వారాకు చేరుకుని, అక్కడి నుంచి సోమవారం చండీగఢ్ దిశగా తరలివెళ్తారని భావిస్తున్నారు. ఇలా ఉండగా, పంజాబ్ హరియాణా హైకోర్టు ఆదేశాల ప్రకారం..రైతులు రోడ్లపై బైఠాయించడం ధిక్కరణ కిందికి వస్తుందని పంచ్‌కుల పోలీస్ కమిషనర్ తెలిపారు. రైతుల ప్రవేశాన్ని నిరోధించేందుకు చండీగఢ్ యంత్రాంగం మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసింది. చండీగఢ్-పంచ్‌కుల మార్గాన్ని మూసేసింది.

గాజాలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

జెరూసలేం: గాజా స్ట్రిప్‌పై పట్టుబిగించేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోందన్న వాదనకు బలం చేకూరుస్తూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం అక్కడ అడుగుపెట్టారు. యుద్ధంలో మునిగి తేలుతున్న తమ సైనికుల్లో నైతిక స్థైర్యం పెంచేందుకే వచ్చానని చెప్పారు. ఇజ్రాయెల్ బయట పెట్టిన హమాస్ సొరంగం వద్ద తమ కమాండర్లు, సైనికులతో మాట్లాడారు. ''మనవి మూడే లక్ష్యాలు. హమాస్ అంతం. బందీలందరినీ క్షేమంగా విడిపించడం. భవిష్యత్తులో మరెన్నడూ ఇజ్రాయెల్‌కు ముప్పుగా మారకుండా గాజాను 'సరిచేయడం'' అని అన్నారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఉత్తర గాజాలో పర్యటించారు.

మరో 17 మంది బందీల విడుదల

- 14 మంది ఇజ్రాయెలీలు, ముగ్గురు విదేశీయులకు విముక్తి
- 39 మంది పాలస్తీనియన్ ఖైదీలను వదిలిపెట్టిన ఇజ్రాయెల్

గాజాస్ట్రిప్: ఇజ్రాయెల్-హమాస్ గ్రూప్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు విషయంలో సందిగ్ధత వీడింది. ఒప్పందానికి ఇరుపక్షాలు కట్టుబడి ఉంటున్నాయి. మూడో విడత కింద ఆదివారం మరో 17 మంది బందీలకు హమాస్ విముక్తి కలిగించింది. వీరిలో 14 మంది ఇజ్రాయెలీలు, ముగ్గురు విదేశీయులు ఉన్నారు. అలాగే 39 మంది పాలస్తీనియన్ ఖైదీలను ఇజ్రాయెల్ అధికారులు విడుదల చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ హమాస్ మిలిటెంట్లు శనివారం బందీలను విడుదల చేయడానికి నిరాకరించారు. ఒప్పందం అమలుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, ఒప్పందం యథాతథంగా అమలవుతున్నట్లు కొన్ని గంటల తర్వాత తేటతెల్లమయ్యింది. శనివారం బందీల్లోని 13 మంది ఇజ్రాయెలీలను, నలుగురు థాయ్‌లాండ్ జాతీయులను హమాస్ విడుదల చేసింది. వీరిలో నాలుగేళ్ల అమెరికన్-ఇజ్రాయెలీ చిన్నారి అబిగైల్ ఎడాన్ కూడా ఉంది. ఆమె తల్లిదండ్రులను అక్టోబర్ 7న మిలిటెంట్లు హత్య చేశారు. అమెరికా బందీలంతా సైతం అతిత్వరలో విడుదలవుతారని ఆశిస్తున్నామని శ్వేతసౌధం జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవన్ చెప్పారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై అనూహ్యంగా దాడి చేసిన హమాస్ మిలిటెంట్లు 240 మందిని బందీలుగా మార్చి, గాజాకు తరలించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్-హమాస్ మధ్య నాలుగు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఇప్పటిదాకా మూడు విడతల్లో మొత్తం 58 మంది బందీలకు హమాస్ స్వేచ్ఛ కల్పించింది. నాలుగో విడత కింద సోమవారం మరికొంత మంది విడుదల కానున్నారు. మరోవైపు శనివారం రాత్రి ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో ఇజ్రాయెల్ దాడుల్లో ఆరుగురు పాలస్తీనియన్లు మరణించారు.

హమాస్ సీనియర్ కమాండర్ హతం

ఇజ్రాయెల్ దాడిలో హమాస్ సీనియర్ కమాండర్ అహ్మద్ అల్-ఘందౌర్(56) మృతి చెందాడు. ఈ విషయాన్ని హమాస్ ఆదివారం స్వయంగా ప్రకటించింది. అయితే, ఈ దాడి ఎప్పుడు, ఎక్కడ జరిగిందన్న సంగతి బయటపెట్టలేదు. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా మరణించిన హమాస్ కమాండర్లలో అహ్మద్ అల్-ఘందౌర్ అత్యంత పెద్ద హోదా ఉన్న నేత కావడం గమనార్హం. ఉత్తర గాజాలో హమాస్ గ్రూప్‌నకు నాయకత్వం వహిస్తున్నాడు. హమాస్ సాయుధ విభాగంలో హై-ర్యాంకింగ్ కలిగి ఉన్నాడు. 2002నుంచి ఇజ్రాయెల్ సైన్యం సాగించిన హత్యాయత్నాల నుంచి మూడుసార్లు తప్పించుకున్నాడు.


చెర నుంచి విడుదలైన ఎడాన్

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

సోమవారం । 27 । నవంబర్ । 2023



కష్టే ఫలి

ఆదివారం బెళగావి సమీపంలో వరి పంట నూర్పిడిలో రైతు కుటుంబం. ఈసారి కరువు తాండవించినా బోర్ల కింద వరి సాగు కొంత ఫలమిచ్చింది

న్యూస్‌రీల్

స్కూటర్ ప్రమాదంలో యువతి మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

యశవంతపుర: స్కూటర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో యువతి మృతి చెందిన ఘటన భట్కళ తాలూకా వెంకటాపుర నీరకంత రోడ్డుకు దగ్గర జాతీయ రహదారిపై జరిగింది. కార్గల్‌కు చెందిన లిఖితా మాబ్లేశ్వర గోండ (23), గణేశ్ గోండ ఆదివారం ఉదయం భట్కళ నుంచి శిరాలి వైపు స్కూటర్‌పై వెళుతుండగా జారి పడిపోయారు. ఈ సమయంలో వెనుకనే వస్తున్న లారీ వారి మీద నుంచి వెళ్లిపోయింది. లిఖిత అక్కడికక్కడే మరణించగా, గణేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని మంగళూరు ఆస్పత్రికి తరలించారు. భట్కళ గ్రామీణ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

కత్తి పిడుల్లో బంగారం



కత్తుల ఎక్స్‌రే చిత్రం

దొడ్డబళ్లాపురం: బంగారం స్మగ్లర్లు విదేశాల నుంచి పసిడిని తీసుకురావడానికి నానా రకాల ఉపాయాలు వేస్తుంటారు. కత్తుల పిడిలో దాచి అక్రమంగా తరలిస్తున్న 298 గ్రాముల బంగారాన్ని బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో అధికారులు సీజ్ చేశారు. దుబాయ్ నుంచి వచ్చిన ఒక విమానంలో ప్రయాణికున్ని తనిఖీ చేసే సమయంలో బంగారం పట్టుబడింది. కాగితం పై పేస్ట్ రూపంలో, అలాగే కత్తుల పిడిలో బంగారం దాచినట్లు ఎక్స్ రే యంత్రాలు గుర్తించాయి. ఆ ప్రయాణికున్ని అరెస్టు చేశారు.

సమయం వచ్చినప్పుడు విదేశీ టూర్: మంత్రి

యశవంతపుర: సమయం వచ్చినప్పుడు మాజీలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు కలిసి విదేశాలకు వెళ్తామని ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళి తెలిపారు. ఆయన బెళగావిలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన, పట్టుశాఖలను గ్యారంటీ యోజనలో చేర్చే అవకాశం ఉందా అని విలేకరులు ప్రశ్నించగా, కొన్నిశాఖలు ప్రత్యేకంగా పని చేయడం లేదని, ఈ మూడుశాఖలను విలీనం చేయాలని 10 ఏళ్ల క్రితం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కులగణనపై కాంతరాజు నివేదిక ఇంకా తమ ప్రభుత్వానికి అందలేదన్నారు. ఎమ్మెల్యేలతో కలిసి విదేశాలకు టూర్ ఎప్పుడు అని అడగ్గా, పై సమాధానం ఇచ్చారు.

లోక కళ్యాణమే లక్ష్యం కావాలి

బనశంకరి: పేజావర విశ్వప్రసన్నతీర్థస్వామీజీ 300 మందికి పైగా శిష్యులు, భక్తులతో ఉడుపి శ్రీకృష్ణమఠం నుంచి నీలావర గోశాలకు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ నిత్య జీవితంలో కోరికలు నెరవేర్చుకోవడానికి పరితపిస్తాం, ఇది తాపం, అదే అడవిలో రుషులు, మునులు లోక కళ్యాణార్థం జీవితాన్ని త్యాగం చేస్తారని, అదే తపస్సు అని వివరించారు. జీవితం తపస్సు కావాలని, సొంత హితం కోసం ఆరాటపడరాదని అన్నారు. పరుల హితం గురించి ఆలోచించి పనిచేయాలన్నారు.

గ్రిల్‌లో చిక్కిన సర్పం



పామును బయటకు తీస్తున్న దృశ్యం

తుమకూరు: నగరంలోని సరస్వతిపురంలో ఉన్న రాజశేఖర అనే వ్యక్తి ఇంటిలోకి ప్రమాదకరమైన రక్తపింజర పాము చొరబడడానికి ప్రయత్నించింది. గోడ ఎక్కి గ్రిల్ ద్వారా లోనికి వెళ్లబోతూ కడ్డీలలో చిక్కుకుంది. పామును చూసిన ఇంటివారు పాములు పట్టే మను అగ్నివంశి, తేజస్ కుమార్‌లకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సుమారు అర్ధగంట పాటు శ్రమించి దానిని బయటకు తీసి దూరంగా వదిలిపెట్టారు.

దిగంబర స్వామికి ఆడంబర అభిషేకం



విగ్రహానికి జైన మునుల పూజలు



మండ్య జిల్లా కేఆర్‌ఎస్ డ్యాం వెనుక.. బాహుబలి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం

- మండ్య, మైసూరు జిల్లాల్లో బాహుబలికి మహా మస్తకాభిషేకాలు

మండ్య: పవిత్ర కార్తీక మాసం నేపథ్యంలో రాష్ట్రంలో బాహుబలి దేవస్థానాల్లో విశేష పూజలు, మస్తకాభిషేకాలు భక్తులను పులకింపజేశాయి. చివరకు మిగిలేది ఏమీ లేదని ఇహలోక సుఖాలపై వైరాగ్యాన్ని బోధించిన బాహుబలి విగ్రహాలకు వైభవంగా అభిషేకాలు నిర్వహించారు.

కేఆర్‌ఎస్ గోమతస్వామికి..

మండ్య జిల్లాలోని కేఆర్ పేటె తాలూకాలో కృష్ణరాజసాగర డ్యాం వెనుక ఉన్న బసది హోసకోటె గ్రామంలో 18 అడుగుల ఎత్తైన భగవాన్ బాహుబలి మూల విగ్రహ పునఃప్రతిష్టాపన వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఆదివారం జలాభిషేకం, మస్తకాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. వివిధ జైన మునుల ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు, జైన మతస్తులు 1008 కలశాలలో సుగంధ ద్రవ్యాలతో బాహుబలి విగ్రహాన్ని అభిషేకించారు. జైన ముని అమోఘకీర్తి మాట్లాడుతూ దక్షిణ భారతంలో మొదట చావుండరాయన కృషితో శ్రావణ బెళగొళ గోమతేశ్వరున్ని ప్రతిష్ఠించారని తెలిపారు. కావేరి నది ఒడ్డున ఏర్పాటు చేసిన ఈ విగ్రహం మూడవది అని చెప్పారు. మంత్రి చెలువరాయస్వామి, ఎమ్మెల్యే హెచ్.టి.మంజు పాల్గొన్నారు.

బెట్టదూరు గోమఠగిరిలో ఉత్సవాలు

ఇక మైసూరు జిల్లా హుణసూరు తాలూకాలో బెట్టదూరు దగ్గరి గోమఠగిరిలో వెలసిన బాహుబలి బృహత్ విగ్రహానికి ఆదివారం మహా మస్తకాభిషేకం ఉత్సవాలు మొదలయ్యాయి. జైన స్వాములు, భక్తులు దిగంబరుని విగ్రహానికి పసుపు, కుంకుమ, నెయ్యి, టెంకాయ నీళ్లు, పవిత్ర జలాలతో మంగళ స్నానం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు గోమఠగిరిని అధిరోహించి వేడుకలలో పాల్గొన్నారు.



మైసూరు జిల్లా బెట్టదూరు దగ్గర గోమఠగిరిలో మహా మస్తకాభిషేకం



గంధం, పసుపు ద్రవ్యాలతో..



గోమఠగిరికి వస్తున్న భక్తులు



కుంకుమ జలాలతో అభిషేకిస్తున్న భక్తులు

దోపిడీ దొంగల దాడి

- డబ్బు, నగలతో పరారీ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

చింతామణి: తోటలో ఉన్న ఇంట్లోకి దోపిడీ దొంగలు చొరబడి ఇంటి యజమానిని కత్తులతో బెదిరించి, తాళ్లతో కట్టివేసి బీరువాలోని రూ. 60 వేల నగదు, 60 గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. చింతామణి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొంగతిమ్మనహళ్లి గ్రామ శివార్లలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. రైతు నారాయణస్వామి, భార్య కూతురితో కలిసి ఇక్కడ నివసిస్తున్నారు. నలుగురు దొంగలు మంకీ క్యాప్‌లు ధరించి ఇంట్లోకి చొరబడి దోచుకున్నారు. ఆదివారం ఉదయం డీఎస్పీ మురళీధర్, పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. దొంగల దాడి పరిసర ప్రాంతాల్లో కలకలం రేపింది.

అధికారమే కాంగ్రెస్ లక్ష్యం: విజయేంద్ర

శివాజీనగర: నెహ్రూ కుటుంబంలోని ఆఖరి వ్యక్తికి కూడా అధికారం ఇవ్వడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర విమర్శించారు. ఆదివారం మల్లేశ్వరంలోని బీజేపీ ఆఫీసులో రాజ్యాంగ సమర్పణ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ పేరు చెప్పుకునే నైతిక హక్కు కాంగ్రెస్‌కు ఉందా అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత దేశంలో ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. సీనియర్ నేత గోవింద కారజోళ మాట్లాడుతూ బియ్యం ఇస్తాను, కోడి, గొర్రె ఇస్తానని సీఎం సిద్దరామయ్య అంటున్నారు. దళితులకు ఇవి కాదు, చదువును ఇవ్వండి అని అన్నారు. డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్‌పై సీబీఐ విచారణ అనుమతిని కేబినెట్ ఉపసంహరించడం తగదని మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డే కాగేరి అన్నారు. అవినీతి కేసుల నుంచి బయట పడేందుకు డీకేశి కేబినేట్‌ను వాడుకున్నారని విమర్శించారు.



ఆదివారం రాత్రి ఉడుపిలో శ్రీకృష్ణ మందిరం ముందు సప్తోత్సవం దృశ్యం. ఈ సందర్భంగా మూడు తేర్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు

ఎట్టకేలకు చిక్కిన చిరుత

మైసూరు: మైసూరు జిల్లాలోని వరుణ దగ్గర మోసంబాయకనహళ్లి గ్రామ ప్రజలను హడలెత్తిస్తున్న చిరుతపులి బోనులోకి చిక్కడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని రోజుల నుంచి గ్రామంలోకి వచ్చి మేకలు, వీధికుక్కలను ఎత్తుకొని వెళ్తోంది. దాంతో గ్రామస్తులు రాత్రివేళ బయటకు రావాలంటే భయపడేవారు. అటవీ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో పలుచోట్ల బోనులు పెట్టారు. శనివారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత మంజునాథ్ అనే రైతు పొలంలోని బోనులోకి పడింది. అటవీ అధికారులు దానిని తరలించారు.

మైసూరు తాలూకాలో జంట పులుల కలకలం



మైసూరు: మైసూరు తాలూకాలోని బ్యాతళ్ళి కడకోళ చుట్టుపక్కల ఉన్న రైతుల పంట పొలాల వద్ద రెండు పెద్ద పులులు తిరుగుతున్నాయి. పొలాలకు వెళ్లిన రైతులు రెండు పులులు జోడీగా రావడం గ్రామంలోకి పరుగులు పెట్టారు. అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. తాము తీసిన పులుల వీడియోలను షేర్ చేయడంతో వైరల్ అయ్యాయి. నంజనగూడు తాలూకాలోని బళ్లారుహుండిలో పులి దాడిచేసి రత్నమ్మ అనే మహిళను పొట్టనబెట్టుకుంది. అక్కడి నుంచే ఒక పులి వచ్చి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. 200 మంది సిబ్బంది, 2 ఏనుగులు, డ్రోన్ కెమెరాలతో గాలింపు మొదలైంది.

మనది శ్రేష్ట రాజ్యాంగం: సీఎం

శివాజీనగర: ప్రతి ఒక్కరికీ హక్కుల రక్షణ అనేది మన రాజ్యాంగ ఆశయం. భారత రాజ్యాంగం అత్యంత శ్రేష్ఠమైనది అని సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా విధానసౌధ ముందు భాగంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సీఎం మాట్లాడుతూ రాజ్యాంగం ఎంత గొప్పదైనా, సరైనవారి చేతుల్లో ఉండకపోతే సార్థకం కాదని అంబేడ్కర్ చెప్పేవారన్నారు. ఉత్తమ రాజ్యాంగం అమలుకు కారణమైన డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్‌తో పాటుగా రాజ్యాంగ కమిటీ సభ్యులను జ్ఞాపకం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ ఆశయాల ప్రకారం కొనసాగుతోంది. జాతీయ కవి కువెంపు చెప్పినట్లుగా సర్వప్రజల శాంతి తోటగా సమాజం ఉండాలన్నారు. దానిని సాకారం చేసే దిశలో ఈ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.



భ్రూణహత్యలపై కఠినచర్యలు

మండ్య, మైసూరులలో విచ్చలవిడిగా భ్రూణ హత్యలు జరుగుతున్నాయని, దీనికి పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ఈ విషయమై త్వరలో సమావేశం జరిపి చర్చిస్తామన్నారు.

మిరపకాయలు తినిపించి, చితకబాది..

- మిర్చి దొంగలపై గ్రామస్తుల కన్నెర్ర

యశవంతపుర: పొలంలో మిరపకాయల పంటను చోరీ చేశారని దొంగలపై గ్రామస్తులు ప్రతాపం చూపించారు. వారితో బలవంతంగా మిరపకాయలు తినిపించి తీవ్రంగా కొట్టిన ఘటన గదగ జిల్లాలో జరిగింది. లక్ష్మేశ్వర తాలూకా యత్తినహళ్లి గ్రామంలో శివణ్ణ అంగడి, మంజునాథ గౌడ అనే రైతులు మిరప పంట వేశారు. ఇద్దరు వ్యక్తులు పొలాల్లోకి చొరబడి మిరపకాయలను తస్కరించారు. ఇది తెలిసి గ్రామస్తులు వారిని వెంటాడి పట్టుకుని మిరపకాయల మూటలను వారి తలపై పెట్టి గ్రామంలో ఊరేగించారు. మిర్చిని వారి చేత తినిపించి చితకబాదారు. నిందితులు బాధ భరించలేక హాహాకారాలు చేస్తున్నా గ్రామస్తులు కనికరించలేదు. ఈ సంఘటన వీడియోలు వైరల్ అయ్యాయి.

వక్క దొంగల దౌర్జన్యం

దక్షిణకన్నడ జిల్లా కడబ తాలూకా సవణూరు గ్రామం పణెమజలులో ఒక ఫాంహౌస్‌లో వక్క పంటను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున నిష్కల్‌రామ అనే యువకుడు మైసూరు నుంచి బైక్‌పై సవణూరు గ్రామం పణెమజలు ఫామ్స్‌లోని ఇంటికి వెళ్తున్నాడు. కొందరు దొంగలు అక్కడికి సమీపంలో తోటలో వక్కలను దొంగిలించి కారులోకి బస్తాలను ఎత్తుతున్నారు. నిష్కల్‌రామ ఎవరని ప్రశ్నించగా దుండగులు పెద్ద కత్తితో దాడి చేసి పారిపోయారు. అతడు గట్టిగా కేకలు వేయగా స్థానికులు పరుగులు తీసి బషీర్ అనే ఒక దొంగను పట్టుకొని బెళ్లారె పోలీసులకు అప్పగించారు.



మిరప పంట చోరీ నిందితులు



ఆదివారం ధార్వాడలోని గురుద్వారాలో గురునానక్ జయంతి వేడుక ప్రార్థనలు

దంపతులు, ముగ్గురు పిల్లలు.. కుటుంబం ఆత్మహత్య



ఘోరం జరిగిన ఇంటి ముందు గుమిగూడిన జనం

- తుమకూరులో ఘోరం
- సెల్ఫీ వీడియో, డెత్‌నోట్ లభ్యం

తుమకూరు: అప్పుల బాధలు, అలాగే ఇరుగు పొరుగు వేధింపులు పడలేక ఆవేదనకు గురై భార్యాభర్తలు, ముగ్గురు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న హృదయవిదారక సంఘటన తుమకూరు సిటీలోని సదాశివనగరలో చోటుచేసుకుంది. అక్కడ నివాసముంటున్న గరీబ్ సాబ్ (32), భార్య సుమయ్యా (30), వారి పిల్లలు హాజీరా, మహ్మద్ సుభాన్, మహ్మద్ మునీర్ మృతులు. పిల్లల వయసు 7 నుంచి 10 ఏళ్లలోపు ఉంటుంది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఈ ఘటన వెలుగుచూసింది.

కింది అంతస్తులోని వ్యక్తి కారణం

శిర తాలూకా చిక్కనహళ్లి నివాసి అయిన గరీబ్‌సాబ్ పిల్లల చదువుల కోసం ఇక్కడకు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. చికెన్ కబాబ్ షాపు ద్వారా జీవనం సాగించేవాడు. అయితే కింది అంతస్తులో అద్దెకు ఉంటున్న ఒక వ్యక్తి తనను మానసికంగా హింసిస్తున్నాడని, తమ చావులకు అతడే కారణం అంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మా ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇరుగు పొరుగు వారు తనను దుర్భాషలాడేవారని వీడియోలో గోడు వెళ్లబోసుకున్నాడు. ఒక డెత్ నోట్ కూడా రాశాడని పోలీసులు తెలిపారు.

పిల్లలకు పురుగుల మందు తాగించి..

సాయంత్రం సమయంలో పిల్లలకు పురుగుల మందు తాగించారు, ఆపై దంపతులు ఉరివేసుకున్నారు. రాత్రికి ఈ విషయం గుప్పుమంది. వెంటనే ఎస్పీ కేవీ అశోక్, తిలక్‌పార్క్ పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను అంబులెన్సులో జిల్లాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో స్థానికులు గుమిగూడడంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది.



చిన్నపిల్లల మృతదేహాలు



ఉరికి వేలాడిన భార్యాభర్తలు



క్యాట్ వాక్ చేస్తున్న మోడల్స్



వేదికపై మోడల్ భామలు

ఫ్యాషన్ సొగసులు

బనశంకరి: ఐటీ నగరంలో ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఓ ప్రముఖ మాల్‌లో జరిగిన ప్రదర్శనలో నటులు రాగిణి ద్వివేది, ప్రజ్వల్ దేవరాజ్, అలాగే దేశ విదేశీ అందగత్తెలు పాల్గొని నలుపు రంగు దుస్తుల్లో హొయలొలికించారు. దుస్తులను కొనుగోలు చేయడం ఒక పండుగ లాంటిదని నటి రాగిణి అన్నారు.

క్లుప్తంగా

ఆరోపణల్ని పట్టించుకోరాదు



కార్యక్రమం ప్రారంభిస్తున్న మంత్రి

మండ్య: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయి, వాటిని ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి అన్నారు. ఆదివారం మండ్యలో కనక భవనంలో జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మాన వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. దానిని చూసి తట్టుకోలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు.

నీరు, ఆహారం కొరత లేకుండా చూడండి

మైసూరు: వేసవిలో మూగజీవాలకు నీరు, ఆహారం కొరత లేకుండా ఇప్పటినుంచే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి హెచ్.సి.మహదేవప్ప సూచించారు. కరువు నివారణ చర్యలపై సమీక్షించేందుకు మైసూరులోని జలదర్శిని అతిథి గృహంలో ఆదివారం ఆయన పలు శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ఇప్పటి నుంచే గుర్తించాలన్నారు. ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తరాదన్నారు. పాలికె కమిషనర్ ఆసాద్ ఉర్ రెహమన్ షరీఫ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీబీఐకి పట్టుబడిన యునాని పాలనాధికారి

బనశంకరి: పెండింగ్ బిల్లుల మంజూరుకు లంచం తీసుకుంటూ బెంగళూరు యునాని ఔషధాల జాతీయ సంస్థ పాలనాధికారి నదీమ్ ఏ సిద్దికి సీబీఐకి పట్టుబడ్డాడు. వివరాలు..యునాని ఆసుపత్రిలో చికిత్స పొందే రోగులకు ఆహారం అందించేందుకు ఓ వ్యక్తి ఒప్పందం చేసుకున్నాడు. వీటి బిల్లులను యునాని మెడిసిన్ సంస్థ అందిస్తుంది. ఆహార సరఫరాదారుడి కాంట్రాక్టు రెండు నెలల క్రితం ముగిసింది. అయితే రూ.3 లక్షల బిల్లులు పెండింగ్ ఉండిపోయాయి. ఆ బిల్లులు చెల్లించాలని ఒప్పందారుడు యునాని పాలనాధికారి నదీమ్ ఏ.సిద్దికిని ఆశ్రయించగా రూ.1.10 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో ఒప్పంద దారుడు సీబీఐకి ఫిర్యాదు చేశాడు. పథకం ప్రకారం ఆదివారం రూ.50వేల నగదు అందజేస్తుండగా సీబీఐ అధికారులు దాడి చేశారు. నదీమ్ ఏ.సిద్దికిని అదుపులోకి తీసుకొని అతని వద్దనుంచి. రూ.2 లక్షలు స్వాధీనం చేసుకుని సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపరచగా కస్టడీకి ఆదేశించారు.

333 చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

- రూ.4,09,46,441 విలువైన సొత్తు సొంతదారులకు అప్పగింత



సొత్తును పరిశీలిస్తున్న మంత్రి పరమేశ్వర్

తుమకూరు: దొంగల జోరుకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన 333 చోరీలను ఛేదించారు. రెండు దోపిడీ కేసులు, 21 మోసం కేసులు, 19 చైన్ స్నాచింగ్, ఇళ్లలో జరిగిన 93 చోరీలు, ఇతర 195 కేసులకు సంబంధించి రూ. 4,09,46,441 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తును నగరంలోని చిలుమె పోలీసు సముదాయ భవనంలో ఆదివారం రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ పరిశీలించారు. అనంతరం బాధితులకు చోరీ సొత్తును అందజేశారు. కేసులు ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. జిల్లా ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జ్ఞానాభివృద్ధితో వృత్తిలో రాణింపు



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఆర్.బన్నూర్ మఠ్ తదితరులు

బొమ్మనహళ్లి : ఎంచుకున్న వృత్తిలో రాణించేందుకు జ్ఞానాన్ని పెంచుకోవాలని రాష్ట్ర న్యాయ కమిషన్ అధ్యక్షుడు ఎస్ఆర్.బన్నూర్ మఠ్ పిలుపునిచ్చారు. నగరంలోని ది ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన 2వ జాతీయ అణుక న్యాయాల-2023 పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. న్యాయవాద కోర్సు చదివే విద్యార్థులు కోర్టులకు వెళ్లి కేసుల పరిష్కారంలో జరుగుతున్న వాదనలను ఆలకించాలన్నారు. మున్ముందు ఇవి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎన్.వి.ఎల్. నరసింహరాజు, (రమేష్‌రాజు) కేఎఎల్‌పీఎఆర్ పరిశోధన డైరెక్టర్ డాక్టర్. చిదానందరెడ్డి, ఎస్. పాటిల్, ప్రిన్సిపాల్ ప్రజ్ఞా పాటిల్, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్. బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం



చెత్తకుండీలలో పేరుకు పోయిన చెత్త



అదృశ్యమైన డస్ట్‌బిన్‌లు



విరిగిపడిన డస్ట్‌బిన్లు

- తరలింపు పట్టని కోలారు నగరసభ
- డస్ట్‌బిన్లు దొంగలమయం

కోలారు: కోలారు నగరంలో చెత్త సేకరణ, నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసిన చెత్త చెదారం పేరుకుపోయింది. 35 వార్డుల్లో రూ. 13 లక్షలతో స్టీల్ చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. కూడళ్లలో ఆకట్టుకునే విధంగా వీటిని ఉంచారు. అయితే నిర్వహణ లోపం కారణంగా అవి నిరుపయోగంగా మారాయి. ప్రభాత్ టాకీస్‌తో పాటు పలు ప్రాంతాలలో స్టీల్ చెత్తకుండీలు విరిగిపోయి నిరుపయోగంగా మారాయి.

పేరుగొప్ప, ఊరుదిబ్బ

నగరంలో పేరుకు తగ్గట్టుగా కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్టుబిన్లు ఎంతో ఆకర్షనీయంగా ఉన్నాయి. నిర్వహణ లేకపోవవడంతో అక్కడ చెత్త పేరుకుపోతోంది. మరోవైపు పీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ముందు ఏర్పాటు చేసిన స్టీల్ చెత్తకుండీలు ఏకంగా అదృశ్యమయ్యాయి. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో చెత్త నిర్వహణ అధ్వానంగా మారడంతో వీటిపై అధికారులను నిలదీస్తే పౌర కార్మికుల సమస్య ఉందని సాకులు చూపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా నగరసభ అధికారులు చెత్త నిర్వహణ, సేకరణపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

డీకేశి చేతిలో ప్రభుత్వం కీలుబొమ్మ

- మాజీ మంత్రి శ్రీరాములు



కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

కోలారు: ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ చేతిలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలుబొమ్మగా మారిపోయిందని మాజీ మంత్రి శ్రీరాములు ఆరోపించారు. ఆదివారం తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను ముళబాగిలు తాలూకా కురుడుమలై వినాయక దేవాలయంలో పూజలు నిర్వహించడానికి వచ్చిన సమయంలో విలేకరులతో మాట్లాడారు. డికె శివకుమార్‌పై జరుగుతున్న సీబీఐ విచారణను రాష్ట్ర క్యాబినెట్ ఉపసంహరించుకోవడం చట్టానికి తూట్లు పొడిచినట్లేనన్నారు. కాంగ్రెస్‌కు చట్టాలపై విశ్వాసం లేదన్నారు. తన 30 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఇలాంటి కేసును ఇంతవరకు చూడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందనే దానికి ఇదే ఒక చక్కటి నిదర్శనమన్నారు. మూర్ఖ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. ఆరు నెలలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదు. ఆరు నెలల్లోనే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ గ్యారెంటీ హామీలు కనీసం 25 శాతం మందికి కూడా అందడం లేదని ఆరోపించారు. సోమణ్ణ, యత్నాళ్ ఎవరూ బీజేపీని వదలి వెళ్లరని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. పార్టీ నూతన అధ్యక్షుడు బి వై విజయేంద్ర నేతృత్వంలో పార్టీని నడిపించడానికి సహకరిస్తామన్నారు. గాలి జనార్ధనరెడ్డి బీజేపీలోకి వస్తే తాము స్వాగతిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, నరసింహరాజు, విజయకుమార్, కెంబోడి నారాయణ స్వామి, తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యాజ్ఞవల్క్య జయంతి



మాలూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు/మాలూరు: కోలారు, మాలూరు పట్టణాలలో ఆదివారం శ్రీ యాజ్ఞవల్క్య సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా యాజ్ఞవల్క్య జయంతిని నిర్వహించారు. కోలారులోని గాయత్రీ ప్రార్థనా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో యాజ్ఞవల్క్య బ్రాహ్మణ సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన యాజ్ఞవల్క్య బ్రాహ్మణ ప్రముఖుడు అశ్వత్థ యాజ్ఞవల్క్య మహర్షి గురించి వివరించారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన సముదాయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో యాజ్ఞవల్క్య సేవా ట్రస్టు అధ్యక్షుడు అశ్వర్థనారాయణ, ట్రస్టీలు జె జనార్ధనరావు, ఎస్ రవీంద్ర, కె సత్యానారాయణ, కె రవికుమార్, కె రామమూర్తి, బి ఎస్ మంజునాథ్, కె ఎస్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాలూరులో:

మాలూరు పట్టణంలో యాజ్ఞవల్క్య సేవా సమితి ఆధ్వర్యంలో జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద బ్రహ్మశ్రీ కిరణ్ భరద్వాజ్ నేతృత్వంలో వివిధ ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాజ్ఞవల్క్య మహర్షి భావచిత్రాన్ని పల్లకీలో ఉంచి పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జయరావ్, విఠల్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో వ్యక్తి హత్య

శ్రీనివాసపురం: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిని కొడవలితో నరికి చంపిన ఘటన శనివారం రాత్రి ముళబాగిలు తాలూకా మిణజేనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. హతుడిని సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ (48)గా గుర్తించారు. మంజునాథ్ బంగారుపేట తాలూకా మాదముత్తన హళ్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తితో తరచుగా గొడవ పడుతుండేవాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. మంజునాథ్ రెండవ భార్య వివాహేతర సంబంధమే హత్యకు కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంజునాథ్ తన మొదటి భార్యతో దూరంగా ఉండి రెండవ భార్య నేత్రతో కలిసి ఉంటున్నాడు. నేత్ర, ఆమె ప్రియుడు కలిసి తన భర్త మంజునాథ్‌ను హత్య చేశారని మొదటి భార్య సౌభాగ్యమ్మ ఆరోపిస్తోంది. అయితే రూ. 40 వేల కోసం ఇద్దరి మధ్య గొడవలు జరిగాయని బంధువులు చెబుతున్నారు. మృతుడి మామ నాగరాజ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పంటలను పరిశీలించిన బీజేపీ నేతలు



ఎండిన పంటను పరిశీలిస్తున్న బీజేఎల్‌పీ నేత ఆర్.అశోక్

తుమకూరు : తుమకూరు జిల్లా శిరా తాలూకా దేవరహళ్లిని ఆదివారం బీజేఎల్‌పీ నేత, మాజీ మంత్రి ఆర్.అశోక్ సందర్శించారు. రైతులతో కలిసి పోలాలను సందర్శించి ఎండిన పంటలను పరిశీలించారు. పాండు అనే రైతు మాట్లాడుతూ 3 ఎకరాల్లో సాగు చేసి ఎండిన శనగ, జొన్న, ఉల్లిగడ్డ పంట ఎండిపోయి పెట్టుబడులు కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నిట్ట నిలువునా ఎండిపోయాయని, అయినా ప్రభుత్వం తమను ఆదుకోలేదని లు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

తుమకూరు : ఆత్మరక్షణకు కరాటే అవసరమని రాష్ట్ర సహకార శాఖ మంత్రి కే.ఎన్. రాజన్న అన్నారు. తుమకూరు వి.వి.లో ఉన్న డాక్టర్.శివకుమార స్వామీజీ సమావేశ హాలులో లయన్ మార్షల్ ఆర్ట్స్ సంస్థ ఆదివారం ఏర్పాటు చేసిన 7వ జాతీయ కరాటె చాంపియన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కరాటేపై యువత శిక్షణ పొందాల్సిన అవసరం ఉందన్నారు.

కన్నడ రక్షణకు శ్రమించాలి

శ్రీనివాసపురం: కన్నడ భాష, సాహిత్య రక్షణకు కన్నడ ప్రేమికులు కార్మికుల్లాగా శ్రమించాలని, అప్పుడు కన్నడ భాష మనుగడ సాధ్యమవుతుందని తహసీల్దార్ జీఎస్ సుధీంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని పురసభ కార్యాలయం ముందు కన్నడ ధ్వజ స్తంభం వద్ద నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సరిహద్దు ప్రాంతాలలో కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరు చేతులు కలపాలన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, నివృత్త సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమాదేవి, కస్తూరి కర్ణాటక వేదిక తాలూకా అధ్యక్షుడు శ్రీనాథ్ పాల్గొన్నారు.

పులి ఎక్కడ



మైసూరు జిల్లాలో బండీపుర అడవుల్లో హెడియాల రేంజిలో ఇటీవల పెద్ద పులి ఒక మహిళను చంపింది. ఆ పులిని పట్టుకోవడానికి అటవీ సిబ్బంది వచ్చిన దృశ్యం. డ్రోన్ కెమెరాలతో పులి కోసం గాలింపు సాగుతోంది

కారును ఢీకొన్న బోర్‌వెల్ లారీ.. ఇద్దరి మృతి



ప్రమాదానికి కారణమైన బోర్‌వెల్ లారీ



మృతులు కిశాన్ శెట్టి, పీలిఫ్‌సేరి

తుమకూరు: కంబళ పోటీలు రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. పోటీలను వీక్షించేందుకు వచ్చి తిరిగి వెళ్తున్నవారిపై మృత్యువు పంజా విసిరి ఇద్దరిని బలి తీసుకుంది. ఈఘటన తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా జిగణిపాళ్య వద్ద జరిగింది. మంగళూరులోని పరెరార బజప్పె గ్రామానికి చెందిన కిశాన్ శెట్టి(20), దక్షిణ కన్నడ జిల్లా భట్టరతోట గ్రామానికి చెందిన పీలిప్‌సేరి(32)లు మరికొందరితో కలిసి కారులో బెంగళూరులోని ప్యాలెస్ మైదానంలో జరుగుతున్న కంబళ పోటీలను చూసేందుకు వచ్చారు. వీరు తిరిగి మంగళూరు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన బోర్‌వెల్ లారీ ఢీకొంది. దీంతో కిశాన్ శెట్టి, పిలిఫ్‌సేరి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కుణిగల్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

తెలుగు విజ్ఞాన సమితి కార్యవర్గం ఎంపిక

- అధ్యక్షుడిగా మరోమారు రాధాకృష్ణరాజు ఎన్నిక



డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజును సత్కరిస్తున్న సభ్యులు

శివాజీనగర: తెలుగు విజ్ఞాన సమితి 59వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం శ్రీకృష్ణదేవయ కళామందిరంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజు, ఉపాధ్యక్షులుగా కే.గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, ప్రధానకార్యదర్శిగా ఇడమకంటి లక్ష్మీరెడ్డి, సహ కార్యదర్శిగా ఎం.ఎస్.చంద్రమోహన్, మహిళా కార్యదర్శిగా లక్ష్మీ శరత్, కోశాధికారిగా సీ.ఏ.వరదరాజును ఎంపిక చేశారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ జే.ఎస్.రెడ్డి, ఏ.కే.జయచంద్రారెడ్డి, సీ.చెన్నారెడ్డి, డీ.గణేశ్ శంకర్, ఆర్.ఉమాపతి నాయుడు, జీ.రమణబాబు, కే.సుబ్రమణ్యారాజు, కే.ఎస్.వెంకటేశులు, కే.ఎన్.నరసింహమూర్తి, పీ.ఎం.రాజు, పీ.క్రిష్ణమనాయుడు ఎన్నికయ్యారు. వీరంతా మూడు సంవత్సరాల పాటు 2027 వరకు కొనసాగుతారు. అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఏ.రాధాకృష్ణరాజును పదాధికారులు, కార్యవర్గ సభ్యులు సత్కరించారు.

అలరించిన నృత్య రూపకం



బొమ్మనహళ్లి : జయనగరలో ఉన్న వివేకా సమావేశం హాలులో నాట్యాంజలి సంస్థ నిర్వహించిన శ్రీకృష్ణ తులాభారం నృత్య రూపకం, శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులను అలరించింది. కర్ణాటక కళాశ్రీ గురువు అశోక్ కుమార్ మార్గదర్శనంలో సింధూ ఆర్. హెగ్డే తన అభినయంతో ఆకట్టుకున్నారు.

నేటి నుంచి రాజ్యోత్సవ వేడుకలు

కోలారు: భువనేశ్వరి కన్నడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నగరంలోని గాంధీ వనం వద్ద కన్నడ రాజ్యోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు భువనేశ్వరి కన్నడ సంఘం జిల్లా అధ్యక్షుడు కెఆర్ త్యాగరాజ్ తెలిపారు. 27వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రముఖ హాస్య కళాకారులు రిచర్డ్ లూయిస్ బృందం మిమిక్రీ కార్యక్రమం, 28 సాయంత్రం గోపి, కిర్లోస్కర్ బృందంచే నగెహబ్బ కార్యక్రమం, 29న అవినాశ్ లైట్ మ్యూజికల్ ట్రూప్‌చే సంగీత రసమంజరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని నగర ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కెఆర్ ధన్‌రాజ్, సతీష్, ఎస్ఎన్ ప్రకాష్ మామి పాల్గొన్నారు.



పరిశుభ్రత ఏదీ?

హంపీ అంటే దేశ విదేశాల్లో పర్యాటక నగరంగా పేరుంది. నిత్యం వందలాది మంది పర్యాటకులు, విదేశీయులు హంపీ శిల్ప సౌందర్యాన్ని చూడాలని వస్తుంటారు. కానీ వారికి బురద రోడ్లతో అవస్థలు తప్పడం లేదు. ఆదివారం విరూపాక్ష ఆలయం ముందు రోడ్డుపై కనిపించిన మురుగునీరు. పర్యాటకుల నుంచి లక్షల రూపాయల ఆదాయం వస్తుండగా, వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి.

కోలారు వార్తలు...

దోపిడీ దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కెజీఎఫ్: దాడి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన విఘ్నేష్, హరిప్రశాంత్ పోలీసులు అరెస్టయిన నిందితులు. వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఒక చాకును స్వాధీనం చేసుకున్నారు. నగర సమీపంలోని పెద్దపల్లి నుంచి యరగానహళ్లికి వెళ్లే మార్గమధ్యలో పొదల చాటున ఉండి ఆ దారిలో వచ్చే వాహనాలను అడ్డగించి దోపిడీలకు యత్నిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. రాబర్ట్‌సన్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మతం మారిన వారికి పథకాలు రద్దు చేయాలి

మైసూరు: గిరిజన సముదాయం నుంచి వేరే మతాలకు మారిన వారికి సంక్షేమ పథకాలు రద్దు చేయాలని శాసన మండలి సభ్యుడు శాంతరామ సిద్ది డిమాండ్ చేశారు. గిరిజనుల సంక్షేమంపై మైసూరులోని మహారాజ పీయు కళాశాలలో గిరిజన సురక్ష వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దాదాపు 700కిగా ఉన్న సముదాయాల సంక్షేమం సవాల్‌గా మారిందన్నారు. రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు పొందే హక్కు ఉన్నా అమలు కావడం లేదన్నారు.

కొండపై కార్తీక దీపం వేడుక

హోసూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా హోసూరు తేరుపేటలో కొండపై వెలసిన శ్రీ చంద్రచూడేశ్వర స్వామి ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, హోమాలు, విశేష పూజలు జరిపించారు. సాయంత్రం మేయర్ ఎస్.ఏ.సత్య, ఉపమేయర్ ఆనందయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజ్, ఆలయ కమిటీ సభ్యులు పట్టణ ప్రముఖులు శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయం నుంచి జ్యోతిని తీసుకెళ్లి కార్తీక దీపాన్ని వెలిగించారు.

వ్యవహారిక జ్ఞానాన్ని పెంచుకోండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: విద్యార్థులు వ్యవహారిక జ్ఞానాన్ని పెంచుకోవాలని సాహితి చౌడరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో సుగ్గి సంభ్రమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పరచడంలో సంతలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. మారుతున్న పరిస్థితులలో కూడా సంతలు తమ ప్రాధాన్యతను కోల్పోలేదన్నారు. సంతలలో వస్తువులు కొనుగోలు గ్రామీణులకు పరిపాటిగా మారిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా వైజ్ఞానిక జ్ఞానాన్ని పెంచుకోవడం మంచిదన్నారు. సాహిత్యాలలో కూడా సంతల మహత్యం గురించి చెప్పబడిందన్నారు. ప్రిన్సిపాల్ ప్రాణేష్ మాట్లాడుతూ... సంత భారతీయ ఆర్థికతకు మూల ద్రవ్యమన్నారు. సంతలలో క్రయ విక్రయాలలో ఎంతో తెలివితేటలు ఉండాలన్నారు. సాహితి శంకరేగౌడ, ఉపన్యాసకులు ఎస్ వాసు, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.



హుషారుగా నృత్యాలు చేస్తున్న మహిళలు

వనితల పరుగు పోటీ

బనశంకరి: దేశవ్యాప్తంగా మహిళలు సురక్షత, ఆరోగ్య రక్షణ ఉద్దేశంతో సిలికాన్‌సిటీలో సెల్యులా పింక్ మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి సెయింట్ జోసెఫ్ కాలేజీ నుంచి కబ్బన్‌పార్కు, విధానసౌధ వరకు మగువలకు పరుగు పందెం సాగింది. 3, 5, 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో సుమారు మూడువేల మంది వనితలు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అభిషేక్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న జనం

మండ్య: బ్యాడ్ మ్యానర్స్ సినిమా హీరో అభిషేక్ అంబరీష్‌కు ఆదివారం మండ్య నగరంలో అభిమానులు ఘన స్వాగతం పలికారు. బ్యాడ్ మ్యానర్స్ సినిమా విడుదలై విజయవంతంగా ప్రదర్శిస్తుండగా, మండ్యలోని సంజయ్ థియేటర్‌లో అభిమానులతో కలిసి సినిమాచూడడానికి అభిషేక్ వచ్చాడు. దాంతో యంగ్ రెబెల్‌స్టార్ అభిమానులు పెద్దసంఖ్యలో ఆయనకు స్వాగతం పలికారు. నాన్నగారి అభిమానులు ఎంతో కష్టపడి పనిచేశారని, తనకు కూడా మద్దతు ఇవ్వడం నాకు ఎంతో ధైర్యంగా ఉందని అన్నారు. జనం అభిమానాన్ని చూసి కన్నీళ్లు తెచ్చుకున్నారు.

క్రీడాకారిణి ఆత్మహత్య

యశవంతపుర: జాతీయ క్రీడల్లో విజయం దక్కలేదని క్రీడాకారిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు పట్టణంలోని సంప్యలో జరిగింది. నిశా(17) పట్టణంలోని వివేకానంద పీయూ కాలేజీలో చదువుతోంది. రెండు వారాల క్రితం బీహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పరుగుల పోటీల్లో పాల్గొంది. అయితే సరైన ప్రతిభ చాటలేక నిరాశకు గురైంది. ఈక్రమంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు గుర్తించి పుత్తూరు ఆస్పత్రికి తరలించగా వారం రోజులుగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది.

సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురండి



మాట్లాడుతున్న డీసీపీ శివకుమార్

కృష్ణరాజపురం: శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని వైట్‌ఫీల్డ్ డీసీపీ శివకుమార్ సూచించారు. కృష్ణరాజపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఆయన జనస్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మట్లాడుతూ 24 గంటలూ పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి దౌర్జన్యాలు, అరాచకాలకు తావిచ్చేది లేదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడమే తమ ధ్యేయమన్నారు.

పేలిన ఫ్రిడ్జ్

చిక్కబళ్లాపురం: ఫ్రిడ్జ్ పేలి వస్తు సామగ్రి ధ్వంసమైన ఘటన చిక్కబళ్లాపురం తాలూకా బీడిగానహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి ఇంటిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పొగ వచ్చింది. ఇంటిలో ఉన్న వృద్ధురాలు అప్రమత్తమై తమ మనవళ్లను తీసుకొని బయటకు వచ్చింది. అనంతరం పెద్ద శబ్దంతో ఫ్రిడ్జ్ పేలింది. పేలుడు తీవ్రతకు టీవీ, బీరువాకు మంటలు చెలరేగి కాలి బూడిదయ్యాయి. స్థానికులు వచ్చి మంటలు ఆర్పివేశారు. దొడ్డమరళి గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, సభ్యులు వచ్చి పరిశీలించారు. రూ.2లక్షల నష్టం జరిగిందని నాగరాజు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

మంచిగా మెలిగితే రౌడీషీట్ తొలగిస్తాం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారంనా రౌడీషీటర్లకు పరేడ్ నిర్వహించారు. పోలీసులు 22 మంది రౌడీ షీటర్లను హాజరు పరచగా సీఐ అమరేగౌడ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరెవరు ఏఏ పనులు చేస్తున్నారని ఆరా తీశారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు తెలిస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. ప్రశాంత జీవనం సాగించాలన్నారు. సమాజంలో మంచిగా మెలిగితే రాబోవు రోజుల్లో రౌడీషీట్ తొలగిస్తామన్నారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం



భువనేశ్వరిమాతకు పూజలు

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీ లేఔట్ సమీపంలో రాఘవేంద్ర లేఔట్‌లో కన్నడ కస్తూరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహిమచారు. కాంగ్రెస్‌నాయకులు ఉమాపతి శ్రీనివాస్ గౌడ, రవీంద్ర గౌడలు కన్నడ పతాకాన్ని ఆవిష్కరించి భువనేశ్వరి మాతకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ ఆంజినప్ప, లక్ష్మణ్, సంపత్, నాగేంద్ర పాల్గొన్నారు.

మెరుపు కల.. కంబళ కళ



దున్నలను కంబళ పోటీలకు సిద్ధం చేస్తున్న యజమానులు



కంబళపోటీల్లో పాల్గొన్న దున్నలు

- సిలికాన్ సిటీలో రెండురోజుల పండుగ
- ముగిసిన దున్నల పోటీలు

బనశంకరి: సిలికాన్ సిటీలో తొలిసారి నిర్వహించిన కంబళ క్రీడ నగరవాసులను రంజింపజేసింది. రెండవరోజైన ఆదివారం కంబళ పోటీలను చూడడానికి భారీఎత్తున ప్రజలు ప్యాలెస్ మైదానానికి తరలివచ్చారు. సాయంత్రం సాంస్కృతిక వేడుకల నిర్వహణతో కంబళ ఉత్సవాలు ముగిశాయి. కంబళ పోటీల్లో మొత్తం 200 కు పైగా దున్నపోతుల జంటలు పాల్గొన్నాయి. బురదనీటి మడుల్లో మెరుపు వేగంతో రైతులు వాటిని పరుగులు తీయిస్తుంటే సిలికాన్ సిటీ వాసులు ఈలలు, కేకలతో హుషారెత్తించారు. పోటీల్లో కాటి, మంజు, మోడా, కాళా, బోల్లా, కెంచా వివిధ జాతులకు చెందిన దున్నలు సత్తా చాటాయి.

అలరించిన సంగీత కచేరీ

గత రెండురోజులుగా ప్యాలెస్‌మైదానంలో తుళునాడు వైభవం ప్రారంభమైంది. మొదటిరోజు శనివారం అర్ధరాత్రి వరకు దున్నల పరుగును నిర్వహించారు. ఇక ఆదివారం ప్రారంభమైన పోటీలో పలువురు రాజకీయ, ఇతర ప్రముఖులు వచ్చి వీక్షించారు. సాయంత్రం సంగీత కచేరీలో సంగీత దర్శకుడు అర్జున జన్య ప్రదర్శన నగరవాసుల్ని తన్మయుల్ని చేసింది. గాయని శమితా మల్నాడ్ పాటలు మురిపించాయి.

కాంతార దున్నలకు స్వర్ణ పతకం

కన్నడ నటుడు, డైరెక్టర్ రిషబ్‌శెట్టి నటించిన హిట్ సినిమా కాంతార లో కంబళ పోటీల్లో పాల్గొన్న దున్నలు బెంగళూరు పోటీల్లో బంగారు పతకం సాధించడం విశేషం. బోళంబెళ్లద పరమేశ్వర భట్ అనే రైతుకు చెందిన ఈ దున్నలు ఆదివారం అమిత వేగంతో పరుగులు తీసి స్వర్ణ పతకాన్ని అందుకున్నాయి.



బురదలో దున్నలు పరుగులు తీస్తున్న దృశ్యం



దున్నలను పరిగెత్తిస్తున్న రైతు



కంబళ పోటీలను వీక్షించడానికి తరలివచ్చిన నగరవాసులు



వివిధ ప్రాంతాల నుంచి దున్నలతో వచ్చిన రైతులు

కార్యకర్తల రక్షణకు కంట్రోల్ రూమ్

- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర

శివాజీనగర: పోలసుల వేధింపులనుంచి తమ కార్యకర్తలు, నాయకులను కాడుకుంటూ చట్టపరమైన సాయం అందించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో ఆదివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వ తప్పిదాలపై సామాజిక మాధ్యమాల్లో గళం విప్పిన క్రియాశీల కార్యకర్తలను లక్ష్యంగా పెట్టుకొని పోలీసులు వేధిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని పోలీసులు హరించివేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా తమ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది, బెదిరింపు, వేధింపులు జరిగినా తక్షణమే పార్టీ సహాయానికి వస్తుందన్నారు.

కుమారస్వామితో విజయేంద్ర భేటీ



కుమారస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయేంద్ర

దొడ్డబళ్లాపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాజీ సీఎం కుమారస్వామితో భేటీ అయ్యారు. ఆదివారం బిడది తాలూకా కేతగానహళ్లిలోని ఫాం హౌస్‌కు వెళ్లి కుమారస్వామిని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా రెండు పార్టీల మధ్య పొత్తు, రాబోవు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇరువురి మధ్య చర్చలు ఆసక్తికరంగా సాగాయి.

రాజ్యాంగాన్ని చదువుతూ నిరసన



రాజ్యాంగాన్ని చదువుతున్న ఆందోళనకారులు

మండ్య : తమిళనాడుకు కావేరి నీటిని విడుదల చేయాలని మరోమారు కావేరి నీటి నిర్వహణ మండలి ఆదేశాలు జారీ చేయడాన్ని నిరసిస్తూ మండ్యలోని సర్ ఎం.వి.విగ్రహం వద్ద రైతు హితరక్షణ శనివారం చేపట్టిన దీక్ష ఆదివారం కొనసాగింది. ఆందోళనకారులకు మద్దతు పలికిన కర్ణాటక రాష్ట్ర దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు వినూత్నంగా భారత రాజ్యాంగం చదువుతూ నిరసన తెలిపారు. నాయకులు కృష్ణ మిక్కేరి చుంచయ్య, మేనా సాగర శోభ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆహార మేళా



గౌరిబిదనూరు: పట్టణం వెలుపల ఉన్న శ్రీరామకృష్ణ, శారదాదేవి విద్యామందిరంలో శనివారం బాలల దినోత్సవం, ఆహార మేళా ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ బీన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మానవత్వం, సంస్కారం గొప్పతనాన్ని తెలపాలన్నారు. పౌష్టికాహార ఆవశ్యతపై అవగాహన కల్పించాలన్నారు. విద్య ఆవశ్యకతను ఉపాధ్యాయులు నాటకం ద్వారా వివరించారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న రక్షా రామయ్య

గౌరిబిదనూరు: ఇటీవల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, రవాణా శాఖలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువ కాంగ్రెస్ అధ్యక్షుడు రక్షా రామయ్య సూచించారు. గురువారం రోడ్డు ప్రమాదంలో గాయపడి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు మంజునాథ్, వెంకటాద్రి, దీపం, అర్జున్ డి గౌడ, శమీర పాల్గొన్నారు.

బీఎంటీసీ బస్సులో యువతికి వేధింపులు

- కండక్టర్ సెల్‌ఫోన్‌లో మహిళా ప్రయాణికుల ఫొటోలు
- సస్పెండ్ చేసిన అధికారులు

శివాజీనగర: కామాంధులు చెలరేగుతున్నారు. బెంగళూరులోని లులు మాల్, మెట్రోలో యువతులకు వేధింపులకు గురైన ఘటన కళ్ల ముందు మెదులుతుండగానే బీఎంటీసీ బస్సులోనూ అలాంటి అకృత్యం వెలుగు చూసింది. కండక్టరే యువతికి వేధింపులకు గురిచేసినట్లు తేలింది. గత నెలలో శివాజీనగర నుంచి కే.ఆర్.పురం వెళ్లే రూట్ నంబర్ 300 ఈఏ బస్సులో ఓ యువతి సీటులో కూర్చొని ఉండగా కండక్టర్ కెంపణ్ణ ఆమె వద్దకు వెళ్లి అసభ్యకరంగా తాకాడు. కండక్టర్ చేష్టలపై బాధితురాలు బీఎంటీసీకి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. బీఎంటీసీ భద్రతా, జాగృతదళ అధికారులు కండక్టర్ కెంపణ్ణను విచారణ చేపట్టగా వేధింపులు నిజమేనని తేలింది. అతని సెల్‌ఫోన్‌లో మహిళా ప్రయాణీకుల రహస్య ఫొటోలు ఉండటంతో అతన్ని సస్పెండ్ చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న బస్సు

మహిళకు తీవ్ర గాయాలు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు ఉత్తర తాలూకా మాదావర వద్ద కేఎస్ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా ముందు కూర్చున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మహిళను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- భార్యను దుడ్డుకర్రతో బాది చంపిన భర్త

బొమ్మనహళ్లి: వివాహేతర సంబంధం హత్యకు దారితీసింది. భార్య మరొకరితో సన్నిహితంగా ఉండటంతో భర్త ఆమెను దుడ్డుకర్రతో బాది అంతమొందించాడు. ఈ ఘటన బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ తాలూకా తమ్మనాయకనహళ్లిలో చోటు చేసుకుంది. ఆనేకల్ పోలీసుల కథనం మేరకు మహదేవయ్య ఆనేకల్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య లక్ష్మమ్మ(40) గారె పనికి వెళ్లేది. వీరికి ఆరు మంది సంతానం ఉన్నారు. లక్ష్మమ్మ తాను పనులు చేసే ప్రాంతంలో ఒక వ్యక్తితో సన్నిహితంగా ఉంటోంది. ఇదే విషయంపై దంపతుల మధ్య చాలా సార్లు గొడవలు జరిగాయి. లక్ష్మమ్మ వ్యవహారంపై స్థానికులు చర్చించుకుంటుండటంతో మహదేవ మనోవేదనకు గురయ్యాడు. శనివారం రాత్రి లక్ష్మమ్మ నిద్రిస్తున్న సమయంలో దుడ్డుకర్రతో తలపై బాదాడు. తీవ్ర గాయాలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆనేకల్లు పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి మహదేవయ్యను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేపట్టారు.

సముద్రంలోకి దూకి వివాహిత ఆత్మహత్య

యశవంతపుర: జీవితంపై విరక్తితో ఓ మహిళ సముద్రంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఉత్తరకన్నడ జిల్లా కుమటాలో జరిగింది. కుమటా తాలూకా సాంతగల్ గ్రామానికి చెందిన నివేదిత నాగరాజ భండారి తన ఇద్దరు మగపిల్లలను తీసుకొని స్కూటీలో సముద్రం వద్దకు వెళ్లింది. పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. అయితే మనస్సు మార్చుకొని ఇద్దరు పిల్లలను కుమటా పిక్‌ప బస్టాండ్ వద్ద కుర్చోపెట్టి నివేదితా ఒక్కతే తిరిగి సముద్రం వద్దకు వెళ్లింది. మాంగల్యం, కాలి మెట్టెలు, సెల్‌ఫోన్ స్కూటీలో పెట్టి సముద్రంలోకి దూకింది. లైఫ్‌గార్డ్ గుర్తించి ఆమెను రక్షించటానికి యత్నించినా అలల కారణంగా సాధ్యం కాలేదు. గాలించగా ఆమె మృతదేహం లభ్యమైంది. కుమాట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



నివేదిత(ఫైల్), సముద్రం వద్ద వదిలిన స్కూటీ

హోసూరు వార్తలు..

కరెంటు షాక్‌తో ఏనుగు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఏనుగు

కెలమంగలం: రైతు పొలంలో విద్యుత్ మోటార్‌కు అమర్చిన విద్యుత్ వైరును లాగిన ఏనుగు షాక్ కొట్టి కన్నుమూసింది. కొన్నిరోజుల క్రితం బెంగళూరు దగ్గర బన్నేరుగట్ట అటవీ ప్రాంతం నుంచి జవళగిరి అటవీ ప్రాంతం మీదుగా డెంకణీకోట ప్రాంతానికి పదుల సంఖ్యలో ఏనుగులు వలసవచ్చాయి. కొన్ని విడిపోయి బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. శనివారం రాత్రి డెంకణీకోట సమీపంలోని నగనూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పది ఏనుగులు సమీపంలోని తావరకెరె ప్రాంతంలో పొలాల్లోకి చొరబడ్డాయి. ఒక ఏనుగు పంపు సెట్టుకు అమర్చిన వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు విడిచింది. అటవీశాఖాధికార్లు, పోలీసులు పశువైద్యులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన ఏనుగుకు శవపరీక్షలు నిర్వహించి అక్కడే పాతిపెట్టారు. కేసు నమోదు చేశారు.

పెళ్లి చేయలేదని యువకుడి ఆత్మహత్య

హోసూరు: అప్పులు తీరిన తర్వాతే పెళ్లి చేస్తామని సహోదరుడు చెప్పడంతో విరక్తి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన సిఫ్‌కాట్‌లో జరిగింది. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని కామరాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన మురళి (26) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వెంటనే తనకు పెళ్లి చేయాలని అన్నను కోరాడు. అప్పులు ఉన్నాయని, అవి తీర్చిన వెంటనే పెళ్లి చేస్తామని చెప్పాడు. దీంతో విరక్తి చెందిన మురళి శనివారం రాత్రి పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికులు చూసి అతన్ని హోసూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఫలితంలేక చనిపోయాడు. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీడా సామగ్రి పంపిణీ



ఉపకరణాలందజేస్తున్న ఎమ్మెల్యే మునిస్వామి

క్రిష్ణగిరి: వేపనపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కే.పి. మునిస్వామి యువకులకు క్రీడా ఉపకరణాలను ఆదివారం అందజేశారు. బిల్లనకుప్పం గ్రామానికి చెందిన యువకులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకొనేందుకు తమ గ్రామంలో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని, క్రీడా ఉపకరణాలను అందజేయాలని గత కొన్నిరోజుల క్రితం ఎమ్మెల్యేని కోరారు. ఆయన బిల్లనకుప్పం గ్రామానికి చేరుకొని యువకులకు వాలీబాల్ క్రీడా సామగ్రిని అందజేశారు. త్వరలో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల విహారయాత్రలో విషాదం



- ముందు వెళ్తున్న లారీని ఢీ
- ముగ్గురు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

క్రిష్ణగిరి: విద్యార్థుల విహారయాత్ర విషాదయాత్రగా మారి కన్నవారికి తీరని శోకాన్ని మిగిల్చింది. బెంగళూరు నుంచి సేలంకు కారులో వెళుతుండగా ఈచర్ లారీని ఢీకొనడంతో కారులోని ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకొంది. వివరాల మేరకు తమిళనాడులోని సేలం, తిరుపతి ప్రాంతాలకు చెందిన విద్యార్థులు బెంగళూరులోని క్రైస్ట్ కళాశాలలో లా, బిఎస్సీ చదువుతున్నారు. సెలవు కావడంతో 5 మంది కలిసి కారులో సేలంకు బయల్దేరారు.

నిద్రమత్తులో..

వేకువజాము 5 గంటల సమయంలో హోసూరు-క్రిష్ణగిరి హైవేపై కోనేరుపల్లి వద్ద ముందు వెళుతున్న ఈచర్ లారీని ఢీకొన్నారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది, అందులోని సంతోష్ (22), తమిళ్‌వానన్ (22), నరేన్‌అశ్విన్ (23) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సస్విన్ (23), సర్విన్ ఐసక్ (23) తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు గాయపడిన వారిని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకొని మృతదేహాలను స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు. నిద్రమత్తులో కారు నడపడమే ఘోరానికి కారణమని భావిస్తున్నారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు



ఈ రోడ్డును బాగుచేయరూ



కంకర తేలిన రహదారి

హోసూరు: అచ్చెట్టిపల్లి గ్రామానికెళ్లే తారు రోడ్డు కంకర తేలిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుననారు. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. హోసూరు - కెలమంగలం ప్రధాన రోడ్డు నుంచి అచ్చెట్టిపల్లి గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరం వెళ్లవలసి ఉంది. రెండు కిలోమీటర్ల దూరం తారురోడ్డు దెబ్బతిని కంకర తేలిపోయింది. దీనివల్ల ద్విచక్రవాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. రోడ్డును బాగు చేయాలని కోరారు.

వాహనాలకు జరిమానా

హోసూరు: నిబంధనలు పాటించకుండా నడుపుతున్న 13 వాహనాలను ఆర్టీవో అధికారులు సీజ్ చేసి జరిమానా విధించారు. క్రిష్ణగిరి రవాణాశాఖాధికారి కాళియప్పన్, ఆర్టీవో అధికార్లు ఆనంద్, అన్బుచెలియన్‌ల బృందం శనివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్ తదితర రికార్డులు లేక నడుపుతున్న 13 వాహనాలను స్వాధీనపరుచుకొని వారి నుంచి రూ. 2.80 లక్షల జరిమానా వసూలు చేశారు. వాహన దారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేదంటే జరిమానాలు తప్పవని తెలిపారు.

ఘనంగా చర్చి వేడుకలు

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి పరిధిలో ఉన్న సెయింట్ మేరీస్ చర్చి రజత మహోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో పాటు వెండి మహోత్సవం వేడుకలు జరిపారు. ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి ప్రార్థనల్లో పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు. యువత కళా ప్రదర్శనలు, నాటకాలు ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా...

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పరిహారం చెల్లింపుపై మత్స్యకారులు, బోటు యజమానుల హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, మత్స్యకారులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించిన సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు క్షీరాభిషేకం చేశారు. హార్బర్‌లో జరిగిన కార్యక్రమంలో బోటు యజమానులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే సీఎం జగన్ స్పందించి మానవత దృక్పథంతో 80 శాతం నష్టపరిహారాన్ని ప్రకటించారన్నారు. అతి తక్కువ వ్యవధిలో నష్టపరిహారం అందుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ మత్స్యకారులు అంటే సీఎంకు ఎనలేని అభిమానం ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం కోసం సీఎం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, బోటు యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

'సాహితీ' మోసంపై కొనుగోలుదారుల ఆరా

మంగళగిరి: సాహితీ కన్‌స్ట్రక్షన్ మోసంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమవడంతో పలువురు కొనుగోలుదారులు ఆదివారం గుంటూరు జిల్లా కాజ సమీపంలోని సైట్ వద్దకు వచ్చి ఆరా తీశారు. ఆదివారం కావడంతోపాటు పత్రికలో కథనం రావడంతో ఇప్పటివరకు సైట్‌లో పనిచేస్తోన్న సిబ్బంది సైట్ వైపు చూడలేదు. ఒక్క వాచ్‌మన్ మాత్రమే ఉన్నాడు. ఆయన ఎవరినీ లోపలికి అనుమతించలేదు. పలువురు కొనుగోలుదారులు కన్‌స్ట్రక్షన్ కంపెనీ మోసంపై కాజలోని స్థానికులను అడిగి తెలుసుకోవడంతోపాటు డెవలప్‌మెంట్‌కు భూములు ఇచ్చిన, విక్రయించిన రైతులను వాకబు చేసినట్లు తెలిసింది. మోసపోయిన కొనుగోలుదారులు అందరూ అసోసియేషన్‌గా ఏర్పడి తమకు న్యాయం జరిగేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సీఎం జగన్ వెంటే గిరిజనులు

ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజనులు సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారని, మరోమారు ఆయననే సీఎం చేసేలా తమ వంతు పాత్ర పోషిస్తారని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన సమాఖ్య ముఖ్య నాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో ఎస్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేశారన్నారు. 'సామాజిక సాధికార బస్సు యాత్రల్లోను గిరిజనులు భారీగా పాల్గొని విజయవంతం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని ఎత్తులు వేసినా జగన్ మరోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నిజమైన అంబేడ్కర్ వాది జగన్

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యోనారాజు

సాక్షి, అమరావతి: పేద, బడుగు బలహీన వర్గాల తలరాతలు మార్చిన దేవుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలను అమలు చేస్తోన్న దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు అన్నారు. విజయవాడలోని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన అనంతరం యోనారాజు మాట్లాడుతూ ఏపీలో పేదలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్ నిజమైన అంబేడ్కర్ వాది అన్నారు. అన్ని వర్గాల్లోను రాజ్యాంగ స్ఫూర్తిని రగిలించేలా విజయవాడ నడిబొడ్డున అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సీఎం జగన్‌కు మాలమహానాడు తరపున కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు, పవన్‌లవి అవకాశవాద రాజకీయాలు

ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

సాక్షి, అమరావతి: తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చంద్రబాబు మద్దతిస్తున్నారని, బీజేపీతో పవన్ పొత్తును పెట్టుకున్నారని, ఏపీలో మాత్రం వీరిద్దరు అవకాశవాద పొత్తును కొనసాగిస్తున్నారని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణాలో వేర్వేరు రాజకీయ పార్టీలతో సహజీవనం చేస్తూ ఏపీలో మాత్రం ఇదేం అపవిత్ర బంధం అని పవన్, బాబుపై ఆయన మండిపడ్డారు. లోపాయికారి ఒప్పందంతో పవన్, బాబు చేస్తున్న అవకాశవాద రాజకీయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఏపీలో ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయం చేసి బాబుకు మేలు చేసేందుకు తాపత్రయ పడుతున్న పవన్ తెలంగాణలో ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు.

ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిదిద్దండి

కృష్ణా, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు వైఎస్సార్‌సీపీ వినతిపత్రాలు

- టీడీపీ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తోంది
- ఒకే డోర్ నంబర్‌లో అత్యధిక ఓట్లు ఉన్నాయి
- మరికొందరికి ఏపీ, తెలంగాణలో కూడా ఓట్లు ఉన్నాయి
- ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.. అవకతవకలను సరిదిద్దండి
- కృష్ణా జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే పేర్ని నాని ఫిర్యాదు
- వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి
- అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే గడికోట ఫిర్యాదు



కృష్ణా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని



అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాల్లో అవకతవకలను సరిదిద్ది, ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న తెలుగుదేశం పార్టీపై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు వైఎస్సార్‌సీపీ వినతిపత్రాలు సమర్పించింది. వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పేర్ని నాని శనివారం కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబుకు, పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆ జిల్లా కలెక్టర్ గిరిషాను కలిసి ఈమేరకు వినతిపత్రాలు సమర్పించారు. తెలుగుదేశం పార్టీ ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తోందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తోందని తెలిపారు. టీడీపీ యాప్‌లో వ్యక్తిగత సమాచారాన్ని ఉంచుతూ యాప్ జనరేట్ అయ్యే ఓటీపీని సైతం అడుగుతున్నారని, ఇవ్వకపోతే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆధారాలను కూడా సమర్పించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్లను కోరారు.

టీడీపీ యాప్‌లో ప్రజల వ్యక్తిగత సమాచారం : గడికోట

ఓట్ల పరిశీలన ముసుగులో టీడీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారని గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా సేకరణ చేయడం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ యాప్‌లో సమాచారం పొందుపరిచే మిషతో టెలిఫోన్ నంబర్ తీసుకుని ఓటీపీ కూడా అడుగుతున్నారని తెలిపారు. ఓటీపీ, వ్యక్తిగత సమాచారం ఇవ్వని వారిపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

కలెక్టర్ దృష్టికి రాజంపేట ఉదంతం

రాజంపేట నియోజకవర్గంలో ఇలా సమాచారం ఇవ్వని ఓ ఇంట్లోని వారిపై టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగిన ఉదంతాన్ని కలెక్టర్ దృష్టికి శ్రీకాంత్‌రెడ్డి తీసుకువెళ్లారు. బాబు భరోసా, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాల కింద సమాచారం అడిగారని, 2024లో టీడీపీ ప్రభుత్వం వస్తోందంటూ ప్రజలను మభ్యపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించకుండా చూడటంతో పాటు దౌర్జన్యాలను అరికట్టాలని ,ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కలెక్టర్‌ను శ్రీకాంత్ రెడ్డి కోరారు.

2019కి ముందు నుంచే బోగస్ ఓట్లు : పేర్ని నాని

2019కి ముందు నుంచే ఒకే డోర్ నెంబర్ లో 50 నుంచి 100 ఓట్ల వరకు ఉన్నాయని పేర్ని నాని సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే కొందరు ఏపిలో, తెలంగాణలో రెండు చోట్లా ఓటు హక్కు కలిగి ఉన్నారని వివరించారు. మరికొందరికి మున్సిపల్ ఏరియాలో, గ్రామంలో వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్నాయని చెప్పారు. తమ పార్టీ కార్యకర్తలు పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని, ఆ చిరునామాల్లో ఉంటున్న వారిని అడగ్గా వారికీ విషయం తెలియదని చెబుతున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఇలా ఉద్దేశపూర్వకంగా దొంగ ఓట్లు చేర్చారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని చెప్పారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత ఇలాంటి అవకతవకలు, బోగస్ ఓట్లపై ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశామని తెలిపారు. తుది జాబితా విడుదలకు ముందు ఇలాంటి బోగస్, అక్రమ ఓట్లపై విచారణ జరిపి ప్రజాస్వామ్యయుతంగా అర్హులైన ప్రతి ఓటరుకూ ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో జిల్లా కలెక్టర్‌ను కోరారు.

వైఎస్సార్ విజన్‌తోనే మెగా సిటీగా హైదరాబాద్

- మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్
- తెలంగాణ మార్పు కోరుతోంది... తామే గెలుస్తామని ధీమా



సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు దిగ్విజయ్‌సింగ్ ప్రశంసించారు. వైఎస్సార్ విజన్‌తోనే హైదరాబాద్ మెగాసిటీగా రూపాంతరం చెందిందని, ఔటర్ రింగురోడ్డును నిర్మించిన కారణంగానే బెంగళూరుతో పోటీపడి హైదరాబాద్ ఐటీ హబ్‌గా రూపాంతరం చెందుతోందని అన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగానే పారిశ్రామిక అనుకూల విధానాలతో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మారుస్తుందని పేర్కొన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి అజయ్‌కుమార్, టీపీసీసీ సీనియర్ నేత జి.నిరంజన్‌లతో కలిసి దిగ్విజయ్ మాట్లాడారు. తెలంగాణ ప్రజానీకం మార్పు కోరుతోందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆయన ధీమా వెలిబుచ్చారు. తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చినవే తప్ప మతం ప్రాతిపదికన కాదని దిగ్విజయ్ స్పష్టం చేశారు.

అవయవదానంతో యువతికి పునర్జన్మనిచ్చిన వీఆర్వో

- రోడ్డు ప్రమాదానికి గురైన శ్రీకాకుళం జిల్లాకు చెందిన వీఆర్వో మౌనిక
- అనంతరం బ్రెయిన్ డెడ్
- అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులు
- ఒక మూత్రపిండం వైజాగ్ కిమ్స్‌కు, మరొకటి శ్రీకాకుళం జెమ్స్‌కు తరలింపు
- రెండు కళ్లు రెడ్‌క్రాస్‌కు అప్పగింత
- మౌనిక గుండెను తిరుపతి 'పద్మాలయ'లో మరో యువతికి అమర్చిన వైద్యులు



విశాఖ విమానాశ్రయంలో అంబులెన్స్ నుంచి గుండె ఉన్న కిట్‌ను దించుతున్న దృశ్యం



మౌనిక (ఫైల్)

శ్రీకాకుళం రూరల్/గోపాలపట్నం(విశాఖ పశ్చిమ)/తిరుపతి తుడా : పుట్టెడు దుఃఖంలోనూ తమ కుమార్తె అవయవాలు దానం చేసి పలువురికి పునర్జన్మను ప్రసాదించిందో కుటుంబం. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన మౌనిక(23) వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను శ్రీకాకుళంలోని రిమ్స్‌కు, అనంతరం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖలోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. మౌనిక మెదడు పూర్తిగా డెడ్ అయినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. తమ కుమార్తె అవయవాలు వేరేవారికి పునర్జన్మను ప్రసాదిస్తాయని తెలుసుకున్న తల్లిదండ్రులు.. దుఃఖాన్ని దిగమింగుకుని అవయవాల దానానికి ముందుకొచ్చారు. దీంతో శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో మౌనిక శరీరం నుంచి అవయవాలు వేరు చేశారు. గుండెను తిరుపతి పద్మాలయ హృదయాలయ ఆస్పత్రికి గ్రీన్ చానల్ ద్వారా ప్రత్యేక విమానంలో తరలించారు. ఒక మూత్ర పిండాన్ని వైజాగ్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి, మరో మూత్ర పిండాన్ని శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి పంపగా.. రెండు కళ్లను రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లిదండ్రులు గోవిందరావు, ఉమాదేవి మాట్లాడుతూ తమ కూతురు చనిపోలేదని.. అవయవాలను దానం చేసి.. వారిలో బతికే ఉందని చెప్పారు.

గుండె మార్పిడితో పునర్జన్మ

తిరుపతిలోని శ్రీ పద్మావతి గుండె చికిత్సాలయం మరో యువతికి గుండె మార్పిడి చేసి పునర్జన్మను ప్రసాదించింది. నెల్లూరు పట్టణానికి చెందిన 21 ఏళ్ల యువతి డైలేటెడ్ కార్డియో మయోపతి సమస్యతో బాధపడుతోంది. ఈ నెల ఒకటో తేదీన ఆస్పత్రికి రావడంతో ఆ యువతికి వైద్య పరీక్షలు చేసి.. గుండె సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందని, మార్పిడి అనివార్యమని వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో మౌనిక కుటుంబ సభ్యులు అవయవదానం చేయడంతో విషయాన్ని సీఎం కార్యాలయం చొరవ తీసుకుని సమాచారాన్ని సీఎం వైఎస్ జగన్‌కు వివరించింది. విశాఖ నుంచి గుండెను తీసుకొచ్చేందుకు చాపర్ విమానాన్ని అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులను విడుదల చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రత్యేక విమానంలో తెచ్చిన గుండెను యువతికి అమర్చారు సుమారు రూ.12 లక్షలకు పైగా ఖర్చయ్యే గుండె మార్పిడి చికిత్సను ఉచితంగా చేసి యువతికి పునర్జన్మను ప్రసాదించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలోని వైద్యుల బృందం సుమారు 5.30 గంటల పాటు శ్రమించి విజయవంతంగా గుండెమార్పిడిని పూర్తిచేసింది.

వైద్యుడి ఆత్మహత్యపై టీడీపీ రాజకీయం

- కాకినాడలో యువ వైద్యుడి బలవన్మరణం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుపై బురదజల్లే ప్రయత్నం
- సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- వెంటనే రాజకీయం చేయాలని చూసిన లోకేశ్, టీడీపీ, జనసేన నేతలు
- ఆర్థిక కారణాలతో ఆత్మహత్య చేసుకున్నాడన్న తల్లి
- కన్నబాబు, కల్యాణ్‌కు సంబంధం లేదని స్పష్టీకరణ
- దీనిపై రాజకీయం చేయొద్దని వేడుకోలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో ఏ చిన్న సంఘటన జరిగినా దానిని వైఎస్సార్‌సీపీకి, ప్రభుత్వానికి ముడిపెట్టి రాజకీయం చేయడం విపక్షాలకు అలవాటుగా మారిపోయింది. జరిగిన ఘటన ఏది, దాని వెనుక కారణాలేమిటి అన్న విచక్షణ కూడా లేకుండా విపక్ష నేతలు వ్యవహరిస్తున్నారు. కాకినాడలో ఓ యువ వైద్యుడి ఆత్మహత్యనూ వివాదాస్పదం చేసి, రాజకీయం చేసేందుకు విపక్షాలు విఫలయత్నం చేశారు. ఆయన ఆత్మహత్యకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఆయన సోదరుడు కల్యాణ్ కారణమంటూ కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. టీడీపీ నేతలు కూడా రంగంలోకి దిగిపోయి అసత్య ఆరోపణలు చేశారు. అయితే, వైద్యుడి ఆత్మహత్యకు ఆర్థిక కారణాలే కారణమని ఆయన తల్లి చెప్పడంతో విపక్షాల వ్యూహం బెడిసికొట్టింది.

జరిగిందిదీ..

కాకినాడ అశోక్ నగర్‌కు చెందిన డాక్టర్ సున్న శ్రీకిరణ్ రష్యాలో వైద్య విద్య చదివాడు. కాకినాడలో ఉంటున్నాడు. శనివారం రాత్రి ఆయన తన ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. వెంటనే ఆయన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీకి చెందిన కురసాల కన్నబాబు, కల్యాణ్‌తో భూవివాదం కారణంగానే వైద్యుడు శ్రీకిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఆ వెంటనే టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ కూడా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భూ దందాలు, హత్యలు పెరిగిపోయాయంటూ వెనుకాముందూ చూసుకోకుండా ట్వీట్ కూడా చేశారు. కుమారుడి ఆత్మహత్యతో విషాదంలో ఉన్న అతడి తల్లి శేషారత్నాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లి రాజకీయంగా లబ్ధి పొందేందుకు టీడీపీ, జనసేన నాయకులు కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి కొద్దిసేపు హంగామా చేశారు. ఈ ఉదంతాన్ని వివాదాస్పదం చేయాలని ప్రయత్నించారు.

రాజకీయానికి వాడుకోవద్దు: తల్లి శేషారత్నం



అయితే అసలు వాస్తవాన్ని మృతుడి తల్లి శేషారత్నం ఆదివారం మీడియాకు వెల్లడించారు. 'మా బాబు నిన్న సాయంత్రం పురుగుల మందు తాగి ఆదివారం తెల్లవారుజామున చనిపోయాడు. అక్కడ పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకునేటప్పుడు ఎవ్వరికీ ఏదీ సంబంధం లేదనే విషయాన్ని చెప్పాను. కన్నబాబుకు, కల్యాణ్‌కు నా కుమారుడి ఆత్మహత్యలో ప్రమేయం లేదు. బాబు చనిపోవడంతో పొలం మేటర్‌లో ఏదో గొడవ ఉండి ఉంటుందని వాళ్లు వీళ్లు అనడంతో డిప్రెషన్‌లో మాట్లాడాను. పొలం విషయంలో డిప్రెస్ అయ్యి, ఆర్థిక కారణాలతో సెన్సిటివ్‌గా ఉన్నాడు. అందువల్లే పురుగు మందు తాగాడు. మధ్యలో కొందరు రాజకీయంగా వాడుకుంటున్నట్టు కనిపిస్తోంది. దయచేసి ఈ సంఘటనను రాజకీయానికి వాడుకోవద్దు' అని శేషారత్నం వేడుకొన్నారు.

'డబుల్ ఇంజన్'తోనే అభివృద్ధి

నిర్మల్, తూప్రాన్ బహిరంగ సభల్లో ప్రధాని నరేంద్ర మోదీ



• తెలంగాణ

నిర్మల్/మెదక్: తెలంగాణలో మొదటిసారిగా బీజేపీ సర్కార్ ఏర్పాటు కానుందని.. సకల జనులంతా బీజేపీ వెంటే ఉన్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలతో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పడితే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కేవలం కుటుంబ పార్టీలు అని, బీజేపీ నిరంతరం పేద ప్రజల గురించే ఆలోచిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా పేదల ఆకలి తీర్చేందుకు మరో ఐదేళ్లు ఉచిత రేషన్ కొనసాగించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో, మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలలో ప్రధాని మోదీ మాట్లాడారు. ''నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణను అప్పులకుప్పగా మార్చారు. నీళ్లు ఇవ్వలేదు. నియామకాలను పేపర్ లీకులు, వాయిదాలతోనే సరిపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే నియామకాలు జరిగాయి. సీఎం కేసీఆర్ తెలంగాణను లూటీ చేసి దేశ రాజకీయాల్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో కట్టర్ ఫ్రాడ్‌తో చేతులు కలిపి లిక్కర్ స్కామ్ చేశారు. అవినీతి నాయకులు జైలుకు వెళ్లేందుకు సమయం ఆసన్నమైంది'' అని పేర్కొన్నారు. మత ప్రాతిపదికన రాష్ట్రంలో ఐటీపార్కు ఏర్పాటు చేస్తామని కేసీఆర్ పేర్కొనడం రాజ్యాంగానికే ప్రమాదకరమన్నారు.

ఇంగ్లిష్ మీడియం వద్దనడం అనాగరికం

- ఏపీ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి చాలా మంచి పనిచేసింది
- పేద పిల్లలకు ఇంగ్లిష్ ఎంత అవసరమో నాకు తెలుసు
- అగ్రవర్ణాలు, ఆధిపత్యవర్గాల పిల్లలే ఇంగ్లిష్ చదువుకోవాలా?
- బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: 'పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం వద్దనడం చాలా అనాగరికమైన ఆలోచన. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం పాఠశాల స్థాయిలోనే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి చాలా మంచి పని చేసింది' అని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఇటీవల 'సాక్షి' ఛానల్‌లో ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో బోధన ఎంత అవసరమో తనకు అనుభవపూర్వకంగా తెలుసునని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడం ద్వారా పేద విద్యార్థులకు అవకాశాలను పెంపొందించిందని, జ్ఞానాన్ని బహుజనీకరించిందని వివరించారు. ఇంగ్లిష్ మీడియంతోపాటు కోడింగ్ స్కిల్స్ కూడా నేర్పించాలని అన్నారు.

అగ్రవర్ణాల పిల్లలే చదువుకోవాలా?

పేద విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ఎందుకు చదవకూడదని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. 'అగ్రవర్ణాలు, ఆధిపత్యవర్గాల పిల్లలే ఇంగ్లిష్ మీడియంలో చదవాలా? కూలీల పిల్లలు చదువుకోకూడదా? వాళ్లు విదేశాలకు పోకూడదా? కంపెనీలకు సీఈవోలు, సీటీవోలు కాకూడదా? కోడింగ్ నేర్చుకోకూడదా' అని నిలదీశారు. 'మేం ఇంకొంత ముందుకు పోయాం. పాఠశాల స్థాయి నుంచి ఇంగ్లిష్ ఒక్కటే కాదు.. కోడింగ్ స్కిల్స్ కూడా నేర్పించాలని ఆలోచిస్తున్నాం. కోడింగ్ స్కిల్స్ ద్వారా విద్యార్థులకు లాజికల్ థింకింగ్, లాటరల్ థింకింగ్ వస్తుంది. రేపు వాళ్లు ఆవిష్కరణలు చేస్తారు. ఇన్నొవేటర్స్ అవుతారు' అని వివరించారు.

ఎన్ని తరాలు ఆటోలు తోలుతూ బతకాలి?

'పేదల పిల్లలు ఎందుకు ఆంగ్లం నేర్చుకోకూడదు? వాళ్లు ఎంతసేపూ ఆటోలు తోలుకుంటూనే కూర్చోవాలా? కూలీ తల్లి కుటుంబంలో మళ్లీ కూలీగానే పుట్టాలా? ఎన్ని రోజులు చేయాలి? ఎన్ని తరాలని చేయాలి? ఇంగ్లిష్ చాలా ముఖ్యమైన భాష. ఒక స్టేటస్' అని తెలిపారు.

ఇంగ్లిష్ మీడియంలో చదవనందుకు చాలా కష్టాలు పడ్డా

'ఇంగ్లిష్ మీడియంలో చదవనందుకు నేను చాలా కష్టాలు పడ్డాను. బహుజన వర్గాల నుంచి వచ్చిన బిడ్డగా.. ఇంగ్లిష్ మీడియంలో విద్య లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడ్డాను. యూనివర్సిటీ విద్యలో చాలా స్ట్రగుల్ అయ్యాను. అనుభవపూర్వకంగా ఈ మాటలు చెబుతున్నా. రాజకీయాలను పక్కన పెడితే అన్ని పార్టీలూ మాతృ భాషతో పాటు ఇంగ్లిష్‌ను కూడా ప్రమోట్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది చాలా ముఖ్యమైన అంశం' అని ప్రవీణ్‌కుమార్ స్పష్టంచేశారు.

కాంగ్రెస్ గెలిస్తే దళారీ రాజ్యమే

- నా అంత కాలం పనిచేసిన తెలుగు సీఎం ఎవరూ లేరు
- తెలంగాణ సీఎం కేసీఆర్
- జగిత్యాల, వేములవాడ, ఖానాపూర్ ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ఖానాపూర్: ''నాకు తెలంగాణ తీసుకువచ్చిన ఘనతే ఆకాశమంత పెద్దది. దానికి మించిన పదవి ఉందా? రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన. 10 ఏళ్ల సీఎంగా ఉన్నా. ఇక్కడ నా కంటే ఎక్కువకాలం పదవిలో ఉన్న సీఎం ఉన్నడా? 70 ఏళ్ల వయసు వచ్చింది. ఇంతకంటే జీవితంలో ఇంకేం కావాలి? పేదరికం లేని తెలంగాణే నా పంతం'' అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు వ్యాఖ్యానించారు. కేరళ తరహాలో వందశాతం అక్షరాస్యత, నిరంతరం తాగునీరు, ప్రతీ ఇంచుకు సాగునీరు రావాలనేదే తన లక్ష్యమని చెప్పారు. రైతాంగం గుండెల మీద చేతులు వేసుకుని నిద్రపోయే తెలంగాణ కావాలని.. దానికోసమే తాను తండ్లాడుతున్నానని, పదవి కోసం కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే దళారీ రాజ్యం వస్తుందని, తెలంగాణ ఆగమైపోతుందని వ్యాఖ్యానించారు. ఆదివారం జగిత్యాల, వేములవాడ, ఖానాపూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ వాళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నారని, ఎమర్జెన్సీలు, యువతను జైల్లో పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యమంటే? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలనగానే ఆగమాగం కావొద్దు. అభ్యర్థులు, పార్టీల చరిత్ర చూసి ఓటేయాలని ప్రజలకు సూచించారు.

సోమ, మంగళవారాల్లో అంతర్జాతీయ చిరుధాన్య సమ్మేళనం

ముఖ్య అతిథిగా గవర్నర్ తమిళిసై హాజరు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023 సందర్భంగా భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్)లోని న్యూట్రిహబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ చిరుధాన్యాల సమ్మేళనం ఈనెల 27, 28 తేదీల్లో నగరంలోని నోవాటెల్‌లో జరగనుంది. 'ప్రధాన జీవన ప్రవంతిలోకి తిరిగి చిరుధాన్యాలు–ఇప్పుడు-2023 తర్వాత' అనే అంశంపై ఈ సమ్మేళనం, సదస్సులు నిర్వహిస్తున్నారు. 19 దేశాలకు చెందిన వందలాది మంది ప్రతినిధులు, వ్యవసాయ, ఆహార, పోషకాహార శాస్త్రవేత్తలు, ప్రభుత్వాధికారులు, రైతు సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొంటారు. మిల్లెట్ ఆహారోత్పత్తుల ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. తెలంగాణ గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేయటం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించటం, సరికొత్త చిరుధాన్య ఆహారోత్పత్తులను పరిచయం చేయటం ప్రధాన లక్ష్యంగా ఈ రెండు రోజుల సమ్మేళనంలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఐఐఎంఆర్ డైరెక్టర్ తారా సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం, ఆహార భద్రతపై ఈ అంతర్జాతీయ సమ్మేళనంలో సమగ్ర ప్రణాళికను విడుదల చేయనున్నట్లు ఐఐఎంఆర్ న్యూట్రిహబ్ అధిపతి బి.దయాకరరావు వెల్లడించారు.

ఘనంగా గ్రేటర్ రాయలసీమ వనభోజన మహోత్సవం



నరేన్ గార్డెన్‌లో కార్తీక వనభోజనాలకు హాజరైన ప్రముఖులు

మియాపూర్: కార్తీకమాసం పురస్కరించుకుని మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి రాయలసీమకు చెందినవారు కుటుంబసమేతంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలలో పలువురు అలరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, హిమాచల్‌ప్రదేశ్ మాజీ చీఫ్ జస్టిస్ ఎంఎస్ రావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, రిటైర్డ్ జడ్జిలు జస్టిస్ రాజగోపాలరెడ్డి, జస్టిస్ శేషశయనారెడ్డి, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.కృష్ణమోహన్‌రెడ్డి, జస్టిస్ ఎం.రంగారావు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మిల్లెట్స్ మార్వెల్ ఫౌండర్ డాక్టర్ భరత్‌రెడ్డి, రిటైర్డ్ ఐజీ మురళీధర్‌రెడ్డి హాజరై రాయలసీమ గొప్పతనం, రాయలసీమలో పేరు ప్రఖ్యాతలు గాంచిన వ్యక్తుల గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు రాయలసీమరత్న బిరుదులను బహూకరించి ఘనంగా సత్కరించారు. బిరుదులు అందుకున్నవారిలో సహస్ర అవధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్సలర్ రాఘవరెడ్డి, శంకరనారాయణ, సాక్షి గ్రూపు ఫైనాన్స్ డైరెక్టర్ ఈశ్వరప్రసాద్‌రెడ్డి, సామాజిక కార్యకర్తలు చంద్రికాదేవి, మాకిరెడ్డి పురుషోత్తంరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

మంచిమాట

దానం ధర్మం

దానధర్మాలు ద్వంద్వ సమాసం. జంటగా కనపడతాయి. రెండూ ఒకటే అనుకుంటారు. ధర్మంలో దానం కూడా భాగం. దానం అంటే తన కున్నదానిని ఇతరులకు ఇవ్వటం. 'ద' అంటే ఇవ్వటం. ఆ ప్రక్రియ దానం. దానం, ధర్మం అనే రెండింటిని సమానార్థకాలుగా ఉపయోగిస్తూ ఉంటాం. అడుక్కునేవాడు "అయ్యా! ధర్మం చేయండి." అంటాడు. తనకున్న దానిని లేనివాడికి పంచటం ధర్మాచరణలో భాగం అని అర్థం చేసుకోవాలి. "నీ కిదేమైనా ధర్మంగా ఉందా?" అని అడిగి నప్పుడు ధర్మం అంటే న్యాయం అని అర్థం చేసుకోవాలి.



రసాయన శాస్త్రంలో ఉదజని ధర్మాలు అని అంటే దాని సహజగుణాలు అని అర్థం. ''సూర్యుడు తూర్పున ఉదయించును'' అన్నది ఏ కాలం అని వ్యాకరణంలో అడిగినప్పుడు తద్ధర్మ కాలం అని సమాధానం వస్తుంది. ఇక్కడ కర్తవ్యం, విధి, తప్పక చేయవలసినది అనే అర్థం. తన దగ్గర ఉన్న దానిని ఇతరులతో పంచుకోవటం ధర్మంలో భాగం కనుక దానానికి పర్యాయ పదంగా ధర్మం అని అనటం జరుగుతోంది.

దానం ఇచ్చేటప్పుడు ఎట్లా ఇవ్వాలో పెద్దలు మనకి చెప్పారు. ''శ్రియా దేయం హ్రియా దేయం, సంవిదా దేయం'' అని. తన దగ్గర ఉన్న సంపదకి తగినట్టుగా ఇవ్వాలట. ఒక కోటీశ్వరుడు ఒక రూపాయి దానం చేస్తే ఎంత సిగ్గుచేటు? వంద సంపాదించే రోజుకూలీ రూపాయి ఇస్తే పరవాలేదు కాని యాభై ఇస్తే తన తాహతుకి మించింది. తరవాత కష్టపడతాడు. సిగ్గుపడుతూ ఇవ్వాలట. ఇంతకన్న ఇవ్వలేక పోతున్నాను అని. తానే సిగ్గు పడుతూ ఉంటే తీసుకున్నవారు ఇంకెంత సిగ్గుపడాలో! తెలిసి ఇవ్వాలట. ''గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం'' అన్నట్టు కాకుండా మన చేతిలో నుండి జారిపోయింది దానం అనుకోకూడదు. ఇస్తున్నాను అని ఎరిగి ఇవ్వాలట. ఎవరికి ఇచ్చేది కూడా తెలిసి ఉండాలి. అంతా అయినాక వీళ్ళకా నేను ఇచ్చింది అని, ఇంత ఎందుకు ఇచ్చాను అని బాధపడకూడదు.

> భారతీయ సంస్కృతిలో ధర్మానికి పెద్ద పీట వేశారు. ధర్మమే మనలను ఎల్లప్పుడు కాపాడుతుంది. మనం చాలా శతాబ్దాలు విదేశీయుల పాలనలో మగ్గిపోయాము. కాని ముష్కరులు మన ధర్మం మీద దెబ్బతీయలేక పోయారు. ధర్మగ్లాని దశలో మనం ఉన్నప్పుడు సాధుసంతులు, మహాత్ములు ఉక్కుగోడలా నిల్చొని ధర్మాన్ని కాపాడారు. అదే సమయంలో కొన్ని దేశాలు, సంస్కృతులు విదేశీయుల ఆక్రమణల కారణంగా నామరూపాలు లేకుండా పోయాయి. మనకు ఇతరులు ఏమి చేయకూడదనుకుంటామో అది ఇతరులకు మనం చేయక పోవడం సర్వోత్తమ ధర్మం. మన ప్రాచీన ద్రష్టలైన మునులు లోక కళ్యాణం కొరకు నిర్వచించిన ధర్మం, దాని ఆచరణ మనకు వారసత్వంగా ఒక తరం నుంచి ముందు తరానికి వస్తూ మన తరం వరకు వచ్చింది. అంటే ధర్మచక్రం ఏ తరంలోనూ ఆగిపోలేదు. ఈ తరంలో ఆగిపోతే తరువాత తరం వారు ధర్మ భ్రష్టులవుతారు. ధర్మచక్రం ఆగిపోతే ఈ జాతి మనుగడ ఉండదు.

దానాలు చాలా కారణాలుగా, చాలా రకాలుగా చేస్తూ ఉంటారు. గ్రహదోషాలు ఉన్నాయి అంటే జపాలు తాము చేయలేరు కనుక ఎవరి చేతనైనా చేయిస్తారు. ఆ గ్రహానికి సంబంధించి కొన్ని వస్తువులు, ధనం దానం చేస్తారు. ఇది ప్రతిఫలాపేక్షతో చేసేది. ఒక రకమైన వ్యాపారం అని కొంతమంది వ్యాఖ్యానిస్తూ ఉంటారు. కొంతమంది ఆడంబరం కోసం దానాలు చేస్తూ ఉంటారు. తాము చేసిన దానిని ప్రకటించటం, ప్రచారం చేసుకోవటం, ఫోటోలు తీయించుకుని వార్తా పత్రికలలో వేయించుకుంటూ ఉండటం చూస్తాం. తీసుకున్న వారిని చులకనగా చూస్తూ తమకు కృతజ్ఞులై ఉండాలని ఆశించటం కనపడుతుంది. కొద్ది మంది ఎదుటి వారి అవసరం ఎరిగి అడగకుండానే దానం చేస్తూ ఉంటారు. వీళ్ళకి ఎటువంటి ప్రతిఫలాపేక్ష ఉండదు. పైగా ఎవరికీ చెప్పనీయరు. కుడి చేత్తో చేసినది ఎడమ చేతికి తెలియ కూడదట. ఎందుకు దానం చేశావు అంటే నా దగ్గర ఉన్నది, వాళ్ళ దగ్గర లేదు... అంటారు. తీసుకున్నవారు సంతోషించినప్పుడు ఆ భావ తరంగాలు ఇచ్చిన వారిని స్పృశిస్తాయి. వీరిని ఆవరించి ఉన్న ప్రతికూల తరంగాలు తప్పుకుంటాయి. ఇవ్వటానికి మా దగ్గర ఏముంది? అని సన్నాయి నొక్కులు నొక్కుతారు కొందరు. తథాస్తు దేవతలుంటారు. తస్మాత్ జాగ్రత్త! ఏమీ లేక పోవుట ఏమి? ధనం మాత్రమేనా ఇవ్వదగినది? జ్ఞానం, శరీరం, ఆలోచన, మాట .. ఇట్లా ఎన్నో! తన జ్ఞానాన్ని పంచవచ్చు. జ్ఞానం లేకపోతే శరీరంతో సేవ చేసి సహాయ పడవచ్చు. అదీ చేత కాకపోతే మాట సహాయం చేసి సేద తీర్చవచ్చు. ఇది ధర్మమే కదా! ఈ ధర్మాన్ని పరిరక్షించుకుంటూ ఉండాలి. అప్పుడు ఆ ధర్మమే మనల్ని కాపాడుతుంది.

– డా. ఎన్.అనంతలక్ష్మి

వాగ్గేయకార వైభవం

గురు వాక్యస్య... !!!



వాగ్గేయకారులలో గమనించవలసిన ఒక గొప్ప లక్షణం– వారిలోని గురు భక్తిని. అది లేకుండా సనాతన ధర్మంలో ఏ వ్యక్తీ పరిఢవిల్లలేదు. పుస్తకజ్ఞానం ఎంత ఉన్నా గురుముఖతః నేర్చుకున్నదేదో అది మాత్రమే అభ్యున్నతికి కారణమవుతుంది. 'శ్రద్ధ' అని మనకు ఒక మాట ఉంది. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం– అంటారు గీతాచార్యులు. ఆ శ్రద్ధ ఎవరికి ఉన్నదో వారికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది–అని. శ్రద్ధ అన్న మాటకు శంకరభగవత్పాదులు వ్యాఖ్యానం చేస్తూ.. ''శాస్త్రస్య గురువాక్యస్య సత్య బుద్ధ్యవధారణమ్' సాశ్రద్ధా కథితా సద్భిర్యాయా వస్తూపలభ్యతే''.. అంటారు.

శాస్త్రం చెప్పిన విషయం తిరుగులేని సత్యం... అన్న నమ్మకం ఉండాలి. కలడుకలండనెడువాడు కలడో లేడో...' అన్న అనుమానం దగ్గరే ఉండిపోకుండా 'భగవంతుడు ఉన్నాడు. శాస్త్రం చెప్పిన విషయం పరమ సత్యం..అని నమ్మాలి. ఆ పైన గురువాక్యస్య.. అంటే గురువుగారి నోటివెంట ఏది వచ్చిందో అది సత్యం. గురువుగారి నోటి వెంట వచ్చినది సత్యమయ్యేట్లు చూడవలసిన కర్తవ్యం భగవంతుడు తీసుకుంటాడు. అందుకే యోగి వాక్కు అంటారు.

యోగి వాక్కు అంటే – గురువుగారు సత్యం చెప్పారు.. అని కాదు .. గురువుగారు చెప్పినది సత్యం... అని అన్వయం చేసుకోవాలి. అంటే అంత తిరుగులేని విశ్వాసం ఉండాలి. అందుకే గురు విషయంలో స్థాన శుశ్రూష అంటారు. మనం ఉంటున్న ఇంటిని, మనం కొలిచే దేవుడు ఉండే దేవాలయాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో అలా గురువుగారుండే ప్రదేశాన్ని కూడా శిష్యులు శుభ్రం చేస్తూ గురువుగారికి సౌకర్యంగా ఉండేటట్లు చూస్తుంటారు.

ఈ కంటితో చూడలేని పరబ్రహ్మం సశరీరంతో... అంటే మనలాగా కాళ్ళూచేతులతో, ఇతరత్రా మనలాగే నడిచివెడితే అదే గురువు. 'గురుబ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురువేనమః'–అని. గురువే బ్రహ్మ. గురువు మనలోని జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు. అందుకని సృష్టికర్త. గురుర్విష్ణుః..అంటే శ్రీమహావిష్ణువు స్థితికారుడై ఏ విధంగా ఈ సృష్టినంతటినీ నిలబెడుతున్నాడో అలా జ్ఞానాన్ని, భక్తిని పతనం కాకుండా గురువు కాపాడుతుంటాడు. అందుకని విష్ణువు. గురుర్దేవో మహేశ్వరః.. మహేశ్వరుడు ఎలా లయకారుడో అట్లా అజ్ఞానాన్ని గురువు లయం చేసి జ్ఞానాన్ని ఇచ్చి నిలబెడుతుంటాడు. అందుకే గురువు పరబ్రహ్మము. అటువంటి గురువుకు... తస్మైశ్రీగురవేనమః. ... నమస్కరించుచున్నాను.

ఈ లోకంలో గురువుగారికి ప్రత్యుపకారం చేయడం కానీ, గురువుగారిని సత్కరించడం కానీ, గురువుగారికి మనం పదేపదే కృతజ్ఞతలు చెప్పడం కానీ సాధ్యమయ్యే విషయం కాదు. కాబట్టి గురువు విషయంలో కృతజ్ఞతగా చెయ్యగలిగినది ఒక్కటే– రెండు చేతులు కలిపి జోడించి శిరస్సు తాటించి నమస్కరించడం మాత్రమే. అది గురువుపట్ల చెదరిపోని నమ్మకంతో చేయాలి.. అది వాగ్గేయకారులందరూ చేశారు. కాబట్టే మహాత్ములయ్యారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

పని ఒకటే... పాపాలు ఐదు..

ఒక సమయంలో బుద్ధుడు రాజగృహానికి వచ్చి, జీవకుని మామిడి తోటలో ఉంటున్నాడు. అది వేసవికాలం కావడంతో ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ ఆ తోటలో చల్లగానే ఉంటుంది. చెట్లన్నీ మామిడిపండ్లతో నిండుగా ఉన్నాయి. బుద్ధుడు అక్కడ ఉన్నాడని తెలిసి ఎందరెందరో అక్కడికి వచ్చి చేరేవారు. బుద్ధుని ప్రసంగాలు వింటూ ఉండేవారు.

భిక్షువులు ఉదయం పొద్దు బాగా పైకెక్కాక నగరంలో భిక్షకు వెళ్ళేవారు. మధ్యాహ్నం వేళకు ముందే తిరిగి వచ్చేవారు. మామిడి చెట్ల కింద చేరి తమ తమ అనుభవాలను చర్చించుకుంటూ ఉండేవారు. ఆ రోజు... ఇద్దరు భిక్షువులు తీసుకున్న భిక్ష మీద చర్చ జరిగింది. వారు భిక్షకు వెళ్ళినప్పుడు ఆ ఇంటి వారు ఆరోజు మాంసాహారం మాత్రమే వండుకున్నారు. అదే వారికి భిక్షగా వేశారు. ఆ ఇద్దరూ భిక్షను స్వీకరించారు. కానీ, వారిలో ఒకరు మాత్రమే దాన్ని తిన్నారు. రెండోవారు దాన్ని తెచ్చి కూరను జంతువులకు వేసి, ఉత్త చప్పిడి అన్నాన్నే భుజించాడు. మాంసాహార విషయంలో బుద్ధుడు అనేక నియమాలు పెట్టాడు. భిక్షువులు కూర్చొని భిక్ష విషయాలు మాట్లాడుకోవడం జీవకుడు విన్నాడు. బుద్ధుడు చెప్పిన పంచశీలలో మొదటిదే జీవహింస విషయం.



ఆ విషయం జీవకునికి బాగానే తెలుసు. జీవకుడు మెల్లగా బుద్ధుని దగ్గరకు వెళ్ళాడు. బుద్ధుడు ఆరామం ముందున్న పెద్ద మామిడి చెట్టు కింది అరుగు మీద కూర్చొని ఉన్నాడు. జీవకుడు వెళ్ళి నమస్కరించాడు.

''జీవకా! అలా కూర్చో'' అన్నాడు బుద్ధుడు. జీవకుడు కూర్చొన్నాడు. తాను విన్న భిక్షువుల సంభాషణలు చెప్పాడు. ''జీవకా! జీవహింసకు పాల్పడే వారికి అపుణ్యం (పాపం) ఐదుచోట్ల కలుగుతుంది. ''చంపడం కోసం.. అదిగో ఆ ప్రాణిని తీసుకొని రండి'' అని ఆదేశించినప్పుడు మొదటి పాపం తగులుతుంది. ఆ ప్రాణిని చంపడానికి దాని మెడకు తాడు వేసి వధించే చోటుకు లాక్కొని తీసుకుపోతున్నప్పుడు ఆ జంతువు భయపడుతుంది. దుఃఖపడుతుంది. అప్పుడు ఆ యజమానికి రెండోసారి పాపం కలుగుతుంది.

''వెళ్ళి దాన్ని చంపు. వధించు'' అన్నప్పుడు ఆ యజమానికి మూడోసారి పాపం చుట్టుకుంటుంది. ఎందుకంటే.. ప్రాణభీతితో ఆ జంతువు అల్లాడిపోతుంది. భయంతో గింజుకుంటుంది. దుఃఖంతో విలవిల్లాడుతుంది. ఇక ఆ జంతువుని వధిస్తున్నప్పుడు అది మరింత రోదిస్తుంది. అప్పుడు నాలుగోసారి పాపం వచ్చిపడుతుంది. అలాంటి మాంసాన్ని ఇతరులకు పెట్టినప్పుడు, భిక్షగా వేసినప్పుడు ఐదోసారి ఎంతో అపుణ్యం అంటుకుంటుంది. జీవకా! తెలిసి, తన కోసమే వండిన ఈ ఆహారాన్ని తిన్న వారికి ఇంత కుమించిన అపుణ్యం కలుగుతుంది.'' అన్నాడు. ఒక్క జీవహింసలోనే కాదు.. ఏ చెడ్డ పనికైనా ఇలాంటి పాపాలు కలుగుతాయని తెలుసుకుని బుద్ధునికి వినమ్రంగా ప్రణమిల్లాడు జీవకుడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా


● విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

విదేశాలకు ఫ్యామిలీస్టార్

విదేశాలకు పయనం అవనున్నారు ఫ్యామిలీస్టార్. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా పరశురామ్ పెట్ల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఫ్యామిలీస్టార్'. ఈ సినిమా చిత్రీకరణ ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. విజయ్, మృణాల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో జరగనుందని తెలిసింది. నెల రోజులకుపైగా అక్కడి లొకేషన్స్‌లో జరిగే ఈ భారీ షెడ్యూల్‌తో ఈ సినిమా మేజర్ షూటింగ్ పూర్తి కానున్నట్లుగా తెలుస్తోంది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'ఫ్యామిలీస్టార్' తొలుత సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కావడం లేదని, మార్చిలో రిలీజ్ కానుందనే టాక్ లేటెస్ట్‌గా వినిపిస్తోంది. ఈ సినిమాలో రష్మికా మందన్నా ఓ అతిథి పాత్ర చేస్తున్నారని భోగట్టా. అయితే ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● కోన వెంకట్, అంజలి

గీతాంజలి మళ్లీ వస్తోంది

అంజలి టైటిల్ రోల్‌లో, 'సత్యం' రాజేష్, శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్రల్లో నటించిన హారర్ కామెడీ ఫిల్మ్ 'గీతాంజలి' (2014) హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో అంజలి, 'సత్యం' రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, 'షకలక' శంకర్ ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. 'నిన్నుకోరి', 'నిశ్శబ్దం' సినిమాలకు వర్క్ చేసిన కొరియోగ్రాఫర్ శివ తుర్లపాటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలపై ఎంవీవీ సత్యనారాయణ, జీవీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హైదరాబాద్, ఊటీ నేపథ్యాల్లో ఈ సినిమా కథనం సాగుతుంది. ''ఇప్పటి వరకు 80 శాతం చిత్రీకరణ పూర్తయింది. త్వరలో జరగనున్న ఊటీ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ పూర్తవుతుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

హైదరాబాద్‌లో వైజాగ్


● వరుణ్ తేజ్

యాక్షన్ మోడ్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు హీరో వరుణ్ తేజ్. 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కనున్న యాక్షన్ ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించనున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబరులో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌కి సంబంధించిన పనులతో బిజీగా ఉన్నారు చిత్రయూనిట్. ''దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఓ వాస్తవ ఘటన ఆధారంగా వైజాగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుంది. 24 ఏళ్ల వ్యవధిలో (1958 –1982) జరిగే ఈ సినిమాలో వరుణ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారు. 1950, 1980 నాటి వాతావరణాన్ని తలపించేలా భారీ సెట్స్‌ను రూపొందిస్తున్నాం. హైదరాబాద్‌లో ఓల్డ్ వైజాగ్ సిటీని క్రియేట్ చేసేందుకు ఓ భారీ సెట్‌ను నిర్మిస్తున్నాం. ఈ సినిమాకు నలుగురు ఫైట్ మాస్టర్స్ వర్క్ చేస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.

రెండు ప్రపంచాలు


● తిరువీర్

'జార్జిరెడ్డి', 'పలాస', 'మసూద' వంటి చిత్రాల్లో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన నటుడు తిరువీర్ మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దృష్టి తల్వార్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు. డార్క్ కామెడీ జానర్‌లో ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాకు రాజ్ విరాట్ దర్శకత్వం వహించనున్నారు. ఏ మూన్‌షైన్ పిక్చర్స్‌పై సాయి మహేష్ చందు, సాయి శశాంక్ నిర్మించనున్న ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. ''రెండు వేర్వేరు ప్రపంచాల కలయికగా, యూనిక్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుంది. వినోదాత్మక చిత్రంగా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: లియోన్ జేమ్స్.

కాంబినేషన్ కుదిరిందా?


● అజిత్

హీరో అజిత్ ప్రస్తుతం 'విడాముయార్చి' సినిమాతో బిజీగా ఉన్నారు. మగిళ్ తిరుమేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా తాజా షెడ్యూల్ అజర్‌బైజాన్‌లో పూర్తయిందని కోలీవుడ్ టాక్. అయితే అజిత్ తెలుగులో ఓ సినిమా కోసం రెడీ అవుతున్నారని, మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందనే టాక్ తెరపైకి వచ్చింది. అంతే కాదు.. ఈ సినిమాకు దర్శకుడిగా గోపీచంద్ మలినేని పేరు అనుకుంటున్నారట. మరి.. అజిత్, గోపీచంద్ మలినేని కాంబినేషన్ కుదిరిందా? లేదా? అన్నది తెలియాలంటే మరికొంత సమయం వేచి చూడాలి.

వీకే నరేష్‌కి డాక్టరేట్ ప్రదానం


● డాక్టరేట్ అందుకుంటున్న వీకే నరేష్

నటుడు వీకే నరేష్‌కి అరుదైన గౌరవం దక్కింది. ఐక్య రాజ్య సమితి అనుబంధ సంస్థ అయిన 'ఐఎస్ సీఏహెచ్ ఆర్' నుంచి ఆయన 'సార్' అనే బిరుదుతో పాటు డాక్టరేట్‌ని అందుకున్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో తాజాగా జరిగిన 5వ ప్రపంచ కాంగ్రెస్ సమావేశాల్లో వీకే నరేష్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ సమావేశాలను 'నేషనల్ అకాడమీ ఆఫ్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్' సంస్థతో పాటు 'ఇంటర్నేషనల్ స్పెషల్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ అండ్ హ్యూమన్ రైట్స్ (ఐఎస్ సీఏహెచ్ఆర్)' కలిసి నిర్వహించాయి. ఐఎస్ సీఏహెచ్ఆర్ సంస్థ ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ. ఇది నాటో, యూరోపియన్ యూనియన్, అమెరికా వంటి దేశాల గుర్తింపు ఉన్న సంస్థ కూడా.. అక్కడ నరేష్‌కు మరో గౌరవం దక్కింది. మిలటరీ ఆర్ట్స్ గుడ్‌విల్ అంబాసిడర్‌తో పాటు లెఫ్టినెంట్ కల్నల్‌గా ఆయన్ను నియమించినట్లు సన్నిహితులు తెలిపారు. ఇకపై నరేష్ పేరు ముందు లెఫ్టినెంట్ కల్నల్, సార్... అనే హోదా చేరుతుంది. ఉగ్రవాదం, సామాజిక సమస్యలు వంటి అంశాలపై అనేక అంతర్జాతీయ వేదికలపై నరేష్ ప్రసంగించినందుకు గుర్తింపుగా ఈ గౌరవాలు దక్కాయి.

మళ్లీ కలసి పనిచేస్తాం - చైతన్య కృష్ణ


● వైదిక, చైతన్య కృష్ణ, జయకృష్ణ, వంశీకృష్ణ

''మంచి సందేశంతో సమాజానికి అవసరమైన కథ 'బ్రీత్'. వంశీకృష్ణగారు అన్ని విషయాల్లో జాగ్రత్త తీసుకొని ఈ సినిమాని తీర్చిదిద్దారు.. భవిష్యత్‌లో మేము మళ్లీ కలసి పనిచేస్తాం. ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని హీరో చైతన్య కృష్ణ అన్నారు. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వంలో చైతన్య కృష్ణ, వైదిక సెంజలియా జంటగా నటించిన చిత్రం 'బ్రీత్'. బసవతారకరామ క్రియేషన్స్‌పై నందమూరి జయకృష్ణ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నందమూరి జయకృష్ణ మాట్లాడుతూ–''బ్రీత్' మంచి ఎమోషనల్ థ్రిల్లర్. సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''చైతన్య కృష్ణ కోసం అన్ని కమర్షియల్ అంశాలతో కూడిన, ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని అద్భుతమైన కథని రెడీ చేశాను. 'బ్రీత్' సక్సెస్ తర్వాత అది కూడా చేయాలనేది నా ఆకాంక్ష'' అన్నారు వంశీకృష్ణ ఆకెళ్ల. ఈ వేడుకలో వైదిక సెంజలియా, నందమూరి రామకృష్ణ, నందమూరి మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరువునష్టం దావా వేస్తా - మన్సూర్ అలీఖాన్

ప్రముఖ హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిషలపై పరువునష్టం దావా వేయనున్నట్లు నటుడు మన్సూర్ అలీఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. ''నేను ఈనెల 11వ తేదీన త్రిష గురించి మీడియా ముందు మాట్లాడితే ఆ వీడియోను కొన్ని దుష్టశక్తులు ఎడిట్ చేసి తప్పుగా ప్రసారం చేశాయి. సినిమా, రాజకీయాల పరంగా నన్ను దెబ్బ కొట్టాలనే కుట్రలో భాగంగానే ఇది జరిగింది. ఈ విషయంలో నన్ను విమర్శించిన నటుడు చిరంజీవి, నటి త్రిషపై నా న్యాయవాది ద్వారా చెన్నై హైకోర్టులో పరువు నష్టం దావా వేయనున్నాను'' అంటూ పేర్కొన్నారు. కాగా త్రిషపై ఇటీవల మన్సూర్ అలీఖాన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

– సాక్షి, చెన్నై.

నవ్వులే నవ్వులు


● చంద్రశేఖర్

చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి, అశోక్ వర్ధన్, యాదమ్మ రాజు, అప్పారావు, బేబీ ప్రేక్షిత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ప్లాంట్ మ్యాన్'. కె.సంతోష్ బాబు దర్శకత్వం వహించారు. డీఎం యూనివర్సల్ స్టూడియోస్‌పై పన్నా రాయల్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్‌లో విడుదలకానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. పన్నా రాయల్ మాట్లాడుతూ–''కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'ప్లాంట్ మ్యాన్'. ప్రారంభం నుంచి చక్కని వినోదం ఉంటుంది. ఒక కొత్త అంశం కూడా ఉంది.. అందుకే ఈ సినిమాకి 'ప్లాంట్ మ్యాన్' అనే టైటిల్ నిర్ణయించాం. ఈ చిత్రం తర్వాత కూడా మా బేనర్‌లో కొత్తవారిని పరిచయం చేస్తూ సినిమాలు నిర్మిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పీఎస్. మణికర్ణన్, నేపథ్య సంగీతం: వినోద్ యాజమాన్య, సంగీతం: ఆనంద బాలాజీ, నిర్మాత–దర్శకత్వ పర్యవేక్షణ: పన్నా రాయల్.



స్పానిష్ గోల్ఫ్ ఓపెన్ విజేత అదితి

భారత మహిళా స్టార్ గోల్ఫర్ అదితి అశోక్ ఈ ఏడాది తన ఖాతాలో రెండో టైటిల్‌ను జమ చేసుకుంది. లేడీస్ యూరోపియన్ టూర్‌లో భాగంగా ఆదివారం ముగిసిన స్పానిష్ ఓపెన్‌లో బెంగళూరుకు చెందిన అదితి విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో నిర్ణీత నాలుగు రౌండ్ల తర్వాత అదితి మొత్తం 271 షాట్లతో పార్ -17 స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ టోర్నీ కంటే ముందు అదితి కెన్యా ఓపెన్‌లోనూ టైటిల్‌ను సాధించింది. 2016లో ప్రొఫెషనల్‌గా మారిన 25 ఏళ్ల అదితి టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయింది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ 'హ్యాట్రిక్'



ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' నమోదు చేసింది. లుధియానాలో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి జట్టు 2-0తో నామ్‌ధారి ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. శ్రీనిధి జట్టు తరఫున కెప్టెన్ మునోజ్ (21వ ని.లో), జగ్‌దీప్ సింగ్ (24వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.

హ్యారీ బ్రూక్‌ను వదిలేసిన సన్‌రైజర్స్

- ముంబై ఇండియన్స్‌తో పాండ్యా
- ముంబై నుంచి బెంగళూరుకు గ్రీన్



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2024 సీజన్ కోసం ఆటగాళ్లను రిటెయిన్ (అట్టిపెట్టుకోవడం) చేసుకునే గడువు ఆదివారంతో ముగిసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో పాటు పలు జట్లు తమకు భారంగా అనిపించిన ఆటగాళ్లను విడుదల చేసి డిసెంబర్ 19న దుబాయ్‌లో జరిగే వేలం కార్యక్రమం కోసం డబ్బులు సమకూర్చుకున్నాయి. గత వేలంలో ఇంగ్లండ్ డాషింగ్ క్రికెటర్ హ్యారీ బ్రూక్‌ను రూ. 13 కోట్ల 25 లక్షలకు కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ జట్టు అతని ప్రదర్శన ఆశించినస్థాయిలో లేకపోవడంతో విడుదల చేసింది. బ్రూక్ 11 మ్యాచ్‌లు ఆడి కేవలం 190 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ జట్టు ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్), అకీల్ హోసీన్ (వెస్టిండీస్), దేశవాళీ క్రికెటర్లు సమర్థ్ వ్యాస్, వివ్రాంత్ శర్మ, కార్తీక్ త్యాగిలను కూడా విడుదల చేసింది. వేలం కోసం ప్రస్తుతం సన్‌రైజర్స్ వద్ద రూ. 34 కోట్లు ఉన్నాయి.

- గుజరాత్ టైటాన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా తన పాత జట్టు ముంబై ఇండియన్స్‌లోకి అధికారికంగా వచ్చాడు. ముంబై ఫ్రాంచైజీ రూ. 15 కోట్లు టైటాన్స్‌కు చెల్లించి పాండ్యాను తిరిగి తీసుకుంది. అంతేకాకుండా వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌పై రూ. 17 కోట్ల 50 లక్షలు వెచ్చించిన ముంబై అంతే మొత్తానికి అతడిని బెంగళూరు జట్టుకు బదిలీ చేసింది. ఆంధ్ర స్టార్ ప్లేయర్, భారత జట్టు సభ్యుడు కోన శ్రీకర్ భరత్‌తోపాటు ఒడియన్ స్మిత్, అల్జారి జోసెఫ్ (వెస్టిండీస్), దాసున్ షనక (శ్రీలంక)లను కూడా టైటాన్స్ వదులుకుంది.
- చెన్నై విజయవంతమైన సారథి ధోని, బెంగళూరు జట్టు స్టార్ కోహ్లి వచ్చే సీజన్‌లోనూ బరిలోకి దిగనున్నారు. కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన తెలుగు క్రికెటర్ అంబటి రాయుడును, ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను చెన్నై విడుదల చేసింది. ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ హాజల్‌వుడ్, లంక స్పిన్నర్ హసరంగలను బెంగళూరు వదులుకుంది.
- కోల్‌కతా నైట్‌రైడర్స్ షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్), ఉమేశ్ యాదవ్, శార్దుల్ ఠాకూర్ (భారత్), ఫెర్గూసన్, సౌతీ (న్యూజిలాండ్)లను విడుదల చేసింది.

భారత్ ధమాకా

- చెలరేగిన యశస్వి, ఇషాన్, రుతురాజ్
- ఆఖర్లో రింకూ సింగ్ మెరుపులు
- ఆస్ట్రేలియాపై 44 పరుగులతో టీమిండియా ఘనవిజయం
- గువాహటిలో రేపు మూడో టి20



ఇషాన్



యశస్వి జైస్వాల్

తిరువనంతపురం: స్వదేశంలో జరుగుతున్న టి20 సిరీస్‌లో భారత్ చెలరేగిపోతోంది. అంతగా అనుభవం లేని భారత జట్టు ఆస్ట్రేలియాలాంటి మేటి జట్టును అన్ని రంగాల్లో దెబ్బకొట్టి రెండో టి20లో 44 పరుగుల తేడాతో గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2-0తో ఆధిక్యంలో నిలిచింది. మూడో టి20 మ్యాచ్ గువాహటిలో మంగళవారం జరుగుతుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (25 బంతుల్లో 53; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), రుతురాజ్ గైక్వాడ్ (43 బంతుల్లో 58; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 52; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగారు. తర్వాత ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులు చేసి ఓడిపోయింది. స్టొయినిస్ (25 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ మాథ్యూ వేడ్ (23 బంతుల్లో 42 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారు. ప్రసిధ్ కృష్ణ, రవిబిష్ణోయ్ చెరో 3 వికెట్లు తీశారు.

ఆరంభం నుంచే ధనాధన్

మూడో ఓవర్ నుంచి యశస్వి మెరుపులు మొదలవడంతో భారత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. మ్యాక్స్‌వెల్ వేసిన ఆ ఓవర్లో యశస్వి 2 ఫోర్లు, రుతురాజ్ ఒక బౌండరీ బాదాడు. అబాట్ నాలుగో ఓవర్‌నైతే యశస్వి 4, 4, 4, 6, 6, 0లతో చితగ్గొట్టేశాడు. దీంతో 24 పరుగులు రాగా, 3.5 ఓవర్లో భారత్ 50 పరుగుల్ని దాటింది. ఇదే జోరులో యశస్వి 24 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాక నిష్క్రమించాడు. తర్వాత ఇషాన్ కిషన్ కూడా ధాటిగా ఆడటంతో ఓవర్‌కు 10 పైచిలుకు రన్‌రేట్‌తో భారత్ సాగిపోయింది. 9.5 ఓవర్లో భారత్ స్కోరు వందకు చేరింది. అదుపుతప్పిన బౌలింగ్‌తో మ్యాక్సీ 14వ ఓవర్లో ఏకంగా 9 బంతులేశాడు. ఇషాన్, గైక్వాడ్ చెరో సిక్సర్ బాది 23 పరుగులు పిండుకున్నారు. మరుసటి ఓవర్ తొలి బంతిని ఇషాన్ కిషన్ భారీ సిక్సర్ బాదడంతో 14.1వ ఓవర్లోనే జట్టు స్కోరు 150 పరుగుల్ని అధిగమించింది. 29 బంతుల్లో అర్ధసెంచరీ సాధించిన ఇషాన్‌ను 16వ ఓవర్లో స్టొయినిస్ అవుట్ చేశాడు. రెండు సిక్స్‌లు కొట్టిన కెప్టెన్ సూర్యకుమార్ (19) ఎక్కువసేపు నిలువలేదు. అడపాదడపా ధాటిని ప్రదర్శించిన రుతురాజ్ 39 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. డెత్ ఓవర్లలో రింకూ సింగ్ (9 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఆటతో రెచ్చిపోయాడు. అబాట్ 19వ ఓవర్లో 4, 1వైడ్, 0, 6, 4, 4, 6లతో ఏకంగా 25 పరుగులు సాధించాడు. ఆఖరి ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టిన రుతురాజ్ మరుసటి బంతికే అవుట్ కాగా, క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ (2 బంతుల్లో 7 నాటౌట్; 1 సిక్స్) భారీ షాట్ బాదడంతో 20 పరుగులు జతయ్యాయి.

కూల్చేసిన బిష్ణోయ్, ప్రసిధ్

కొండంత లక్ష్యం కరిగించేందుకు బరిలోకి దిగిన ఆసీస్ కాసేపు ధాటిగా ఆడింది. స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను దించగానే ప్రత్యర్థి పతనం ఆరంభమైంది. స్మిత్ (19), షార్ట్ (19), ఇన్‌గ్లిస్ (2), మ్యాక్స్‌వెల్ (12)లాంటి కీలక వికెట్లను 58 పరుగులకే కోల్పోయింది. స్టొయినిస్, టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు)ల పోరాటంతో స్కోరు 100 దాటింది. ఆఖరిదాకా కెప్టెన్ వేడ్ అజేయంగా నిలిచినా ప్రయోజనం లేకపోయింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) జంపా (బి) ఎలిస్ 53; రుతురాజ్ (సి) డేవిడ్ (బి) ఎలిస్ 58; ఇషాన్ (సి) ఎలిస్ (బి) స్టొయినిస్ 52; సూర్యకుమార్ (సి) స్టొయినిస్ (బి) ఎలిస్ 19; రింకూ సింగ్ (నాటౌట్) 31; తిలక్ వర్మ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235.** **వికెట్ల పతనం:** 1-77, 2-164, 3-189, 4-221. **బౌలింగ్:** స్టొయినిస్ 3-0-27-1, నాథన్ ఎలిస్ 4-0-45-3, మ్యాక్స్‌వెల్ 2-0-38-0, అబాట్ 3-0-56-0, జంపా 4-0-33-0, తన్వీర్ సంఘా 4-0-34-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్మిత్ (సి) యశస్వి (బి) ప్రసిధ్ 19; షార్ట్ (బి) బిష్ణోయ్ 19; ఇన్‌గ్లిస్ (సి) తిలక్ వర్మ (బి) బిష్ణోయ్ 2; మ్యాక్స్‌వెల్ (సి) యశస్వి (బి) అక్షర్ 12; స్టొయినిస్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 45; టిమ్ డేవిడ్ (సి) రుతురాజ్ (బి) బిష్ణోయ్ 37; వేడ్ (నాటౌట్) 42; అబాట్ (బి) ప్రసిధ్ 1; ఎలిస్ (బి) ప్రసిధ్ 1; జంపా (బి) అర్ష్‌దీప్ 1; సంఘా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1-35, 2-39, 3-53, 4-58, 5-139, 6-148, 7-149, 8-152, 9-155. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-46-1, ప్రసిధ్ కృష్ణ 4-0-41-3, రవి బిష్ణోయ్ 4-0-32-3, అక్షర్ పటేల్ 4-0-25-1, ముకేశ్ 4-0-43-1.

చాంపియన్ శ్రీవల్లి రష్మిక

కెరీర్‌లో తొలి ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన హైదరాబాద్ అమ్మాయి



సాక్షి, హైదరాబాద్: టోర్నీ టోర్నీకీ తన ఆటతీరును మెరుగుపర్చుకుంటున్న హైదరాబాద్ టెన్నిస్ యువతార భమిడిపాటి శ్రీవల్లి రష్మిక కెరీర్‌లో తొలి అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బెంగళూరులో ఆదివారం ముగిసిన మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో 21 ఏళ్ల రష్మిక చాంపియన్‌గా అవతరించింది. గంటా 59 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో రష్మిక 6-0, 4-6, 6-3తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్‌ను ఓడించింది. ప్రస్తుత జాతీయ చాంపియన్ రష్మిక ఈ మ్యాచ్‌లో 11 ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన రష్మికకు 3,935 డాలర్ల ప్రైజ్‌మనీతో పాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫలితంగా నేడు విడుదల చేసే మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో రష్మిక 181 స్థానాలు పురోగతి సాధించి 706వ ర్యాంక్ నుంచి 525వ ర్యాంక్‌కు చేరుకుంటుంది.

పోరాడి ఓడిన సాత్విక్-చిరాగ్ జోడీ

చైనా మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన భారత ద్వయం



షెన్‌జెన్ (చైనా): ఈ ఏడాది ఆరో టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. 71 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ 19-21, 21-18, 19-21తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న లియాంగ్ వె కెంగ్-వాంగ్ చాంగ్ (చైనా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. విజేతగా నిలిచిన లియాంగ్-వాంగ్ చాంగ్‌లకు 85,100 డాలర్ల (రూ.70 లక్షల 92 వేలు) ప్రైజ్‌మనీ, 11 వేల ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ సాత్విక్-చిరాగ్‌లకు 40,250 డాలర్ల (రూ. 33 లక్షల 54 వేలు) ప్రైజ్‌మనీ, 9350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ ఇండోనేసియా ఓపెన్, కొరియా ఓపెన్, స్విస్ ఓపెన్‌లలో టైటిల్స్ సాధించడంతోపాటు ఆసియా చాంపియన్‌షిప్‌లో, హాంగ్జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు గెలిచింది.

విజయంతో వెర్‌స్టాపెన్ ముగింపు



అబుదాబి: ఫార్ములావన్-2023 సీజన్‌ను ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ విజయంతో ముగించాడు. చివరిదైన 22వ రేసు అబుదాబి గ్రాండ్‌ప్రిలోనూ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్ రికార్డుస్థాయిలో 19 రేసుల్లో నెగ్గాడు. మరో రెండు రేసుల్లో పెరెజ్ (రెడ్‌బుల్), కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) ఒక రేసులో నెగ్గారు. అబుదాబి గ్రాండ్‌ప్రిని 'పోల్ పొజిషన్'తో ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 58 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంట 27 నిమిషాల 02.624 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కెరీర్‌లో 54వ గెలుపుతో వెర్‌స్టాపెన్ ఫార్ములావన్ చరిత్రలో అత్యధిక విజయాలు అందుకున్న డ్రైవర్ల జాబితాలో వెటెల్ (53)ను అధిగమించి మూడో స్థానానికి చేరుకున్నాడు. హామిల్టన్ (103), షుమాకర్ (91) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 5447 సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ సెంటర్ దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌బీఐ సర్కిళ్లలో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్(సీబీవో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 5447(రెగ్యులర్ ఖాళీలు-5,280, బ్యాక్‌లాగ్ ఖాళీలు-167).
» **ఎస్‌బీఐ సర్కిళ్లు:** అహ్మదాబాద్, అమరావతి, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, నార్త్ ఈస్టర్న్, హైదరాబాద్, జైపూర్, లక్నో, కోల్‌కతా, మహారాష్ట్ర, ముంబై మెట్రో, న్యూఢిల్లీ, తిరువనంతపురం.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. బ్యాంకింగ్ రంగంలో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.10.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.36,000 నుంచి రూ.63,840
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు,విజయవాడ,విశాఖపట్నం,హైదరాబాద్
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.12.2023.
» **వెబ్‌సైట్:** www.sbi.co.in

కర్నూలు జీజీహెచ్‌లో 370 పారామెడికల్ పోస్టులు

కర్నూలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 370
» **పోస్టులు:** ఆఫీస్ సబార్డినేట్స్, ఈఎంటీ, కంప్యూటర్ ప్రోగ్రామర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, ఫార్మసిస్ట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్‌తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కార్యాలయం, కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.11.2023.
» **వెబ్‌సైట్:** kurnool.ap.gov.in

ఒక్క పరీక్ష.. వేల కొలువులు!

» టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్‌తో ఐటీ, నాన్-ఐటీలో ఉద్యోగాలు
» 23 రంగాల్లో దాదాపు 1.6 లక్షల పోస్టులకు అవకాశం
» టీసీఎస్‌తోపాటు పలు ఎంఎన్‌సీలకు ప్రామాణికం ఈ పరీక్ష
» డిగ్రీ, పీజీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు

ఒకే ఒక్క పరీక్ష స్కోర్‌తో.. 23 రంగాల్లో లక్షన్నరకుపైగా కొలువులకు పోటీపడొచ్చు! ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్).. నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్(ఎన్‌క్యూటీ) పరీక్షను నిర్వహిస్తోంది!! ఈ పరీక్షలో మంచి స్కోర్ సాధిస్తే ఐటీ, నాన్ ఐటీలో చక్కటి కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. టీసీఎస్ ఎన్‌క్యూటీ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. డిసెంబర్ 9న పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. టీసీఎస్ ఎన్‌క్యూటీ వివరాలు, ప్రయోజనాలు, పరీక్షలో విజయానికి మార్గాలపై ప్రత్యేక కథనం...

జాబ్ ట్రెండ్స్



టీసీఎస్ సంస్థ ఆఫ్-క్యాంపస్ నియామకాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష.. టీసీఎస్ ఎన్‌క్యూటీ. ఈ పరీక్షను ఐటీ, బీఎఫ్ఎస్ఐ, కాగ్నిటివ్ టెస్ట్‌ల పేరుతో నిర్వహిస్తారు. దీన్ని టీసీఎస్ ఐయాన్ ఆధ్వర్యంలో ఆరేళ్ల క్రితం రూపకల్పన చేశారు. ప్రారంభంలో ఈ టెస్ట్ స్కోర్ టీసీఎస్‌లో ఉద్యోగాలకు మాత్రమే ప్రామాణికంగా నిలిచేది. ఇప్పుడు టీసీఎస్‌తోపాటు అనేక సంస్థలు ఎన్‌క్యూటీ స్కోర్ ఆధారంగా ఆఫ్ క్యాంపస్ నియామకాలు చేపడుతున్నాయి.

ఐటీ, నాన్-ఐటీ విభాగాలు

టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్ ఆధారంగా ఐటీతో పాటు నాన్-ఐటీ రంగాల్లోనూ కొలువులు సొంతం చేసుకునే అవకాశముంది. ఆయా సంస్థల్లో ఐటీ, నాన్-ఐటీ జాబ్స్ అందుబాటులో ఉన్నాయి. ఇలా మొత్తం 1.6 లక్షలకుపైగా ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం టీసీఎస్ ఎన్‌క్యూటీ ఆధారంగా లభిస్తోంది.

అర్హతలు

2018-2024 మధ్య కాలంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం /సెమిస్టర్‌లో ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రీ-ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రెండేళ్ల కంటే తక్కువ పని అనుభవం ఉన్న వారికి కూడా దరఖాస్తుకు అవకాశం ఉంది. **వయసు:** 30ఏళ్ల లోపు ఉండాలి.

రూ.లక్షల్లో వేతనాలు

టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్ ఆధారంగా కొలువులు సొంతం చేసుకున్న వారికి రూ.లక్షల్లో వార్షిక వేతనాలు లభిస్తున్నాయి. ఫ్రెషర్స్‌కు సగటున రూ. 8 లక్షలు, అనుభవం ఉన్న వారికి సగటున రూ.12 లక్షల వార్షిక వేతనం అందుతోంది.

ఎన్‌క్యూటీ మూడు విధాలుగా

టీసీఎస్ ఎన్‌క్యూటీని మూడు రకాలుగా నిర్వహిస్తారు. అవి.. ఎన్‌క్యూటీ-కాగ్నిటివ్, ఎన్‌క్యూటీ-ఐటీ, ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐ. అభ్యర్థులు తాము చేరాలనుకుంటున్న రంగాలకు అనుగుణంగా ఈ పరీక్షలను ఎంచుకోవచ్చు.

ఎన్‌క్యూటీ-కాగ్నిటివ్

ఎన్‌క్యూటీ కాగ్నిటివ్ పరీక్షను జనరల్ ఎబిలిటీ టెస్ట్‌గా పరిగణిస్తారు. ఈ టెస్ట్‌లో మూడు విభాగాలు.. న్యూమరికల్ ఎబిలిటీ (20 మార్కులు), వెర్బల్ ఎబిలిటీ (25 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ (20 మార్కులు)ల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇలా మొత్తం 65 మార్కులకు 105 నిమిషాల్లో పరీక్ష ఉంటుంది. కాగ్నిటివ్ టెస్ట్‌లోనే సైకోమెట్రిక్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా టీసీఎస్‌తోపాటు మరెన్నో సంస్థల్లో ఐటీ/బీపీఓ; ఐటీ/ప్రొడక్ట్ సర్వీస్, బీఎఫ్ఎస్ఐ రంగాల్లో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. ఆటోమోటివ్, ఈ-కామర్స్/ఇంటర్నెట్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, రిటైల్, టెలికం, మార్కెటింగ్ అండ్ అడ్వర్టయిజింగ్, ఎడ్-టెక్ వంటి రంగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ఎన్‌క్యూటీ-ఐటీ

ఐటీ సంస్థల్లో ఎంట్రీ లెవల్‌లో డెవలపర్, సిస్టమ్ ఇంజనీర్, ఐటీ అనలిస్ట్ వంటి ఉద్యోగాలకు మార్గంగా ఎన్‌క్యూటీ-ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) నిలుస్తుంది. ఈ పరీక్షను పార్ట్-ఎ (ఫౌండేషన్ సెక్షన్), పార్ట్-బి (అడ్వాన్స్‌డ్ సెక్షన్)లుగా నిర్వహిస్తారు. పార్ట్-ఎ ఫౌండేషన్ సెక్షన్‌లో న్యూమరికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 65 మార్కులకు 75 నిమిషాల్లో పరీక్ష నిర్వహిస్తారు. పార్ట్-బి అడ్వాన్స్‌డ్ సెక్షన్‌లో అడ్వాన్స్‌డ్ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, అడ్వాన్స్‌డ్ రీజనింగ్ ఎబిలిటీ, అడ్వాన్స్‌డ్ కోడింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. 95 మార్కులకు 90 నిమిషాల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. వీటితోపాటు సైకోమెట్రిక్ టెస్ట్ నిర్వహిస్తారు. అదే విధంగా మోటివేషన్ టెస్ట్ కూడా ఉంటుంది. ఈ పరీక్షకు కేటాయించిన సమయం 30 నిమిషాలు. ఇలా మొత్తం 2.15 గంటల వ్యవధిలో ఎన్‌క్యూటీ-ఐటీ పరీక్షను నిర్వహిస్తారు.

ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐ

బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఇన్సూరెన్స్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి అవకాశం కల్పించే పరీక్ష.. ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐ. ఇందులో స్కోర్ ఆధారంగా బీఎఫ్ఎస్ఐ సెక్టార్‌లో అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, అకౌంట్స్ ఆపరేషన్స్ ఆఫీసర్, డేటా అనలిస్ట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఆపరేషన్స్ అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, టెల్లర్, క్యాషియర్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐను కూడా పార్ట్-ఎ (కాగ్నిటివ్), పార్ట్-బి (బీఎఫ్ఐఎస్) పేరుతో రెండు విభాగాలుగా నిర్వహిస్తారు.

పార్ట్-ఎ కాగ్నిటివ్ టెస్ట్‌లో న్యూమరికల్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 65 మార్కులకు 75 నిమిషాల వ్యవధిలో పార్ట్-ఎ ఉంటుంది. పార్ట్-బి (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, అండ్ ఇన్సూరెన్స్)లో కంప్యూటర్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అవేర్‌నెస్, ఇన్సూరెన్స్ అండ్ ఎకానమీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. 75 మార్కులకు 75 నిమిషాల్లో పరీక్ష నిర్వహిస్తారు. దీంతోపాటు సైకోమెట్రిక్ టెస్ట్ కూడా ఉంటుంది.

స్కోర్‌కు రెండేళ్ల గుర్తింపు

టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్‌కు రెండేళ్ల గుర్తింపు ఉంటుంది. అభ్యర్థులు ఎన్నిసార్లైనా ఈ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. ఒకసారి స్కోర్ తక్కువ వచ్చినా..దానిని మెరుగుపరచుకునేందుకు మరోసారి ఎన్‌క్యూటీకి హాజరవ్వచ్చు. ఇలా అభ్యర్థులు నిర్దిష్ట వయో పరిమితిలోపు ఎన్నిసార్లైనా పరీక్షకు హాజరై తమ స్కోర్‌ను పెంచుకునే అవకాశం ఉంది.

ఎన్‌క్యూటీ, ఐయాన్‌లలో జాబ్స్‌కు దరఖాస్తు

టీసీఎస్ ఎన్‌క్యూటీలో స్కోర్ పొందిన అభ్యర్థులు దాని ఆధారంగా టీసీఎస్ ఎన్‌క్యూటీ వెబ్‌సైట్, టీసీఎస్ ఐయాన్ వెబ్‌సైట్లలో లాగిన్ అయి.. వాటిలో రిజిస్టర్ చేసుకున్న సంస్థలు-ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. టీసీఎస్ ఎన్‌క్యూటీ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న సంస్థలు ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో ఈ స్కోర్ వివరాలను అడుగుతాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:నవంబర్27,2023
- ఎన్‌క్యూటీ పరీక్షతేదీ: డిసెంబర్ 9, 2023
- పరీక్ష కేంద్రాలు: టీసీఎస్ ఐయాన్ సెంటర్లు
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://learning.tcsionhub.in/hub/nationalqualifiertest

మంచి స్కోర్‌కు మార్గమిదే

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో ఫ్రాక్షన్స్, ప్రాబబిలిటీ, సిరీస్ అండ్ ప్రోగ్రెషన్స్, యావరేజెస్, ఈక్వేషన్స్, ఏరియా, స్పేస్, పెరిమీటర్, రేషియోస్, ప్రాఫిట్ అండ్ లాస్, వర్క్ అండ్ టైమ్, టైమ్ అండ్ డిస్టెన్స్, జామెట్రీ, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, నంబర్ సిస్టమ్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎం, పర్సంటేజెస్ వంటి ప్యూర్ మ్యాథ్స్, అర్థమెటిక్‌కు సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. 12వ తరగతి స్థాయిలో ప్యూర్ మ్యాథ్స్, అర్థమెటిక్ పుస్తకాలు అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

వెర్బల్ ఎబిలిటీ

యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ది ఎర్రర్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, క్లోజ్ టెస్ట్, వెర్బల్ అనాలజీస్, సెంటెన్స్ కరెక్షన్, పేరా రైటింగ్, కాంప్రహెన్షన్, ఇడియమ్స్, ఫ్రేజెస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఇంగ్లిష్ గ్రామర్‌పై పదో తరగతి స్థాయిలో అవగాహన పొందాలి.

రీజనింగ్ ఎబిలిటీ

ఈ విభాగంలో కోడింగ్, డీ కోడింగ్, స్టేట్‌మెంట్స్ అండ్ ఆర్గ్యుమెంట్స్, బ్లడ్ రిలేషన్స్, అనాలజీ, సిరీస్, పజిల్స్, లెటర్ సిరీస్, వెన్ డయాగ్రమ్స్, విజువల్ రీజనింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

అడ్వాన్స్‌డ్ కోడింగ్

ఎన్‌క్యూటీ-ఐటీ పరీక్షలో ఉండే ఈ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా సి, సి++, జావా, పైథాన్ వంటి లాంగ్వేజ్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్

ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐలో ఉండే ఈ విభాగంలో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేందుకు బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలు, ఆర్థిక వ్యవస్థలో మార్పులు,నూతన ఆర్థిక విధానాలు,ఆర్‌బీఐ విధానాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

ఇన్సూరెన్స్ అండ్ ఎకానమీ

ఎన్‌క్యూటీ-బీఎఫ్ఎస్ఐలోనే మరో విభాగంగా ఉండే ఇన్సూరెన్స్ అండ్ ఎకానమీల కోసం ఇన్సూరెన్స్ రంగంలో నూతన పరిణామాలు, ఇన్సూరెన్స్‌లు-రకాలు, ఐఆర్‌డీఏ, ఆర్థిక వ్యవస్థలో తాజా పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
48	8
65,970	19,794

విదేశీ సూచీలు

నాస్‌డాక్	14,251	▽	15
డోజోన్స్	35,390	△	117
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,488	△	5
డాక్స్	16,029	△	35
షాంఘై	3,041	▽	21
నికాయ్	33,626	△	181

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.59	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.86	106.22
€	యూరో	ఎస్‌బీఐ	89.39	95.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	54.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.53	12.61



- అవసరాలకు తగిన కార్డే తీసుకోవాలి
- కార్డులు ఎన్ని ఉన్నా.. సకాలంలో చెల్లింపులు
- వినియోగం 50 శాతం మించకూడదు
- చెల్లింపుల్లో వైఫల్యం మంచిది కాదు
- నియమాలు, షరతులు తెలిసి ఉండాలి

కార్డులు ఎక్కువైతే చిక్కులేనా..?

ఆరాధన (31) ఐటీ ఉద్యోగి. ప్రయాణాలంటే ఆమెకు ఎంతో ఇష్టం. వీలు చిక్కినప్పుడల్లా ఏదో ఒక పర్యటనకు సిద్ధమైపోతుంది. ఇటీవల ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లిన సందర్భంలో క్రెడిట్ కార్డ్ కంపెనీ సేల్స్ ఉద్యోగి ఆమెకు ఎదురుపడ్డాడు. మంచి ఫీచర్స్‌తో కూడిన క్రెడిట్ కార్డ్ అంటూ.. అందులోని ఉపయోగాలు చదివి వినిపించే ప్రయత్నం చేశాడు. నిజానికి క్రెడిట్ కార్డ్ తీసుకోవాలన్న ఆసక్తి ఆరాధ్యకు ఎంతమాత్రం లేదు. కానీ, ఎలాంటి జాయినింగ్ ఫీజు లేదని, దేశీయంగా ప్రీమియం ఎకానమీ విమాన టికెట్ల కొనుగోలుపై మూడు రెట్లు అధికంగా రివార్డు పాయింట్లు ఆఫర్ చేస్తుందని చెప్పగా, ఆ పాయింట్ ఆమెకు ఎంతో నచ్చింది. దీనికితోడు షాపింగ్ చేసిన ప్రతి సందర్భంలో సాధారణ రివార్డ్ పాయింట్లు వస్తాయని చెప్పాడు. దీంతో అప్లికేషన్‌పై సంతకం చేసి ఇచ్చేసింది. కార్డు చేతికి వచ్చిన ఏడాది తర్వాత కానీ, వాస్తవాలు ఆమెకు తెలియలేదు.

కార్డ్ కంపెనీ వార్షిక రుసుము అంటూ రూ.3,000 చార్జ్ చేసింది. సేల్స్ ఏజెంట్ చెప్పినట్టు సదరు క్రెడిట్ కార్డ్ జీవిత కాలం ఉచితమేమీ కాదని అర్థమైంది. అప్పుడు కార్డ్ నిబంధనలు, షరతులు చదివిన తర్వాత కానీ ఆమెకు అర్థం కాలేదు ఆ కార్డ్ తన అవసరాలను తీర్చేది కాదని. వార్షిక ఫీజు మినహాయించాలంటే కార్డ్ కంపెనీ పెట్టిన లక్ష్యం మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని అర్థమైంది. ఆర్థిక సంబంధ నిర్ణయం తీసుకునే ముందు (కొనుగోళ్లు, పెట్టుబడులు) పూర్తి వివరాలు తెలుసుకోకపోతే ఏం జరుగుతుందన్న దానికి ఆరాధ్యకు ఎదురైన అనుభవమే నిదర్శనం. తమ అవసరాలకు అనుకూలమైన క్రెడిట్ కార్డ్‌కే పరిమితం కావాలని ఇది సూచిస్తోంది. క్రెడిట్ కార్డ్‌తో వచ్చే ప్రయోజనాలు చూసి చాలా మంది ఒకటికి మించిన కార్డులు తీసుకుంటూ ఉంటారు. అసలు ఒకరికి ఎన్ని క్రెడిట్ కార్డులు ఉండాలి..? క్రెడిట్ కార్డ్ తీసుకునే ముందు ఏం చూడాలి? ఒకటికి మించిన కార్డులు ఉంటే ఎలా నడుచుకోవాలి..? ఈ విషయాలపై అవగాహన కల్పించడమే ఈ కథనం ఉద్దేశం.

అనుకూలతలు

- ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉంటే, అప్పుడు ఒక్కో కార్డు వారీ వినియోగించుకునే పరిమితి 50 శాతం మించకుండా చూసుకోవచ్చు. ఇది క్రెడిట్ స్కోర్‌కు అనుకూలం.
- ఒకటికి మించి క్రెడిట్ కార్డులు వాడుతూ, అన్ని బిల్లులను గడువులోపు చెల్లించేట్టు అయితే క్రెడిట్ స్కోర్ పెరిగేందుకు దారితీస్తుంది. దీనివల్ల భవిష్యత్తులో రుణాలు వేగంగా, ఆకర్షణీయమైన రేటుకు లభిస్తాయి.
- క్రెడిట్ కార్డ్ సంస్థలు ట్రాక్ రికార్డ్ మెరుగ్గా ఉన్న వారికి అదనపు లిమిట్ ఆఫర్ చేస్తుంటాయి. అత్యవసరాల్లో ఈ అదనపు పరిమితి ఉపయోగపడుతుంది. మరిన్ని రివార్డ్‌లు, క్యాష్‌బ్యాక్‌లు అందుకోవచ్చు.



ప్రతికూలతలు

- ఒకటే కార్డ్ ఉంటే వినియోగ నిష్పత్తి (కార్డ్ యుటిలైజేషన్ రేషియో) గరిష్ట స్థాయిలో ఉంటుంది.
- ఒకటికి మించి కార్డులు ఉంటే ప్రతీ కార్డ్ బిల్లును పరిశీలిస్తూ, గడువులోపు వాటి బిల్లులు చేయడం కొంత అదనపు శ్రమతో కూడినది. కార్డ్‌లు ఎక్కువై, సకాలంలో చెల్లింపులు చేయడంలో విఫలమైతే అది స్కోర్‌ను దెబ్బతీస్తుంది.
- ఒకటికి మించి కార్డ్‌లు ఉంటే, క్రమశిక్షణతో, వివేకంగా వినియోగించుకోకపోతే అది రుణ ఊబిలో చిక్కుకునేందుకు కారణమవుతుంది.
- అవసరం లేకుండా ఎక్కువ కార్డులు నిర్వహిస్తుంటే, వాటికి చెల్లించే ఫీజుల రూపంలో నష్టపోవాల్సి వస్తుంది.

కొత్తగా క్రెడిట్ కార్డ్ తీసుకోవాలనుకునే వారు ముందు తమ అవసరాలు ఏంటో తేల్చుకోవాలి. రుణాలకు కొత్త వారు అయి, మంచి క్రెడిట్ స్కోరును నిర్మించుకోవాలని అనుకునే వారు తక్కువ ఫీజుతో కూడిన ప్రాథమిక స్థాయి క్రెడిట్ కార్డ్‌కు పరిమితం కావాలి. అప్పటికే దెబ్బతిన్న క్రెడిట్ స్కోరును బలోపేతం చేసుకోవాలని అనుకుంటే, అప్పుడు సెక్యూర్డ్ కార్డ్‌ను తీసుకుని వినియోగించుకోవడం సరైనది. ఒకటికి మించి

ఏ అవసరం కోసం..?



కార్డులు ఉంటే, అప్పుడు అవి తీర్చలేని అవసరాలతో కూడిన కొత్త కార్డ్‌ను తీసుకోవచ్చు. కొన్ని కార్డ్‌లు రివార్డ్ పాయింట్లు, ఎయిర్‌మైల్స్ లేదా క్యాష్ బ్యాక్ ఆఫర్లు, అన్నీ కలిపి బండిల్‌గా ఇస్తుంటాయి. ఈ రివార్డ్‌లు తమకు ఎంత వరకు ఉపయోగమన్నది ఆలోచించుకోవాలి. తమ అవసరాలకు అనుకూలమంటే తీసుకోవచ్చు. ఎయిర్‌పోర్ట్‌లలో లాంజ్ సేవలను ఉచితంగా అందించే కార్డులు కూడా ఉన్నాయి. విదేశీ లావాదేవీలపై ఫీజుల్లేని, సినిమా టికెట్లపై, రెస్టారెంట్ చెల్లింపులపై అదనపు డిస్కౌంట్‌లు ఆఫర్ చేసే కార్డుల్లో తమకు అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవచ్చు.

కార్డుతో వినియోగం ఎక్కువగా ఎక్కడ ఉంటుంది? ప్రతి నెలా వినియోగించుకున్నంత మేర పూర్తిగా తిరిగి చెల్లిస్తారా..? లేక బ్యాలన్స్‌ను క్యారీ ఫార్వార్డ్ చేస్తారా.? కనీస మొత్తాన్ని చెల్లించి, మిగిలిన బ్యాలన్స్‌ను క్యారీ ఫార్వార్డ్ చేసుకునే వారు తక్కువ వడ్డీ రేటును చార్జ్ చేసే కార్డును ఎంపిక చేసుకోవాలి. పరిమిత బడ్జెట్‌తో కుటుంబాన్ని నడిపించే వారికి తక్కువ రేటు వసూలు చేసే కార్డ్‌లు అనుకూలం. దీర్ఘకాలంలో వీటితో ఎంతో

వినియోగం ముఖ్యం..

ఆదా చేసుకోవచ్చు. యూజర్లు కార్డ్‌తో ఎక్కువగా ఎక్కడ ఖర్చు చేస్తున్నారన్నది విశ్లేషించుకోవాలని మై మనీ మంత్ర మార్కెట్ ప్లేస్ ఎండీ రాజ్ ఖోస్లా పేర్కొన్నారు. కార్డుల మధ్య ప్రయోజనాల్లో వ్యత్యాసం ఉంటుందన్నారు. ''తరచూ ప్రయాణించే వారు ఎయిర్‌మైల్స్ లేదా హోటల్ పాయింట్లను ఆఫర్ చేసే కార్డును ఎంపిక చేసుకోవాలి. కార్డుపై అయ్యే వ్యయాలతో పోలిస్తే ప్రయోజనాలు మెరుగ్గా ఉండాలన్నది మర్చిపోవద్దు. ఒకటికి మించిన ప్రయోజనాలు ఆఫర్ చేసే కార్డులకు వార్షిక ఫీజు ఉంటుంది. కనుక ఆయా ప్రయోజనాలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేట్టు అయితేనే సదరు కార్డులు తీసుకోవాలి. అప్పుడే వార్షిక ఫీజు చెల్లించడం ప్రయోజనకరంగా అనిపిస్తుంది''అని రాజ్ ఖోస్లా సూచించారు.

ఖర్చులు-ప్రయోజనాలు

కార్డు వార్షిక ఫీజు కంటే వచ్చే ప్రయోజనాలు ఎక్కువగా ఉండాలి. ఏటా ఇంత ఖర్చు చేస్తేనే వార్షిక రుసుము మినహాయింపు అనే షరతు ఉంటే.. మీ వినియోగం అదే స్థాయంలో ఉంటుందా? అన్నది చూసుకోవాలి. కార్డ్‌ను తక్కువగా వినియోగించుకునే వారికి వార్షిక రుసుముతో వచ్చేవి అనుకూలం కాదు. కార్డులు సాధారణంగా వార్షిక రుసుం, యాన్యువల్ పర్సంటేజ్ రేట్ (ఏపీఆర్), బ్యాలన్స్ ట్రాన్స్‌ఫర్ ఫీజు, విదేశీ లావాదేవీల రుసుంతో వస్తాయి. యాన్యువల్ పర్సంటేజ్ రేట్ అంటే.. ప్రతి నెలా కార్డ్ బిల్లుపై కొంత మొత్తం చెల్లించి, క్యారీ ఫార్వార్డ్ చేసుకునే మిగిలిన బ్యాలన్స్‌పై అమలు చేసే వడ్డీ రేటు. క్రెడిట్ స్కోరు, కార్డు ఏ రకం అన్న దాని ఆధారంగా ఈ వడ్డీ రేటులో మార్పు ఉంటుంది. కనుక ప్రతి నెలా పూర్తి బిల్లు చెల్లించలేని వారికి తక్కువ ఏపీఆర్ ఉండే కార్డు అనుకూలంగా ఉంటుంది. నిజానికి ఒక అధ్యయనం ప్రకారం అధిక శాతం మంది కార్డ్ కస్టమర్లు తాము పొందే రివార్డులతో పోలిస్తే కార్డు కంపెనీకి చెల్లించే ఫీజులు, వడ్డీయే ఎక్కువగా ఉంటున్నట్టు తెలుస్తోంది. ''కార్డ్ సంస్థ ఆఫర్ చేస్తున్న ప్రయోజనాలు ఫీజుల కంటే మెరుగ్గా ఉన్నాయా? అన్నది తెలుసుకోవాలి. తక్కువ రివార్డులు, అధిక వార్షిక ఫీజుతో కూడిన ప్రాథమిక క్రెడిట్ కార్డ్ ఏమంత ఉపయోగకరం కాకపోవచ్చు. ఎందుకంటే మార్కెట్లో తక్కువ వార్షిక ఫీజుతో లేదా అసలు వార్షిక ఫీజు లేని కార్డులు ఎన్నో ఉన్నాయి''అని పైసా బజార్ క్రెడిట్ కార్డుల విభాగం హెడ్ రోహిత్ చిబ్బార్ పేర్కొన్నారు. విదేశీ ప్రయాణాలకు వెళ్లే వారు అంతర్జాతీయ లావాదేవీలకు చార్జ్ వసూలు చేయని కార్డులు తీసుకోవడం లాభదాయకమని సూచించారు. అలాగే, రివార్డుల శాతాన్ని కూడా చూడాల్సి ఉంటుంది. అన్ని రకాల కొనుగోళ్లపై ఫ్లాట్ 2 శాతం చొప్పున రివార్డులు ఆఫర్ చేస్తుంటే, అది మంచి డీల్ అవుతుంది.

ఎన్ని కార్డులు..?



ఒకరికి ఎన్ని కార్డులు ఉండాలన్న దానికి ఎలాంటి నియమం లేదు. కాకపోతే ఎక్కువ కార్డ్‌లు ఉంటే, వాటితో పాటు రిస్క్‌లు కూడా ఉంటాయని మర్చిపోవద్దు. ''ఒకటికి మించి క్రెడిట్ కార్డ్‌లు ఉంటే, విడిగా ఒక్కో దానిని సరైన రీతిలో వినియోగిస్తూ గరిష్ట స్థాయిలో ఆదా చేసుకోవాలి'' అని చిబ్బార్ పేర్కొన్నారు. ప్రతి కార్డ్‌కు ఉండే బిల్లింగ్ సైకిల్‌కు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. అప్పుడు నెలవారీ నగదు ప్రవాహాలను తెలివిగా వినియోగించుకోవచ్చన్నారు. విడిగా ఒక్కో కార్డ్‌లో వినియోగించకుండా మిగిలిపోయిన లిమిట్, అత్యవసర సమయాల్లో అక్కరకు వస్తుంది. ఒకటికి మించిన కార్డులు కలిగిన వారు, సరైన రీతిలో ఉపయోగించుకోకుండా, ఎక్కువగా వాడేస్తే అది రుణ ఊబిలోకి తీసుకెళుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక లిమిట్‌తో ఎక్కువ క్రెడిట్ కార్డులు కలిగి ఉండడం, అన్నింటినీ గరిష్ట పరిమితి మేరకు వినియోగిస్తుంటే అది క్రెడిట్ స్కోర్‌కు మంచిది కాదు. ఎందుకంటే అది అధిక రిస్క్‌కు దారితీస్తుంది. సంఖ్యతో సంబంధం లేకుండా తమ అవసరాలకు పక్కాగా నప్పే కార్డ్ ఉండాలన్నది ప్రాథమిక నియమం. ఎక్కువగా ప్రయాణించని వారికి ట్రావెల్ ప్రయోజనాలతో కూడిన క్రెడిట్ కార్డుతో వచ్చేదేమీ ఉండదు. కార్డులు ఎక్కువైతే వార్షికంగా చెల్లించే ఫీజులు, నికరంగా ఒరిగే ప్రయోజనం ఎంతన్న విశ్లేషణ అవసరం. ఎన్ని కార్డులు ఉన్నా, ఎంత వినియోగించుకున్నా, గడువులోపు పూర్తి బిల్లు చెల్లించడం ఎంతో ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే అది రుణ పరపతిపై ప్రభావం చూపిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపుల్లో వైఫల్యం లేకుండా చూసుకోవాలి.

కార్డును సమీక్షించుకోవాలి..

క్రెడిట్ కార్డ్ తీసుకునే సమయంలో చెప్పిన ప్రయోజనాలు ఎప్పటికీ కొనసాగుతాయని అనుకోవద్దు. కార్డ్ సంస్థ ఎప్పుడైనా అందులోని ప్రయోజ



నాల్లో మార్పులు చేయవచ్చు. ఈ విషయాలను ఈ మెయిల్ రూపంలో తెలియజేస్తాయి. కార్డ్ కంపెనీల నుంచి వచ్చే మెయిల్స్‌ను చాలా మంది పెద్దగా పట్టించుకోరు. దీనివల్ల ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుంది. అందుకని ఏడాదిలో రెండు సార్లు అయినా, క్రెడిట్ కార్డు నియమ, నిబంధనలు, ప్రయోజనాలను సమీక్షించుకోవాలి. రివార్డ్ పాయింట్లను కూడా రెడీమ్ చేసుకోవాలి. లేదంటే అవి కాలం చెల్లిపోయే ప్రమాదం ఉంటుంది. మారిన నియమ, నిబంధనల ప్రకారం ఇక మీదట సంబంధిత క్రెడిట్ కార్డ్ ప్రయోజనకరం కాదని గుర్తిస్తే, దాన్ని రద్దు చేసుకోవడం మంచిది. క్రెడిట్ కార్డ్‌ను రద్దు చేసుకుంటే, అది తాత్కాలికంగా క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుందని గుర్తు పెట్టుకోవాలి.


టీవీఎస్ నుంచి మరిన్ని ఎలక్ట్రిక్ టూ-వీలర్లు

త్రీ-వీలర్‌పై కసరత్తు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ టీవీఎస్ మోటర్ వచ్చే ఏడాది వ్యవధిలో తమ ఎలక్ట్రిక్ టూ-వీలర్ల పోర్ట్‌ఫోలియోను మరింతగా విస్తరించే యోచనలో ఉంది. అలాగే విద్యుత్ త్రిచక్ర వాహనాన్ని కూడా రూపొందిస్తోంది. 5 నుంచి 25 కిలోవాట్ల శ్రేణిలో పలు వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ డైరెక్టర్, సీఈవో కేఎన్ రాధాకృష్ణన్ తెలిపారు. మార్కెట్లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఐక్యూబ్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 25,000 యూనిట్లకు పెంచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ పోర్ట్‌ఫోలియోలో రెండు ఈ-స్కూటర్లు ఉన్నాయి. కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఎక్స్ విక్రయాలు ఈ క్వార్టర్‌లోనే ప్రారంభించనున్నట్లు రాధాకృష్ణన్ చెప్పారు.

సొంత ఫిన్‌టెక్ ఏర్పాటులో ఎల్‌ఐసీ



న్యూఢిల్లీ: బీమా రంగ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) తాజాగా సొంత ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను మదింపు చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. మరోవైపు, కార్యకలాపాల డిజిటలీకరణ కోసం ప్రాజెక్ట్ డైవ్ (డిజిటల్ ఇన్నోవేషన్, వేల్యూ ఎన్‌హాన్స్‌మెంట్)ను చేపట్టామని, దీనికి కన్సల్టెంట్‌ను నియమించుకున్నామని పేర్కొన్నారు. కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా కస్టమర్లు తమ ఇంటి దగ్గరే మొబైల్ ఫోన్‌తో అన్ని సర్వీసులను పొందగలిగేలా వివిధ ప్రక్రియలను సులభతరం చేస్తున్నట్లు మహంతి పేర్కొన్నారు.

కామన్ అకౌంట్ నంబర్ అంటే?

ఫండ్స్‌లో కామన్ అకౌంట్ నంబర్ (క్యాన్) అంటే ఏమిటి? ఇందులో అనుకూల, ప్రతికూలతలు ఏమున్నాయి? – దిలీప్

కామన్ అకౌంట్ నంబర్/క్యాన్ అనేది ఎంఎఫ్ యుటిలిటీస్ వద్ద రిజిస్టర్ చేసుకున్న వారికి ఇచ్చే ఏకీకృత ఖాతా. ఇది మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి అన్ని రకాల లావాదేవీలను నిర్వహించే ఏకీకృత వేదిక. 2015లో మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు అన్నీ కలసి దీన్ని ఏర్పాటు చేశాయి. ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారులకు సౌకర్యం, సులభతర నిర్వహణ దీని ఏర్పాటు ఉద్దేశ్యంగా ఉంది. ఈ ప్లాట్‌ఫామ్ మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడికి వీలు కల్పిస్తుంది. ఒక ఇన్వెస్టర్ వేర్వేరు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు చెందిన పథకాల్లో ఇన్వెస్ట్ చేసేట్టు అయితే, విడివిడిగా ఖాతాలు ప్రారంభించి, లావాదేవీలను నిర్వహించుకోవాలి. ఇందుకోసం ప్రతి ఏఎంసీ వద్ద విడిగా నమోదు చేసుకోవాలి. అయితే, క్యాన్‌ను కలిగి ఉండడం తప్పనిసరి కాదు. ఎంఎఫ్ యుటిలిటీ ద్వారానే ఇన్వెస్ట్ చేయాలన్న నిబంధన కూడా లేదు. ఇదొక వేదిక మాత్రమే. ఆ తర్వాత కాలంలో ఎన్నో ఫిన్‌టెక్ కంపెనీలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా, బ్రోకర్ల ద్వారా సులభంగా ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసుకునే అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి.

నా వయసు 40 ఏళ్లు. వచ్చే ఏడాది పీపీఎఫ్ గడువు తీరి రూ.15 లక్షలు చేతికి వస్తాయి. ఎన్‌పీఎస్ తదితర అధిక వృద్ధికి అవకాశం ఉన్న సాధనాల్లోకి ఈ మొత్తాన్ని బదిలీ చేయాలని అనుకుంటున్నాను. పీపీఎఫ్ నుంచి నాకు అందే మొత్తం పన్ను మినహాయింపు కిందకు వస్తుందని తెలిసింది. కనుక ఈ మొత్తాన్ని క్రమానుగతంగా ఈక్విటీ ఫండ్స్‌లోకి మళ్లించేది ఎలా? – సుచిత్ పూతియా


పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీ ఫండ్స్‌లోకి మళ్లించే సమయంలో మీరు కొన్ని అంశాలను గుర్తు పెట్టుకోవాలి. ఇందులో ముందుగా డ్యురేషన్ ఒకటి. మీరు ఆ మొత్తం సమకూర్చుకోవడానికి



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పట్టిన కాలంలో సగం కాలాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు మీరు పీపీఎఫ్‌లో 15 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేశారు. దీంతో ఈ మొత్తం సమకూరింది. కనుక ఏడున్నరేళ్ల పాటు సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేయమని కాదు. గరిష్టంగా మూడేళ్లకు మించకుండా నెలవారీ వాయిదాల రూపంలో మీ వద్దనున్న మొత్తాన్ని ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ పెట్టుబడిని సమకూర్చుకోవడానికి ఐదేళ్లు పట్టిందని అనుకుందాం. అందులో సగం అంటే రెండున్నరేళ్ల పాటు క్రమానుగతంగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మీ నూతన కాల వ్యవధి 15–20 ఏళ్లు అని అంటున్నారు. కనుక ఈక్విటీలకు ఎక్కువ కేటాయించుకోవాలి. ఎందుకంటే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణానికి మించి మెరుగైన రాబడులను ఈక్విటీలు ఇవ్వగలవు. ఎన్‌పీఎస్ పథకాన్ని ఎంపిక చేసుకుంటే అందులో ఈక్విటీల్లో 75% ఇన్వెస్ట్ చేసే యాక్టివ్ చాయిస్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. 60 ఏళ్లకు వచ్చిన తర్వాత అప్పటికి సమకూరిన మొత్తం నుంచి 60 శాతాన్నే ఉపసంహరించుకోవడానికి ఉంటుంది. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. రిటైర్మెంట్ వరకు నిధిని ముట్టుకోని వారు అయితే, ఫ్లెక్సీ క్యాప్‌ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇవి అచ్చమైన ఈక్విటీ పథకాలు. ఉపసంహరణలపై ఎలాంటి ఆంక్షలు ఉండవు. ఎన్‌పీఎస్‌లో అయితే ఈక్విటీ పెట్టుబడుల్లో అధిక శాతం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కే కేటాయిస్తారు. కానీ, ఫ్లెక్సీక్యాప్ పథకాలు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లోకి పెట్టుబడులను వైవిధ్యం చేస్తాయి. కనుక ఇవి కొంచెం మెరుగైన రాబడులు ఇస్తాయి. ఇప్పటి వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన అనుభవం లేకపోతే, నూరు శాతం పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకునే విషయంలో ఆందోళన చెందుతుంటే, అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి ఈక్విటీల్లో 65% వరకే ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన 35 శాతాన్ని డెట్‌లో పెడుతాయి. దీనివల్ల ఈక్విటీల్లోని అస్థిరతలను కొంత వరకు తగ్గించుకోవడానికి వీలుంటుంది. ఈక్విటీలతో పోలిస్తే స్థిరమైన రాబడులు ఇస్తాయి.

ఐపీవో అధిక వేల్యుయేషన్స్‌పై సెబీ దృష్టి



ముంబై: పబ్లిక్ ఇష్యూలకు సంబంధించి భారీ ప్రీమియంలు, అధిక వేల్యుయేషన్ల అంశాన్ని పరిశీలించనున్నట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. పెద్దగా తెలియని కంపెనీలు కూడా ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు ఫేస్ వేల్యూను తక్కువగా చూపించి, షేరును మాత్రం భారీ ప్రీమియం రేటుకు ఆఫర్ చేస్తున్న నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు పబ్లిక్ ఇష్యూల టైమింగ్‌ను మార్కెట్‌కి వదిలేయాలన్నదే సెబీ ఉద్దేశమని మాధవి చెప్పారు. పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నప్పుడే కంపెనీలు ఇష్యూకి వస్తాయని, ఎప్పుడు రావాలనేది సెబీ నిర్దేశించడమనేది ఇటు ఇన్వెస్టర్లు, అటు సంస్థకు ప్రయోజనకరంగా ఉండబోదని ఆమె పేర్కొన్నారు.

స్టాక్స్ వ్యూ

టాటా మోటార్స్ | బీఎన్‌పీ పరిబాస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 674 టార్గెట్: రూ. 785



ఎందుకంటే: ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ పటిష్ట ఫలితాలు సాధించింది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు అంచనాలు మించాయి. దేశీ బిజినెస్‌లలో పుంజుకున్న మార్జిన్లు, ఇకపై మార్జిన్లు మరింత బలపడనున్నట్లు బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్ ప్రకటించిన అంచనాలు కంపెనీకి జోష్‌నిస్తున్నాయి. ప్యాసింజర్ వాహనాలు(పీవీ), ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ), వాణిజ్య వాహనాల(సీవీ) అమ్మకాలపై ఆశావహ అంచనాలు ఇందుకు మద్దతిస్తున్నాయి. ఇటీవల జేఎల్‌ఆర్(జాగ్వార్, ల్యాండ్‌రోవర్) ఆర్డర్ బుక్ సాధారణ స్థితికి చేరుతుండటం, మార్కెటింగ్ వ్యయాలు భారీగా తగ్గుతుండటం వంటి అంశాలు డిమాండ్ వాతావరణం అనుకూలంగా ఉన్నట్లు వెల్లడిస్తున్నాయి. క్యూ2(జులై–సెప్టెంబర్)లో జేఎల్‌ఆర్ ఆదాయం వార్షికంగా 30%జంప్‌చేసి 6.86 బ్రిటిష్ పౌండ్లను తాకింది. ఇబిటా మార్జిన్లు అంచనాల(16.9%)కంటే తక్కువగా 14.9 శాతంగా నమోదయ్యాయి. ఇందుకు మెటీరియల్ వ్యయాలు, నిల్వల లబ్ధి రివర్స్‌కావడం వంటి అంశాలు ప్రభావం చూపాయి. ప్రపంచ సీవీ అమ్మకాల(ఆదాయం) వార్షికంగా 22% ఎగసింది. త్రైమాసికవారీగా ఇబిటా మార్జిన్లు 0.82 శాతం మెరుగుపడి 11.5 శాతాన్ని తాకాయి. చిన్నవాణిజ్య వాహన విభాగంలో మార్కెట్ వాటాను పెంచుకోవడం ఇందుకు దోహదపడింది. పీవీ, ఈవీ విభాగంలో కొత్త ప్రొడక్టుల విడుదల ద్వారా ఈ ఏడాది ద్వితీయార్థం (అక్టోబర్–మార్చి)లోనూ మార్కెట్ వాటాను పెంచుకోగలమని కంపెనీ విశ్వసిస్తోంది.

కెనరా బ్యాంక్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 390 టార్గెట్: రూ. 506



ఎందుకంటే: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ గత 13 త్రైమాసికాలుగా నిలకడైన పనితీరును ప్రదర్శిస్తోంది. నికర లాభాల్లో వృద్ధిని సాధిస్తోంది. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లోనూ లాభదాయకత వార్షికంగా 42 శాతం జంప్‌చేసింది. ప్రొవిజనింగ్ వ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించింది. మూడేళ్ల క్రితం(2019–20) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో రూ. 5,400 కోట్లమేర చేపట్టిన భారీ ప్రొవిజన్ కారణంగా నిర్వహణలో సవాళ్లు ఎదురైనా బ్యాలన్స్‌షీట్ పటిష్టస్థాయిలో కొనసాగుతోంది. ఇక రుణ నాణ్యత విషయంలో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 0.39 శాతం మెరుగుపడి 4.76 శాతానికి చేరగా.. నికర ఎన్‌పీఏలు సైతం 0.16 శాతం తగ్గి 1.41 శాతానికి పరిమితమయ్యాయి. ఇందుకు నిలకడను చూపుతూ స్లిప్పేజీలు రూ. 2,900 కోట్లుగా నమోదుకావడం ప్రభావం చూపింది. స్లిప్పేజీల నిష్పత్తి వార్షిక ప్రాతిపదికన స్వల్పంగా 1.37 శాతం తగ్గింది. ఇక బిజినెస్ విషయానికివస్తే.. నికర రుణ(క్రెడిట్) వృద్ధి వార్షికంగా 13.2 శాతం పుంజుకుంది. త్రైమాసికంగా 4.3 శాతం పురోగతి ఇది. అంచనాలకు అనుగుణంగా రికవరీలు నమోదైతే ఈ ఏడాది క్రెడిట్ వ్యయాలు 2 శాతానికంటే తక్కువకు చేరతాయి. త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు నిలకడను చూపుతూ 3.02 శాతంగా నమోదయ్యాయి. మార్జిన్ల సక్రమ సర్దుబాటుతోపాటు బ్యాంక్ బ్యాలన్స్‌షీట్ బలపడుతోంది. ఇకపై లాభదాయకత క్రమంగా మెరుగుపడనుంది. వచ్చే ఏడాది(2024–25)కల్లా ఆర్‌వోఏ 1.1 శాతానికి, ఆర్‌వోఈ 17.2 శాతానికి చేరే వీలుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్ష

సాక్షి, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2023–24) నిర్వహించే జాతీయ ఉపకార పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు హాజరయ్యే విద్యార్థులకు ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నమూనా పరీక్ష విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదో తరగతి చదువుతున్న 20 వేల మంది విద్యార్థులు నమూనా పరీక్షకు హాజరైనట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నరోత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల సుబ్బారావు ప్రకటనలో తెలిపారు.

3న జాతీయ స్థాయి పరీక్ష

ఏటా జాతీయ ఉపకార వేతన పరీక్ష ద్వారా ఏపీ నుంచి 4,078 మందికి స్కాలర్‌షిప్ ఇస్తారు. ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న (డే స్కాలర్స్) విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హులు. వచ్చేనెల 3వ తేదీన జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్రం నుంచి 81 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు హాల్‌టికెట్లను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రాజ్యాంగ రచనలోనే పరిపాలన వికేంద్రీకరణ ప్రస్తావన

జేఏసీ నాన్ పొలిటికల్ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్




సాక్షి, విశాఖపట్నం: పరిపాలన వికేంద్రీకరణ జరిగినప్పుడే ఆర్థిక వికేంద్రీకరణ జరుగుతుందని రాజ్యాంగ రచనలోనే రాజ్యాంగ పరిషత్ సభ్యుల్లో ఒకరైన దళిత సభ్యురాలు దాక్షాయణి చెప్పారని జేఏసీ నాన్ పొలిటికల్ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ తెలిపారు. అలాంటి మహోన్నత వ్యక్తులే పరిపాలన వికేంద్రీకరణ గురించి చెప్పారని, అలాంటి వారి ఆశయాలను ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని, ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని కొనియాడారు. ఆదివారం 'భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం' సందర్భంగా విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్న ఆలోచనతో సీఎం జగన్ పాలనా వికేంద్రీకరణ ప్రతిపాదించి.. ముందడుగు వేశారన్నారు. దీంతో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం వంటి విషయాల్లో వివిధ ప్రాంతాల ప్రజల మధ్య ఆర్థిక సారూప్యత సాధ్యమవుతుందని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన విధంగా రాష్ట్రంలో అసమానతలు తొలగి.. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే జేఏసీ ఆలోచనగా చెప్పారు.

తెలుగింటి సంస్కృతిని భావితరాలకు చాటి చెప్పాలి: మంత్రి ఆర్కే రోజా



సాక్షి, అమరావతి: తెలుగింటి సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు చాటి చెప్పేలా పర్యాటక శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని పర్యాటక, సాంస్కృతిక యువజన శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. ఆదివారం విజయవాడలోని భవానీద్వీపంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కార్తీకమాస ఉత్సవాన్ని నిర్వహించారు. మంత్రి రోజా మాట్లాడుతూ..పేదలకు మంచి చేకూరాలనే సంకల్పంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. గత పాలకులు దేవాలయాలను కూల్చి వేస్తే.. వాటిని సీఎం జగన్ పునర్నిర్మించడంతో పాటు దుర్గమ్మ ఆలయ ఆధునీకరణ చేపట్టారన్నారు. అంతకు ముందు వేదపండితుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఏపీటీడీసీ ఈడీ (ఆపరేషన్స్) పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మళ్లీ లోకేశ్ పాదయాత్ర



సాక్షి, అమరావతి/రాజోలు: అర్థాంతరంగా నిలిచిపోయిన టీడీపీ నేత లోకేశ్ యువగళం పాదయాత్ర సోమవారం నుంచి మళ్లీ ప్రారంభం కానుంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని పొదలాడ నుంచి ఆయన యాత్రను పునఃప్రారంభిస్తున్నారు. సెప్టెంబర్ 9న స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్ట్ కావడంతో పాదయాత్రను నిలిపివేశారు. చంద్రబాబు జైలుకు వెళ్లిన వెంటనే తనను కూడా అరెస్ట్ చేస్తారనే భయంతో లోకేశ్ ఢిల్లీ వెళ్లి అక్కడే ఉండిపోయారు. ఢిల్లీలో తండ్రి కోర్టు వ్యవహారాల పర్యవేక్షణ కోసం ఆయన అక్కడికి వెళ్లినట్టు ప్రచారం చేసినా సీఐడీ పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతోనే ఆయన ఢిల్లీలో కాలక్షేపం చేశారు. బాబు జైలు నుంచి విడుదలయ్యే కొద్దిరోజుల ముందు హైదరాబాద్‌లో ఉన్నారు. బాబు విడుదలవడంతో నిలిచిపోయిన పాదయాత్రను ప్రారంభించి.. త్వరగా ముగించాలని నిర్ణయించారు. ఇచ్ఛాపురం వరకు యాత్ర నిర్వహిస్తానని ప్రకటించినా ఇప్పుడు విశాఖతోనే ముగించడానికి సిద్ధమయ్యారు.

'అనంత' రైతుకు 'కర్మ వీర చక్ర' అవార్డు

సన్నకారు రైతు నారాయణప్ప ప్రయోగానికి అంతర్జాతీయ గుర్తింపు

- ఎనీటైం మనీ విధానంలో ఏడాది పొడవునా పంటల సాగు
- 30 సెంట్లలోనే 20 రకాల పంటలు
- రూ.5 వేల పెట్టుబడి.. రూ.2 లక్షల రాబడి
- గతంలో ఎంఎస్ స్వామినాథన్, రాహుల్ ద్రావిడ్, పుల్లెల గోపీచంద్, కాజోల్‌కు ప్రదానం
- నేడు న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రదానం



ఏటీఎం పద్ధతిలో వినూత్నంగా సాగు చేస్తున్న సన్నకారు రైతు నారాయణప్ప దంపతులు

సాక్షి, అమరావతి: అతనో సన్నకారు రైతు. కేవలం 30 సెంట్ల విస్తీర్ణంలో ఏడాది పొడవునా 20 రకాల పంటలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నాడు. అనంతపురం జిల్లా మల్లాపురానికి చెందిన ఎం.నారాయణప్ప చేసిన ప్రయోగానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఐక్యరాజ్య సమితి, ఆర్ఈఎక్స్, కర్మ వీర్ గ్లోబల్ ఫెలోషిప్ భాగస్వామ్యంతో ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎన్జీఓస్ (ఐకాంగో) ఏటా అంతర్జాతీయ స్థాయిలో ఇచ్చే 'కర్మవీర చక్ర' పురస్కారం నారాయణప్పను వరించింది. గతంలో ఈ అవార్డును వ్యవసాయ రంగంలో విశిష్ట ఖ్యాతిగడించిన దివంగత శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, క్రీడారంగంలో రాహుల్ ద్రావిడ్, పుల్లెల గోపీచంద్, కళా రంగంలో కాజోల్ తదితరులకు అందజేశారు. ఇప్పుడు వీరి సరసన నారాయణప్ప చోటుదక్కించుకున్నారు. న్యూఢిల్లీలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఈ అవార్డుతో పాటు 'కర్మ వీర గ్లోబల్ ఫెలోషిప్' (2023–24) కూడా అందిస్తారు.

ఏడాది పొడవునా ఆదాయమే

వ్యవసాయం కలిసి రాక కొంతకాలం భవన నిర్మాణ కార్మికునిగా పనిచేసిన నారాయణప్ప తిరిగి పొలం బాట పట్టాడు. తండ్రి నుంచి వచ్చిన 30 సెంట్ల భూమిలో రసాయన రహిత సాగుకు శ్రీకారం చుట్టాడు. అందరిలా ఏడాదికి రెండు పంటలతో సరిపెట్టకుండా ఏడాది పొడవునా పంట దిగుబడులొచ్చేలా ఎనీ టైం మనీ (ఏటీఎం) విధానానికి శ్రీకారం చుట్టాడు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 20 రకాలకు పైగా పంటలు పండిస్తూ కరువు నేలలో సిరుల పంట పండిస్తున్నారు. ఇంటికి సరిపడా పంట ఉంచుకుని మిగిలిన వాటిని మార్కెటింగ్ చేయడం ద్వారా సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా ప్రతినెలా క్రమం తప్పకుండా ఆదాయం ఆర్జిస్తున్నాడు. కేవలం రూ.5 వేల పెట్టుబడితో ఏడాదికి రూ.2 లక్షల ఆదాయాన్ని రాబట్టి తక్కువ విస్తీర్ణంలో అధిక లాభాలు పొందవచ్చని రుజువు చేసి చూపించాడు. తాను ఆర్థికంగా ఎదగడంతోపాటు సమాజానికి సురక్షితమైన పౌష్టికాహారాన్ని అందిస్తూ.. తోటి రైతులకు కొత్త తరహా సాగు విధానాన్ని పరిచయం చేశాడు. గ్రామంలోనే తనతో పాటు మరో 25 మందికి ఏటీఎం మోడల్ సాగును నేర్పించాడు. వీరందరినీ చూసి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3,500 మంది రైతులు నారాయణప్ప బాటలో అడుగులేస్తూ సిరులు పండిస్తున్నారు.

ఐకాంగోను ఆకట్టుకున్న ఏటీఎం

నారాయణప్ప చేపట్టిన ఈ వినూత్న సాగు విధానం (ఏటీఎం) ఐకాంగోను ఆకర్షించింది. దీనిపై సుదీర్ఘకాలం పాటు అధ్యయనం చేసింది. ఈ వినూత్న విధానంలో మట్టి, భూమి ఆరోగ్యంగా మారడంతోపాటు భూమి మెత్తబడి ఆకు, కాండం ఆరోగ్యంగా ఉంటున్నాయి. ఏటీఎం మోడల్‌లో సాగు చేయడం ద్వారా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని 'క్లైమేట్ ఛేంజ్' సాధ్యమవుతోందని గుర్తించారు. ఏటీఎం మోడల్‌ను ప్రపంచంలోనే ఏ గ్రేడ్ మోడల్‌గా గుర్తించడంతోపాటు ఏడాది పొడవునా పంటలు పండించడం ద్వారా అత్యధిక లాభాలను ఆర్జించడంతో పాటు నేలల్లో కర్బన స్థిరీకరణకు దోహదపడేలా కృషి చేస్తూ నారాయణప్ప రైతుల పాలిట 'ఛేంజ్ ఏజెంట్' నిలిచారని పేర్కొంటూ ఆయనను 2023–24 సంవత్సరానికి 'కర్మ వీర్ చక్ర' అవార్డుకు ఎంపిక చేశారు.

గర్వంగా ఉంది

మార్పు అనేది మనతోనే మొదలవ్వాలన్నది నా ఆలోచన. వ్యవసాయంలో ఏడాది పొడవునా ఆదాయం ఎందుకు రాదన్న ఆలోచన నుంచి పుట్టిందే ఏటీఎం మోడల్. రైతు సాధికార సంస్థ వెన్ను తట్టి ప్రోత్సహించింది. ఫలితంగా తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా ఆదాయం ఆర్జిస్తున్నాను. పట్టుదల, నిరంతర శ్రమతో తగిన ప్రతిఫలం పొందుతున్నా. నేను చేస్తున్న సాగు విధానానికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం గర్వంగా ఉంది.

– ఎం.నారాయణప్ప, మల్లాపురం, అనంతపురం జిల్లా

హక్కులు అందరికీ సమానంగా దక్కాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

అనంతపురం: రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికీ సమానంగా దక్కినప్పుడే రాజ్యాంగ స్ఫూర్తి, లక్ష్యం నెరవేరినట్టవుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని శ్రీ విజయనగర న్యాయ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇదే కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ సాధనకు పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదన్నారు. జీవితాశయంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. పేదల న్యాయవాదిగా పేరొంది, దేశంలోనే విశిష్ట స్థానం సంపాదించిన సి.పద్మనాభరెడ్డి చిత్రపటాన్ని, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ (అల) లోగోను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఆలూరు రామిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఎం.శ్రీనివాస రెడ్డి, జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పాల్గొన్నారు.

కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



పీఠాధిపతులతో కలసి ప్రార్థనలు చేస్తున్న సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా కడప అమీన్‌పీర్ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ షా మహమ్మద్ మహమ్మదుల్ ఆరీఫుల్లా హుసేనీ చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అమీన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, ఇతర సేవా సంస్థల నివేదికను ఆయా సంస్థల సిబ్బంది సమర్పించారు. రాత్రి గంధం ఉత్సవంలో భాగంగా పీఠాధిపతి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాల మధ్య ఊరేగింపుగా దర్గాలోని గురువు మజార్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రార్థనలు చేసి గంధం సమర్పించి ఫాతెహా చేశారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఆర్బీకేలపై ఏపీ యువతి ప్రాజెక్ట్‌కు విదేశీ వర్సిటీ గోల్డ్ మెడల్

- బర్మింగ్‌హామ్ ఇంటర్నేషనల్ వర్సిటీలో ఎంబీఏ చదువుతున్న నిరోషా
- ఆదుకున్న జగనన్న విదేశీ విద్యా దీవెన



అమలాపురం టౌన్/రామచంద్రాపురం రూరల్: విదేశాల్లో చదవాలనుకున్న ఓ యువతి ఆకాంక్ష జగనన్న విదేశీ విద్యాదీవెనతో నెరవేరింది. ఈ పథకానికి ఎంపికైన బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం తాళ్లపొలానికి చెందిన టేకుమూడి నిరోషా దేవి యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింగ్‌హామ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చదువుతోంది. ఆమె తన కోర్సులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా కేంద్రాలపై ప్రాజెక్టు చేపట్టింది. ఏపీలో వ్యవసాయ విధానాలు, రైతు ఉత్పత్తులకు అదనపు విలువ జోడింపు వంటి అంశాలపై అధ్యయనం చేసింది. దీన్ని యూనివర్సిటీ ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. బర్మింగ్‌హామ్ వర్సిటీలో అనేక దేశాల విద్యార్థులు చదువుతున్నారు. వారు కూడా వివిధ ప్రాజెక్టులు చేసినా నిరోషా దేవి ఆర్బీకేలపై చేసిన ప్రాజెక్టే అత్యుత్తమంగా నిలిచింది. దీంతో యూనివర్సిటీ నుంచి ప్రేయాస్ ఫీల్డ్ అవార్డు దక్కించుకుంది. అంతేకాకుండా గోల్డ్‌మెడల్‌ను కూడా సొంతం చేసుకుంది.

అప్పుడు వైఎస్సార్.. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్..

వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన అమలు చేసిన ఫీజురీయింబర్స్‌మెంట్ వల్లే నిరోషా దేవి రాష్ట్రంలో ఇంజనీరింగ్ అభ్యసించింది. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం విదేశీ విద్యా దీవెన పథకంతో ఆమెను ఆదుకోవడంతో యూకేలో ఎంబీఏ చదువుతోంది. ఈ నేపథ్యంలో తాను సాధించిన అవార్డును, గోల్డ్ మెడల్‌ను సీఎం జగన్‌కు అంకితమిస్తున్నట్టు నిరోషా దేవి వెల్లడించింది. ఆయన వల్లే తాను విదేశాల్లో చదువుకోగలుగుతున్నానని కృతజ్ఞతలు తెలిపింది. కాగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను నిరోషా దేవి భర్త, కట్టా సర్వాని, మామ సూర్యనారాయణ ఆదివారం కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిరోషా దేవి గోల్డ్ మెడల్ సాధించడంపై అభినందనలు తెలియజేశారు.

న్యాయమూర్తుల నియామకాలకు జ్యుడిషియల్ కమిషన్ అవసరం

సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్



విశాఖ లీగల్: న్యాయమూర్తుల నియామకం కోసం స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు అవసరమని సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అభిప్రాయపడ్డారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో విశాఖలో ఆదివారం జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. న్యాయమూర్తులు అవినీతికి పాల్పడితే చర్యలు లేవన్నారు. కేవలం పార్లమెంట్‌లో వందకు మందికిపైగా పార్లమెంట్ సభ్యులు సంతకాలు చేస్తేనే అవినీతి న్యాయమూర్తులపై చర్చలు జరుగుతాయన్నారు. ఇటీవల కాలంలో న్యాయమూర్తులు, రాజకీయాలకు వత్తాసు పలుకుతూ తమ ఔన్నత్యాన్ని పక్కన పెడుతున్నారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోస్టుల్లో నియామకాలకు అమలు చేసే ప్రక్రియను ఎగువ న్యాయస్థానంలో న్యాయమూర్తులు నియామకానికి అమలు చేయాలన్నారు. రాజకీయ ప్రమేయం లేని స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కమిషన్ తక్షణం ఏర్పాటు జరగాలన్నారు. న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరమని చెప్పారు. కేసుల విచారణ సైతం నిష్పాక్షికంగా జరగటం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన 5000 గ్రామ న్యాయాలయాల్లో ఇప్పటివరకు 500 కూడా ఏర్పాటు కాలేదన్నారు. కార్యక్రమానికి ఐఏఎల్ అధ్యక్షుడు ఆర్ఎస్ సీమ అధ్యక్షత వహించారు. జాతీయ కార్యదర్శులు కేఎస్ఎస్ సురేష్‌కుమార్, చలసాని అజయ్‌కుమార్, బి.ప్రభాకర్, కేపీ జై చంద్రన్, విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, విశాఖ న్యాయవాదుల సంఘం నాయకుడు చింతపల్లి రాంబాబు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్, పి.నర్సింగరావు ప్రసంగించారు.

ఆటకు అందలం

- 'ఆడుదాం–ఆంధ్ర'లో భారీగా నగదు బహుమతులు
- రాష్ట్రస్థాయి క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీల్లో విజేతలకు రూ.5లక్షలు
- ద్వితీయ స్థానానికి రూ.3లక్షలు, తృతీయ స్థానానికి రూ.2లక్షలు
- బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి బహుమతి రూ.2లక్షలు
- నియోజకవర్గ, జిల్లా స్థాయిలోనూ విజేతలకు ప్రైజ్ మనీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'ఆడుదాం–ఆంధ్ర' క్రీడా పోటీల విజేతలకు ప్రభుత్వం భారీగా నగదు బహుమతులు ప్రకటించింది. గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో పోటీలను నిర్వహించనుంది. ప్రతి దశలోనూ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంతో పాటుగా విజేతలను సర్టిఫికెట్స్, మెమెంటోలు, నగదు పురస్కారాలతో సత్కరించనుంది. క్రీడా చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో 15ఏళ్ల పైబడిన వయస్కులు (మెన్, ఉమెన్) అందరూ పోటీల్లో భాగస్వాములయ్యేలా 'ఓపెన్ మీట్'ను చేపడుతున్నది. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఐదు క్రీడా విభాగాలైన.. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలకు నగదు బహుమతులు ఇవ్వనుంది. మరోవైపు ఆరోగ్యకర సమాజాన్ని కాంక్షిస్తూ సాంప్రదాయ యోగా, టెన్నీకాయిట్, మారథాన్ పోటీలను ఏర్పాటు చేస్తోంది.

2.99లక్షల మ్యాచ్‌లు.. 52.31లక్షల క్రీడాకారులు

తొలి దశలో భాగంగా 15,004 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 1.50లక్షల మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇక్కడి విజేతలు అనంతరం మండల స్థాయిలో పోటీపడతారు. అంటే 680 మండలాల్లో మొత్తం 1.42లక్షల మ్యాచ్‌లు ఉంటాయి. ఈ దశలో గెలుపొందిన జట్లను నియోజవకర్గ పోటీలకు పంపిస్తారు. 175 నియోజకవర్గాల్లో 5,250 మ్యాచ్‌లలో పోటీలు నిర్వహిస్తారు. వీటిల్లో సత్తా చాటిన వారు జిల్లా స్థాయికి ఆడాల్సి ఉండగా.. 26 జిల్లాల్లో 312 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్ర స్థాయిలో 250 మ్యాచ్‌ల్లో పోటీపడేలా షెడ్యూల్ రూపొందిస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో 34.20లక్షల మంది, మండల స్థాయిలో 17.10లక్షల మంది, నియోజకవర్గ పోటీల్లో 77,520 మంది, జిల్లా స్థాయిలో 19,950 మంది, రాష్ట్ర స్థాయిలో 2,964 మంది 'ఆడుదాం–ఆంధ్ర' క్రీడల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వివిధ దశల్లో కలిపి మొత్తం 52.31లక్షల మంది ఒకే వేదికపై 50 రోజుల పాటు క్రీడా మహోత్సవంలో సందడి చేయనున్నారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్

రాష్ట్రంలో 'ఆడుదాం–ఆంధ్ర' క్రీడా పోటీల రిజిస్ట్రేషన్ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 13 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 15 ఏళ్లకు పైబడిన క్రీడాకారులు (మెన్, ఉమెన్) సమీపంలోని గ్రామ లేదా వార్డు సచివాలయంలో, వాలంటీర్ల ద్వారా, ఆన్‌లైన్‌లో aadudamandhra.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా, 1902కి ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఐదు క్రీడాంశాల్లో గ్రామ/వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. 15,004 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్, కబడ్డీ, ఖోఖోతో పాటు సంప్రదాయ యోగ, టెన్నీకాయిట్, మారథాన్ అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఇప్పటికే క్రీడా సామగ్రిని జిల్లాలకు తరలించామన్నారు. పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు ప్రత్యేక నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఫైనల్స్‌ను విశాఖలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా (ఒక్కొక్క జట్టుకు రూపాయిల్లో)..

స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర
ప్రథమ	35,000	60,000	5,00,000
ద్వితీయ	15,000	30,000	3,00,000
తృతీయ	5000	10,000	2,00,000

బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు బహుమతులు ఇలా (రూపాయిల్లో)..

స్థానం	నియోజకవర్గం	జిల్లా	రాష్ట్ర
ప్రథమ	20,000	35,000	2,00,000
ద్వితీయ	10,000	20,000	1,00,000
తృతీయ	5000	10,000	50,000

మూడు నగరాల్లో సిటీ డయాగ్నోస్టిక్ కేంద్రాలు



విజయవాడలో నిర్మించిన డయాగ్నోస్టిక్ సెంటర్

- తిరుపతి, విజయవాడ, విశాఖల్లో ఏర్పాటు
- నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు వ్యాధి నిర్ధారణ సేవలు మరింత విస్తృతం
- ఒక్కోచోట రూ.20 కోట్లతో ఏర్పాటు
- అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి..

సాక్షి, అమరావతి: నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వ రంగంలో పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించడానికి తొలినుంచి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజారోగ్య సంరక్షణలో అత్యంత కీలకమైన వ్యాధి నిర్ధారణ సౌకర్యాల విస్తరణపైనా ప్రత్యేక దృష్టిపెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామస్థాయిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ మొదలు బోధనాస్పత్రుల వరకూ అన్ని స్థాయిల్లో వైద్య పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని వనరులను సమకూర్చింది. ఈ క్రమంలో ఇప్పుడు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడల్లో 'సిటీ డయాగ్నోస్టిక్' సెంటర్లను అందుబాటులోకి తెస్తున్నారు. ఈ మూడుచోట్లా రూ.20 కోట్ల చొప్పున నిధులతో డయాగ్నోస్టిక్ సెంటర్లతో పాటు, రీజినల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే విజయవాడలో భవన నిర్మాణాలన్నీ పూర్తయ్యాయి. ఇక విశాఖ, తిరుపతిల్లో డిసెంబర్ నెలాఖరులోగా సివిల్ పనులన్నీ పూర్తిచేసేలా వైద్యశాఖ చర్యలు తీసుకుంటోంది.

సేవలన్నీ ఒకేచోట..

పాథాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజీ వంటి వ్యాధి నిర్ధారణ, పరిశోధన సేవలు, పరీక్షలన్నీ ఒకేచోట లభించేలా ఈ కేంద్రాలను తీర్చిదిద్దుతున్నారు. 100 నుంచి 10 వేల ల్యాబ్ టెస్ట్‌లను నిర్వహించేలా బల్క్‌టెస్ట్ ఆటోమిషన్ పరికరాలను ఈ కేంద్రాలకు ప్రతిపాదించారు. అలాగే, డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్స్, 360 డిగ్రీల డెంటల్, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్స్, 1.5 టెస్లా ఎమ్మారై, కలర్ డాప్లర్, మల్టీచానెల్ ఈసీజీ, పాథాలజీ హెమటాలజీ ఎనలైజర్ సహా పలు రకాల అధునాతన రోగ నిర్ధారణ పరికరాలను ఇక్కడ అందుబాటులోకి తీసుకురానున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, సుశిక్షితులైన పారామెడికల్ సిబ్బందితో ఈ కేంద్రాలను నిర్వహిస్తారు.

రిఫరల్ ల్యాబ్స్‌గా అభివృద్ధి..

పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా, బోధనాస్పత్రుల్లో అందుబాటులో లేని నిర్ధారణ పరీక్షలు ఈ సిటీ డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. దీంతో వీటిని రిఫరల్ ల్యాబ్స్‌గా కూడా అభివృద్ధి చేయనున్నారు. అదే విధంగా.. కింది స్థాయి ఆస్పత్రులకు హబ్ స్పోక్ విధానంలో ఇక్కడి సేవలను అందించేలా డిజిటల్ వసతుల కల్పన ఉండనుంది.

షిర్డీ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బోల్తా

టంగుటూరు: షిర్డీ వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ఘటన ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం సమీపంలో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తిరుపతికి చెందిన 35 మంది కుటుంబ సభ్యులు లక్కీ ట్రావెల్స్ బస్సు మాట్లాడుకుని షిర్డీకి బయలుదేరారు. మార్గం మధ్యలో సూరారెడ్డిపాలెం భారత్ పెట్రోల్ బంక్ దగ్గరికి వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తుతో బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా అగ్నిమాపకశాఖ సిబ్బంది, హైవే మొబైల్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సు అద్దాలు పగలకొట్టి లోపల ఉన్న వారిని అతి కష్టం మీద బయటకు తీశారు. గాయపడిన 15 మందిని 108, జాతీయ రహదారి అంబులెన్సుల్లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

12 నుంచి తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ డిసెంబర్ 12 నుంచి తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించారు. 4వ తేదీ నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో సమస్యల పరిష్కారం, కమలేషన్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్(ఏఐజీడీఎస్‌యూ)జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహదేవయ్య డిమాండ్ చేశారు. విజయవాడ వన్‌టౌన్‌లోని తపాలా ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో మహదేవయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పశుగ్రాసాన్ని కాల్చొద్దు



ఎండిన పశుగ్రాసాన్ని కాల్చుతున్న రైతు

కంప్లి: పంట కోతల అనంతరం మిగిలిన ఎండు మేతను కాల్చరాదని అసిస్టెంట్ వ్యవసాయశాఖ డైరెక్టర్ శరణప్ప ముదగల్ రైతులను కోరారు. వరి, చెరకు తదితర పంటలు కోతల అనంతరం నిప్పంటించడం వల్ల భూసారం తగ్గిపోతుందని, అదే విధంగా పొగ వల్ల వాతావరణంలో వాయు కాలుష్యం ఏర్పడుతుదన్నారు. మంటల వల్ల సూక్ష్మజీవి ఉపకార కీటకాలు నాశనమై భూసారం క్షీణిస్తుందన్నారు. వర్షాలు లేక పంటలు అంతంత మాత్రమే పండి దిగుబడులు ఉన్నాయని, ముున్ముందు పశువులకు మేత కరువు రాకుండా రైతాంగం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్

హుబ్లీ: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 360 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం కేశవపుర పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రహస్య సమాచారం అందుకున్న పోలీసులు రెండుచోట్ల దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు.

రౌడీషీటర్‌పై కాల్పులు

హుబ్లీ: రౌడీషీటర్‌పై పోలీసులు కాల్పులు జరిపిన ఘటన శనివారం రాత్రి నగరంలో చేటు చేసుకుంది. నటోరియస్ రౌడీషీటర్ సతీశ్‌పై హుబ్లీ టౌన్ స్టేషన్ ఎస్ఐ రఫీక్ కాల్పులు జరిపి అరెస్ట్ చేశాడు. సతీశ్‌పై హత్యలు, హత్యా యత్నాలు, కిడ్నాప్‌లు నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో సతీశ్ హుబ్లీ వచ్చినట్లు సమాచారం అందుకున్న టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రఫీక్ సిబ్బందితో సతీశ్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. సిబ్బందిలోని మరో ఎస్ఐ వినోద్‌పై రౌడీషీటర్ సతీశ్ కత్తితో, రాళ్లతో దాడి చేసి పారిపోవడానికి యత్నించాడు. దీంతో ఎస్ఐ రఫీక్ నిందితుడి కాలిపై కాల్పులు జరపడంతో అతను కుప్పకూలిపోయాడు. నిందితుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

నగరంలో గౌరీ నోముల సందడి

- చక్కెర హారతులకు డిమాండ్



చక్కెర హారతులను కొనుగోలు చేస్తున్న దృశ్యం

బళ్లారి అర్బన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక బెంగళూరు రోడ్డులోని గౌరీ నోముల పండుగ సామగ్రిని కొనుగోలులో స్థానికులు సందడిగా కనిపించారు. గౌరీ నోముల దారాలతో పాటు చక్కెర హారతులను కొనుగోలు చేశారు. కిలో చక్కెర హారతులు రూ.150ల వరకు పలికాయి.

సమాజానికి పాత్రికేయులు వారధి



మొక్కకు నీరు పోస్తున్న అతిథులు

రాయచూరు రూరల్: సమాజానికి పాత్రికేయులు వారధిలాంటి వారని కన్నడ దిన పత్రిక కార్య నిర్వాహక సంపాదకుడు రవీంద్ర భట్ అన్నారు. ఆదివారం పాత్రికేయుల కార్యాలయంలో రిపోర్టర్స్ గిల్డ్, జిల్లా పాత్రికేయులు, సంపాదకుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పత్రికా దినోత్సవంలో మాట్లాడారు. నేడు యువకులు పత్రికా రంగంలో ముందుకు వస్తున్నారని సమాజంలో పేరుకు పోయిన సమస్యలపై స్పందించాలన్నారు. అంతకు ముందు డా.అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా అధికారి దురుగేశ్, అదనపు ఎస్పీ శశికుమార్, వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు గురునాథ్, ప్రధాన కార్యదర్శి పాషా, రాష్ట్ర సభ్యుడు శివమూర్తి, రిపోర్టర్ గిల్డ్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, అధ్యక్షుడు చెన్నబసవ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణల్ని పట్టించుకోరాదు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

మండ్య: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయి, వాటిని ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి అన్నారు. ఆదివారం మండ్యలో కనక భవనంలో జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మాన వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. దానిని చూసి తట్టుకోలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు.

చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం



కుండీలలో పేరుకు పోయిన చెత్త



ఓ ప్రాంతంలో అదృశ్యమైన డస్ట్‌బిన్‌లు



మరో ప్రాంతంలో విరిగిపోయిన దృశ్యం

- తరలింపు పట్టని కోలారు నగరసభ
- డస్ట్‌బిన్లు దొంగలమయం

కోలారు: కోలారు నగరంలో చెత్త సేకరణ, నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసిన చెత్త చెదారం పేరుకుపోయింది. ఇక నగరంలోని 35 వార్డుల్లో రూ. 13 లక్షల వ్యయంతో స్టీల్ చెత్త కుండీలు ఏర్పాటు చేశారు. కూడళ్లలో ఎంతో ఆకట్టుకునే విధంగా వీటిని ఉంచారు. అయితే నిర్వహణ లోపం కారణంగా అవి నిరుపయోగంగా మారాయి. ప్రభాత్ టాకీస్‌తో పాటు పలు ప్రాంతాలలో స్టీల్ చెత్తకుండీలు విరిగిపోయి నిరుపయోగంగా ఉన్నాయి.

పేరుగొప్ప, ఊరుదిబ్బ:

నగరంలో పేరుకు తగ్గట్టుగా కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డస్టుబిన్లు ఎంతో ఆకర్షనీయంగా ఉన్నాయి. నిర్వహణ లేకపోవవడంతో అక్కడ చెత్త పేరుకుపోతోంది. మరోవైపు పీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన చెత్తకుండీలు ఏకంగా అదృశ్యమయ్యాయి. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త నిర్వహణ అధ్వానంగా మారడంతో వీటిపై అధికారులను నిలదీస్తే పౌర కార్మికుల సమస్య ఉందని సాకులు చూపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చెత్త నిర్వహణ, సేకరణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

డీకేశి చేతిలో ప్రభుత్వం కీలుబొమ్మ

- మాజీ మంత్రి శ్రీరాములు

కోలారు: ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ చేతిలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలుబొమ్మగా మారిపోయిందని మాజీ మంత్రి శ్రీరాములు ఆరోపించారు. ఆదివారం తన కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను ముళబాగిలు తాలూకా కురుడుమలై వినాయక దేవాలయంలో పూజలు నిర్వహించడానికి వచ్చిన సమయంలో విలేకరులతో మాట్లాడారు. డికె శివకుమార్‌పై జరుగుతున్న సీబీఐ విచారణను రాష్ట్ర క్యాబినెట్ ఉపసంహరించుకోవడం చట్టానికి తూట్లు పొడిచినట్లేనన్నారు. కాంగ్రెస్‌కు చట్టాలపై విశ్వాసం లేదన్నారు. తన 30 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఇలాంటి కేసును ఇంతవరకు చూడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందనే దానికి ఇదే ఒక చక్కటి నిదర్శనమన్నారు. మూర్ఖ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు. ఆరు నెలలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదు. ఆరు నెలల్లోనే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ గ్యారెంటీ హామీలు కనీసం 25 శాతం మందికి కూడా అందడం లేదని ఆరోపించారు. సోమణ్ణ, యాత్నాళ్ ఎవరూ బీజేపీని వదలి వెళ్లరని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. పార్టీ నూతన అధ్యక్షుడు బి వై విజయేంద్ర నేతృత్వంలో పార్టీని నడిపించడానికి సహకరిస్తామన్నారు. గాలి జనార్ధనరెడ్డి బీజేపీలోకి వస్తే తాము స్వాగతిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, నరసింహరాజు, విజయకుమార్, కెంబోడి నారాయణ స్వామి, తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.



కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

మానసికోల్లాసానికి క్రీడలు

- ఎస్పీ రంజిత్ కుమార్ బండారి
- విజేతగా జిల్లాధికారి జట్టు

సాక్షి,బళ్లారి: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పోలీసు డీఆర్‌ఏఏ మైదానంలో ఏటా నిర్వహించే పోలీసు క్రీడా వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ముందుగా రెవెన్యూ, పోలీసు, పాత్రికేయులుకు, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. నాలుగు టీమ్‌లు పోటీలు పాల్గొన్నాయి. ముందుగా రెవెన్యూ శాఖ జిల్లాధికారి జట్టుకు, ఎస్పీ జట్టుకు మొదటి మ్యాచ్ జరగగా, 8 ఓవర్లలో ఎస్పీ కార్యాలయ జట్టు 29 పరుగులు చేసి విజయం సాధించారు. అనంతరం పోలీసులకు, పాత్రికేయులకు పోటీలు జరిగాయి. 8 ఓవర్లలో పాత్రికేయ బృందం మొదట బ్యాటింగ్ తీసుకుని 89 పరుగులు చేయగా, ఎస్పీ కెప్టెన్‌గా పోలీసులు 8 ఓవర్లలో 90 పరుగులు సాధించి విజయం సాధించారు. అనంతరం ఎస్పీ టీమ్, జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ జట్టుకు పోటీ నిర్వహించగా, ఇందులో రెండు టీమ్‌లు 104 పరుగులు చేయడంతో అదనపు ఓవర్ తీసుకుని పోటీ నిర్వహించగా, ఒక ఓవర్‌లో ఎస్పీ జట్టు ఒక రన్ చేయగా, జిల్లాధికారి జట్టు ఒక ఓవర్‌లో రెండు పరుగులు చేయడంతో జిల్లాధికారి జట్టును విజేతగా ప్రకటించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, పాత్రికేయులకు నిత్యం పని ఒత్తిడితో పనిచేస్తుంటారని, క్రీడలు ఆరోగ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయని అన్నారు.



క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న ఎస్పీ రంజిత్ బండారి

- పులి ఎక్కడ



మైసూరు జిల్లాలో బందీపుర అడవుల్లో హెడియాల రేంజిలో ఇటీవల పెద్ద పులి ఒక మహిళను చంపింది. ఆ పులిని పట్టుకోవడానికి అటవీ సిబ్బంది వచ్చిన దృశ్యం. డ్రోన్ కెమెరాలతో పులి కోసం గాలింపు సాగుతోంది.

వైభవంగా యాజ్ఞవల్క్య జయంతి

కోలారు/మాలూరు: కోలారు, మాలూరు పట్టణాలలో ఆదివారం శ్రీ యాజ్ఞవల్క్య సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా యజ్ఞవల్క్య జయంతిని నిర్వహించారు. కోలారులోని గాయత్రీ ప్రార్థనా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో యాజ్ఞవల్క్య బ్రాహ్మణ సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన యాజ్ఞవల్క్యబ్రాహ్మణ ప్రముఖుడు అశ్వత్థ యాజ్ఞవల్క్య మహర్షి గురించి వివరించారు. ఈ సందర్భంగా పదవ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన సముదాయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో యాజ్ఞవల్క్య సేవా ట్రస్టు అధ్యక్షుడు అశ్వర్థనారాయణ, ట్రస్టీలు జె జనార్ధనరావు, ఎస్ రవీంద్ర, కె సత్యనారాయణ, కె రవికుమార్, కె రామమూర్తి, బిఎస్ మంజునాథ్, కెఎన్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాలూరులో శోభాయాత్ర దృశ్యం

మాలూరులో:

మాలూరు పట్టణంలో యాజ్ఞవల్క్య సేవా సమితి ఆధ్వర్యంలో జయంతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద బ్రహ్మశ్రీ కిరణ్ భరద్వాజ్ నేతృత్వంలో వివిధ ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాజ్ఞవల్క్య మహర్షి భావచిత్రాన్ని పల్లకీలో ఉంచి పట్టణంలో ఊరేగించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జయరావ్, విఠల్‌రావ్ పాల్గొన్నారు.

రేపు మేయర్ ఎన్నిక

- రేసులో నలుగురు కార్పొరేటర్లు

సాక్షి,బళ్లారి: బళ్లారి నగర మేయర్ ఎంపిక ఈ నెల 28న జరగనుంది. రెండవ అవధి కింద నగర మేయర్‌గా ఎన్నుకోబడిన త్రివేణి ఒప్పందం ప్రకారం రాజీనామా చేయడంతో మంగళవారం ఎన్నిక నిర్వహించనున్నారు. మేయర్ పదవికి నలుగురు పోటీ పడుతున్నారు. ఎస్సీ జనరల్‌కు రిజర్వు కావడంతో ఆ వర్గానికి చెందిన కుబేర, శ్వేత, ఉమాదేవి శివరాజ్, మించు శ్రీనివాస్ బరిలో ఉన్నారు. 2020లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లు, బీజేపీ తరుపున 13 మంది కార్పొరేటర్లు, స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం చేజిక్కించుకునేందుకు తగినంత కార్పొరేటర్లు గెలుపొందడంతో పాటు, ఇండిపెండెంట్‌గా గెలిచిన ఐదుగురు కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవడంతో కాంగ్రెస్ పార్టీ సంఖ్య 26కు చేరింది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన మించు శ్రీనివాస్‌తో పాటు మరో ముగ్గురు మేయర్ స్థానం దక్కించుకునేందుకు పైరవీలు చేస్తున్నారు. మేయర్ స్థానం దక్కాలంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాగేంద్ర, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆశీస్సులు తప్పనిసరి. వీరిద్దరి నేతలతో పాటు రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్ కూడా చక్రం తిప్పుతారు. ఈ నేపథ్యంలో నలుగురు కార్పొరేటర్లు పదవిని దక్కించుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.



నగర కార్పొరేషన్

హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో హిందూ ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బీదర్ సచ్చిదానంద సిద్దరూడ మఠం మాతా అమృతానందమయ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కలబుర్గిలోని కల్యాణ మంటపంలో హిందూ జన జాగృతి సమితి ఏర్పాటు చేసిన రెండు రోజుల ప్రాంతీయ సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. దేశంలో లవ్ జిహాద్‌లు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాన్వెంట్ పాఠశాలల వల్ల ధర్మాచారణ దారి తప్పిందన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ ఉత్తర ప్రాంత ఉపాధ్యక్షుడు లింగరాజ్ అప్ప, బ్రహ్మణ సమాజం అధ్యక్షుడు రవి లాతూర్, హిందూ జన జాగృతి సమితి సభ్యులు పాల్గొన్నారు.

కన్నడ రక్షణకు కార్మికుల్లా శ్రమించాలి

శ్రీనివాసపురం: కన్నడ భాష, సాహిత్య రక్షణకు కన్నడ ప్రేమికులు కార్మికుల్లాగా శ్రమించాలని, అప్పుడు కన్నడ భాష మనుగడ సాధ్యమవుతుందని తహసీల్దార్ జీఎస్ సుధీంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని పురసభ కార్యాలయం ముందు కన్నడ ధ్వజ స్తంభం వద్ద నిర్వహించిన కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సరిహద్దు ప్రాంతమైన శ్రీనివాసపురం తాలూకాలో చాలా మంది ఇతర భాష మాట్లాడేవారే అధికంగా ఉన్నా కన్నడ భాషపై ఏమాత్రం ప్రేమ అభిమానం తగ్గలేదన్నారు. స్థానికులకు కన్నడ భాష ప్రాముఖ్యత పట్ల అవగాహన కలిగించాల్సి ఉందన్నారు. సరిహద్దు ప్రాంతాలలో కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరు చేతులు కలపాలన్నారు,. ఈ సందర్భంగా క్రీడాకారులు, నివృత్త సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమాదేవి, కస్తూరి కర్ణాటక వేదిక తాలూకా అధ్యక్షుడు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యోత్సవంలో పాల్గొన్న తహసీల్దార్

ఆలయాల్లో కార్తీకశోభ



శివాలయాల్లో కార్తీక దీపాలను వెలిగిస్తున్న దృశ్యం



బళ్లారి అర్బన్: కార్తీక మాసం సందర్భంగా బళ్లారి నగరంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం సాయంత్రం కార్తీక దీపాలను వెలిగించి భక్తులు మొక్కులను తీర్చుకొన్నారు. కోట మల్లేశ్వర, పెద్ద మార్కెట్‌లోని నీలకంఠేశ్వర ఆలయం, ఎస్ఎన్‌పేట్ కాశీ విశ్వేశ్వర ఆలయం, బెంగళూరు రోడ్డులోని నగరేశ్వర ఆలయం, చిన్నమార్కెట్ మల్లికార్జున స్వామి ఆలయం తదితర వాటితో పాటు శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఆలయాల్లో, బళ్లారి శ్రీకనక దుర్గమ్మ ఆలయాల్లో కార్తీక పూజలు చేశారు. మహిళలు 365 వత్తుల దీపాలను వెలిగించి ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పిల్లల భవిష్యత్తుకు టీచర్లు పునాదులు వేయాలి



మొక్కలకు నీరు పోస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాదులు వేయాలని శ్రీరామకృష్ణ వివేకానంద ఆశ్రమ అధ్యక్షుడు నిర్భయానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం యరమరాస్ హచ్‌కెఇ సంస్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జీవిత మౌల్యాలు- క్రమశిక్షణ అంశంపై మాట్లాడారు. ఉపాధ్యాయులు పిల్లల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు గిరిజా శంకర్, ప్రిన్సిపాల్ బసవరాజ్, వేణు గోపాల్, అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక జ్ఞానాన్ని పెంచుకోవాలి

శ్రీనివాసపురం: విద్యార్థులు వ్యవహారిక జ్ఞానాన్ని పెంచుకోవాలని సాహితి చౌడరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో సుగ్గి సంభ్రమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగు పరచడంలో సంతలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. మారుతున్న పరిస్థితులలో కూడా సంతలు తమ ప్రాధాన్యతను కోల్పోలేదన్నారు. సంతలలో వస్తువులు కొనుగోలు గ్రామీణులకు పరిపాటిగా మారిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా వైజ్ఞానిక జ్ఞానాన్ని పెంచుకోవడం మంచిదన్నారు. సాహిత్యాలలో కూడా సంతల మహత్యం గురించి చెప్పబడిందన్నారు. ప్రిన్సిపాల్ ప్రాణేష్ మాట్లాడుతూ... సంత భారతీయ ఆర్థికతకు మూల ద్రవ్యమన్నారు. సంతలలో క్రయ విక్రయాలలో ఎంతో తెలివి తేటలు ఉండాలన్నారు. కార్యక్రమంలో సాహితి శంకరేగౌడ, ఉపన్యాసకులు ఎస్ వాసు, మంజునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

- పరిశుభ్రత ఏదీ?



హంపీ అంటే దేశ విదేశాల్లో పర్యాటక నగరంగా పేరుంది. నిత్యం వందలాది మంది పర్యాటకులు, విదేశీయులు హంపీ శిల్ప సౌందర్యాన్ని చూడాలని వస్తుంటారు. కానీ వారికి బురద రోడ్లతో అవస్థలు తప్పడం లేదు. ఆదివారం విరూపాక్ష ఆలయం ముందు రోడ్డుపై కనిపించిన మురుగునీరు. పర్యాటకుల నుంచి లక్షల రూపాయల ఆదాయం వస్తుండగా, వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదనే ఆరోపణలున్నాయి.

నేటి నుంచి రాజ్యోత్సవ వేడుకలు

కోలారు: భువనేశ్వరి కన్నడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు నగరంలోని గాంధీవనం వద్ద కన్నడ రాజ్యోత్సవాలను నిర్వహిస్తున్నట్లు భువనేశ్వరి కన్నడ సంఘం జిల్లా అధ్యక్షుడు కెఆర్ త్యాగరాజ్ తెలిపారు. ఆదివారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం 27వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రముఖ హాస్య కళాకారులు రిచర్డ్ లూయిస్ బృందం మిమిక్రీ కార్యక్రమం, 28 సాయంత్రం గోపి, కిర్లోస్కర్ బృందంచే నగెహబ్బ కార్యక్రమం, 29న అవినాశ్ లైట్ మ్యూజికల్ ట్రూప్‌చే సంగీత రసమంజరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పెద్ద సంఖ్యలో నగర ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం పదాధికారులు కెఆర్ ధనరాజ్, సతీష్, ఎస్ఎన్ ప్రకాష్ మామి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో సంఘం సభ్యులు

పాతకక్షలతో వ్యక్తి హత్య

శ్రీనివాసపురం: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిని కొడవలితో నరికి చంపిన ఘటన శనివారం రాత్రి ముళబాగిలు తాలూకా మిణజేనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. హతుడిని సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ (48)గా గుర్తించారు. మంజునాథ్ బంగారుపేట తాలూకా మాదముత్తన హళ్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తితో తరచుగా గొడవ పడుతుండేవాడు. పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగింది. మంజునాథ్ రెండవ భార్య వివాహేతర సంబంధమే హత్యకు కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంజునాథ్ తన మొదటి భార్యతో దూరంగా ఉండి రెండవ భార్య నేత్రతో కలిసి ఉంటున్నాడు. నేత్ర, ఆమె ప్రియుడు కలిసి తన భర్త మంజునాథ్‌ను హత్య చేశారని మొదటి భార్య సౌభాగ్యమ్మ ఆరోపిస్తోంది. అయితే రూ. 40 వేల కోసం ఇద్దరి మధ్య గొడవలు జరిగాయని బంధువులు చెబుతున్నారు. మృతుడి మామ నాగరాజ్ ఫిర్యాదుతో పోలీసులు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు బద్ధులు కావాలి



ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు

రాయచూరు రూరల్: దేశ రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని అదనపు జిల్లాధికారి దురుగేష్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాధికారి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాలను జరిపారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదే విధంగా అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, తదితరులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ శశికుమార్, అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అందరి హక్కు



మొక్కలను నాటుతున్న ఆప్ నాయకులు

బళ్లారి అర్బన్: డాక్టర్ బాబాసాహేబ్ అంబేడ్కర్ రాజ్యాంగం రచించిన ఈ రోజును దేశ వ్యాప్తంగా రాజ్యంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లాధ్యక్షుడు జేవి మంజునాథ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకనక దుర్గమ్మ దేవస్థానం సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో ఆ పార్టీ నేతలు మొక్కలను నాటి రాజ్యాంగ గ్రంధాన్ని విడుదల చేసి మాట్లాడారు. రాజ్యాంగం మనందరి హక్కు అని, ప్రతి ఒక్కరు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆప్ పదాధికారులు చెళ్లగుర్కి శరణ బసవనగౌడ, నాగరాజుగౌడ, ఉప్పర వెంకటేష్, నూరుభాష, సిరివార దేవేంద్ర, వడ్డే హాలెప్ప, శేఖర్, ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిట్టెమ్మ, ఉపాధ్యాయులు శేఖరప్ప, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు రాజయ్యవెంకటేష్, ముస్తాఫ పాల్గొన్నారు.